జూన్, 2011

# స్థానిక పాలన

## గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 3 సంచిక: 5 పేజీలు: 64 వెల: రూ. 20/-




**అపార్డు వార్షిక శిక్షణా క్యాలండరును విడుదల చేస్తున్న రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రివర్యులు శ్రీ డి. మాణిక్యవరప్రసాద్**




ఇ-సెమినార్ హాల్‌ను ప్రారంభిస్తున్న
గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి
గౌ॥ శ్రీ మాణిక్యవరప్రసాద్



ఇ-సెమినార్ హాల్‌లో
కీ-క్యాప్ కార్యక్రమంపై
సమీక్ష



భారత్ నిర్మాణ్ వాలంటీర్ సి.డి.ని
విడుదల చేస్తున్న
మంత్రివర్యులు



'అపార్డు' కార్యక్రమాలను
సమీక్షిస్తున్న మంత్రివర్యులు

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 3 సంచిక: 5

జూన్, 2011

చీఫ్ ఎడిటర్

**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.

ఎడిటర్

**డా॥ వి. శివశంకర ప్రసాద్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)

**జి. గంగాధరం**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ లీలా ప్రసాద్**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ కె. లక్ష్మీపతి**

**ఎమ్. విజయలక్ష్మి**

**ఎ. సుభాష్‌చంద్ర గౌడ్**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**

హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్

రాజేంద్రనగర్

హైదరాబాద్-500 030

ఆంధ్రప్రదేశ్, ఇండియా

ఫోన్ : 040-24018656

ఫ్యాక్స్ : 040-24017005

E-mail : krishna.chandramouli90@gmail.com

editorsthanikapalana@gmail.com

# విషయ సూచిక

సంపాదకీయం .......... 2

అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల దరి చేర్చటానికే ల్యాబ్ టు ల్యాండ్ కీ - క్యాప్ కార్యక్రమం .......... 3

ఉత్తమ గ్రామ పంచాయితీల విజయగాథలను డాక్యుమెంటు చెయ్యాలి .. 4

అప్నా సహకారం అమోఘం .......... 5

అభివృద్ధి ఒక నిరంతర ప్రక్రియ "గ్రామ పునర్నిర్మాణానికి భారత నిర్మాణ్ వాలంటీర్లుగా యువత ముందుకు రావాలి" .......... 6

చీదేడులో పారిశుద్ధ్య ప్రచారం నిర్వహిస్తున్న ఆచార్య ఎన్.జి. రంగా యూనివర్సిటీ విద్యార్థినులు .......... 7

చీదేడు గ్రామంలో కీ - క్యాప్ .......... 8

పారిశుద్ధ్య లోపమే మానవ మనుగడకు పెద్ద శాపం .......... 9

బి.పి.ఎల్. సర్వేకు కేంద్రం పచ్చ జెండా .......... 10

ప్రభుత్వ పాఠశాలల్లో అకడమిక్ మానిటరింగ్ కమిటీలు .......... 11

జాతి పునర్నిర్మాణానికి భారతనిర్మాణ్ వాలంటీర్లు .......... 13

పారిశుధ్య వసతులతోనే ఆరోగ్యం పదిలం .......... 17

సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమంలో ప్రజలు పాల్గొనాలి .......... 19

మంచినీటి సరఫరాలో విధిగా పాటించవలసిన సూచనలు .......... 20

మహిళలకు రక్షణగా 'గృహహింస నిరోధక చట్టం' .......... 21

ఆరోగ్య విపత్తులపైనా దృష్టి పెట్టాలి .......... 22

దక్షులెవ్వార ఉపేక్ష సేసిరి... 'వెంటాడే వాక్యం' .......... 24

హాజీపల్లిని సందర్శించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి .......... 25

పంచాయితీలకు సహాయకారిగా భారత్ నిర్మాణ్ వాలంటీర్లు .......... 26

పశ్చిమంలో పరిశుభ్ర కుసుమం - సురాపురం .......... 28

అంతర్జాతీయ స్థాయికి మన గ్రామీణ కబడ్డీ .......... 32

భారత్ నిర్మాణ్ వాలంటీర్ల శిక్షణ దేశానికే ఆదర్శప్రాయం .......... 35

తరిగిపోతున్న ప్రకృతి వనరులు - పొంచి ఉన్న పెను ప్రమాదం .......... 36

రక్తహీనతను అధిగమించటం ఎలా .......... 38

రహదారి దేవుడు (కథ) .......... 40

పేదల సాధికారతకు సాధనం .......... 43

రండి ! నిర్మల గ్రామాలుగా అవతరిద్దాం !! .......... 49

రైలుబండిలో వైతాళికులు .......... 52

కల నిజమైంది - గ్రౌండ్ దొరికింది .......... 57

సీతాకోక చిలుక (కథ) .......... 58

మన ఆరోగ్యంలో ఖనిజ లవణాల పాత్ర .......... 61

# సంపాదకీయం..

జూన్, 2011

## అడవులు, ప్రకృతి... మీ సేవలో...

లక్షలాది సంవత్సరాలుగా భూమిపై నివశిస్తున్న సమస్త జీవజాలం సురక్షితంగా ఉండాలన్నా, వేలాది సంవత్సరాలుగా విలసిల్లుతున్న మానవ నాగరికత సంరక్షింపబడాలన్నా, ఈ భూగోళం, దానిపై ఉండే పర్యావరణం పదిలంగా ఉండాలి. లేకుంటే, ఇప్పటికే అంతరించిపోయిన, అనుదినం అంతరించిపోతున్న లక్షలాది ప్రాణులతో పాటు, మానవ మనుగడకే ప్రమాదం ఎదురయ్యే పరిస్థితి కనపడుతోంది.

అందుకే ఈ భూగోళాన్ని, దానిపై ఆవరించి ఉండే పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఏటా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రపంచదేశాలు ఏప్రిల్ 23న ప్రపంచ భూమి దినోత్సవాన్ని, జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి.

1972లో మొదటిసారి ఐక్యరాజ్యసమితి జూన్ 5 నుంచి 16 వరకు మానవ పర్యావరణంపై సదస్సును నిర్వహించింది. ప్రతి ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాలని ఈ సదస్సులో నిర్ణయం తీసుకున్న ఫలితంగా, 1973 సంవత్సరంలో జూన్ 5న మొదటిసారిగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఏటా జూన్ 5న వివిధ దేశాల్లోని ఒక్కొక్క నగరం ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి అతిథ్యం ఇస్తుంటుంది. ఒక్కొక్కసారి ఒక్కొక్క అంశంపై కార్యక్రమాలు జరుగుతాయి.

పర్యావరణ దినోత్సవ థీమ్‌లను పరిశీలిస్తే, అవెంత ఉపయోగకరమైన అంశాలో అర్థమవుతోంది. 1974లో 'ఒకే ఒక భూమి', 1975లో 'మానవ ఆవాసాలు', 1976లో 'నీరు: జీవానికి ప్రాణాధారం', 1977లో 'ఓజోన్ పొర - పర్యావరణ జాగ్రత్తలు', 1978లో 'విధ్వంసం లేని అభివృద్ధి', 1979లో 'మన పిల్లలకు ఒకే ఒక భవిష్యత్తు', 1980లో 'నూతన దశాబ్దానికి నూతన సవాలు', 1981లో 'భూగర్భ జలాలు - మానవ ఆహార వలయంలో విషపూరిత రసాయనాలు', 1982లో 'స్టాక్‌హోమ్ తరువాత 10 సంవత్సరాల సమీక్ష', 1983లో 'ప్రమాదకరమైన వ్యర్థ పదార్థాల నిర్వహణ', 1984లో 'ఎడారీకరణ', 1985లో 'యువత-జనాభా, పర్యావరణం', 1986లో 'శాంతికి ఒక మొక్క', 1987లో 'పర్యావరణం-షెల్టర్, 1988లో 'పర్యావరణానికి ప్రాధాన్యం - అభివృద్ధికి శాశ్వతం', 1989లో 'గ్లోబల్ వార్మింగ్ - గ్లోబల్ వార్నింగ్', 1990లో 'పిల్లలు - పర్యావరణం', 1991లో 'వాతావరణ మార్పు - ప్రపంచ భాగస్వామ్య అవసరం', 1992లో 'ఒకే ఒక భూమి - కేర్ అండ్ షేర్', 1993లో 'పేదరికం - పర్యావరణం: విషవలయాన్ని ఛేదిద్దాం', 1994లో 'ఒక భూమి, ఒక కుటుంబం', 1995లో 'పర్యావరణం కోసం కలిసికట్టుగా ప్రజలు', 1996లో 'మన భూమి, మన ఆవాసం, మన ఇల్లు', 1997లో 'భూమిపై జీవం కోసం', 1998లో 'సముద్రాలను కాపాడుకుందాం', 1999లో 'మన భూమి - మన భవిష్యత్తు', 2000లో 'పర్యావరణ మిలీనియం', 2001లో 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న జీవంతో అనుబంధం', 2002లో 'భూమికి అవకాశం ఇద్దాం', 2003లో 'నీరు: 200 కోట్ల మంది ప్రజలు దీని కోసం మరణిస్తున్నారు', 2004లో 'సముద్రాలు కావాలి - మరణించా, సజీవంగానా?', 2005లో 'పచ్చని నగరాలు - భూమి కోసం', 2006లో 'ఎడారులు - ఎడారీకరణ - మెట్ట భూములను ఎడారులుగా మార్చవద్దు', 2007లో 'కరుగుతున్న మంచు', 2008లో 'తక్కువ కార్బన్‌తో కూడిన ఆర్థిక వ్యవస్థ వైపు', 2009లో 'మీ గ్రహం మీ సేవలను కోరుతోంది - వాతావరణ మార్పులను ఆపడానికి ఏకంకండి', 2010లో 'అనేక జాతులు - ఒకే గ్రహం - ఒకే భవిష్యత్తు' మొదలైన థీమ్‌లపై కార్యక్రమాలను కేంద్రీకరించారు.

2011లో 'అడవులు - ప్రకృతి మీ సేవలో' అనే అంశాన్ని ఐక్యరాజ్యసమితిలోని పర్యావరణ విభాగం నిర్ణయించింది. ఈ కార్యక్రమాలకు ఈసారి భారతదేశం ఆతిథ్యం ఇవ్వనున్నది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. భారతదేశంలోని మొత్తం భూభాగంలో 20 శాతం మేర అటవీ విస్తీర్ణం ఉంది. మానవ మనుగడకు, ఇతర జీవరాశుల అస్తిత్వానికి అడవులే ముఖ్యాధారమని ప్రజల్లో, ప్రభుత్వాల్లో అవగాహన రేకెత్తించడానికి ఈ థీమ్‌ని నిర్ణయించటం జరిగింది.

సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీటవేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ఫ్లాగ్ షిప్ కార్యక్రమాలలో పర్యావరణ పరిరక్షణకు నిర్దేశించుకొన్న లక్ష్యాలు స్పష్టంగా గోచరిస్తాయి. దేశంలో అడవుల సంరక్షణకు, సామాజిక వనాల పెంపుదలకు అటవీశాఖ చేస్తున్న ప్రయత్నాలకు అదనంగా కేంద్ర, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలు పలు పథకాలు అమలు చేస్తున్నాయి. వీటిలో ప్రధానంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్రింద అడవుల పెంపకాన్ని ప్రోత్సహించటం, సమీకృత బంజరు భూముల అభివృద్ధి పథకం, సమీకృత వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాల క్రింద అటవీ, భూ సంరక్షణకు అవకాశం కల్గించారు. మన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద సామాజిక వనపథకంలో నాటటానికి 3000 నర్సరీలను అభివృద్ధి పరిచింది.జూలై నెలాఖరు లోపు 30 కోట్ల మొక్కలు నాటటానికి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది.

పర్యావరణానికి, భూమి భద్రతకు ప్రతి మొక్కా, ప్రతి చెట్టూ, ప్రతి అడవీ విలువైనవే. ఉన్న వాటిని కాపాడుకుంటూ, కొత్త వాటిని పెంచుకుంటేనే మన భవిష్యత్తు, మన పిల్లల భవిష్యత్తు భద్రం.

( కె. చంద్రమౌళి )

# అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దరి చేర్చటానికే ల్యాబ్ టు ల్యాండ్ కీ - క్యాప్ కార్యక్రమం




**వార్తల్లో 'అపార్డ్'**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ అభృవద్ధి సంక్షేమ కార్యక్రమాలపై గ్రామీణ ప్రజలలో అవగాహన తీసుకొని రావటానికి ఎ.ఎం.ఆర్. అపార్డ్ చేస్తున్న కృషి ఆమోఘమని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ డి. మాణిక్య వరప్రసాద్ అన్నారు. మే 19 న అపార్డును సందర్శించిన మంత్రి శ్రీ మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజల సాధికారతే లక్ష్యంగా అపార్డు అమలు చేస్తున్న కీ-క్యాప్ కార్యక్రమం వల్ల రంగారెడ్డి జిల్లా మంచాల మండలం చీదేడు గ్రామంలో వచ్చిన సామాజిక చైతన్యం యావత్ రాష్ట్రానికీ మార్గదర్శకం అని అన్నారు.**

కేవలం 6 నెలల్లో చీదేడు గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దటం, గ్రామంలో విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్య రంగాలలో సాధించిన కృషి అభినందనీయం అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మద్యపాన నిషేధం, పారిశుద్ధ్యం, రెండు క్లిష్టమైన సమస్యలని, చీదేడు గ్రామ పంచాయితీ ఈ రెండు రంగాలలో మార్పు సాధించటం ఆదర్శనీయమని, తాను ఈ గ్రామాన్ని త్వరలో సందర్శిస్తానని అన్నారు. చీదేడులో అపార్డ్ చేసిన కీ-క్యాప్ ప్రయోగం గూర్చి కమీషనర్ కె. చంద్రమౌళి అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో వివరించారు. మంత్రి శ్రీ మాణిక్య వరప్రసాద్ అపార్డ్ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. అపార్డులో సుమారు 50 లక్షల రూపాయలతో అధునాతన శిక్షణా సౌకర్యాలతో నిర్మించిన. "ఇ - సెమినార్ హాల్"ను ప్రారంభించారు. ఇంటర్‌నెట్, వీడియో కాన్ఫరెన్సు సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ - కాన్ఫరెన్సు హాలు మరే ఇతర యస్.ఐ.ఆర్.డి.లలో లేదని అపార్డు కమీషనరు కె. చంద్రమౌళి వివరించారు. వీడియో కాన్ఫరెన్సు సదుపాయంతో మంత్రి మాణిక్య వర ప్రసాద్ 5 ప్రాంతీయ శిక్షణా సంస్థలతో సంభాషించారు. చీదేడులో జరిగిన కీ - క్యాప్ ప్రయోగం తన నియోజక వర్గంలో మండలానికి ఒక్క గ్రామంలో చేపట్టాలని అపార్డును కోరారు. ఈ సందర్భంగా అపార్డు వార్షిక క్యాలండరు 2011-12ని రాష్ట్ర మంత్రి మాణిక్య వరప్రసాద్ విడుదల చేసారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్‌ల శిక్షణకు సంబంధించిన సి.బి.టి.ని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి రెడ్డి సుబ్రహ్మణ్యం విడుదల చేసారు.











# ఉత్తమ గ్రామ పంచాయితీల విజయగాధలను డాక్యుమెంటు చెయ్యాలి

## - అపార్డు కమీషనర్

**శిక్షణా సంస్థలలో పనిచేసే ఫ్యాకల్టీ నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ పథకాలలో, నిర్ణయాలలోనూ, ప్రజల అవసరాలకు తగినట్లుగా శిక్షణాంశాలుగా రూపొందించటంలో తక్షణం స్పందించే విధంగా ఉండాలని అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి అన్నారు.**

రాజేంద్రనగర్ ఇ.టి.సి.లో నిర్వహించిన ఫ్యాకల్టీ సామర్థ్యాల పెంపుదల వర్కుషాపును ప్రారంభించిన అపార్డు కమీషనరు మాట్లాడుతూ. ఇ.టి.సి. లలో పనిచేస్తున్న ఫ్యాకల్టీ ఎప్పటికప్పుడు నూతన శిక్షణాంశాలను రూపొందించటంలోనూ, కోర్సు ఉద్దేశ్యాలను స్పష్టంగా రాయగలగటం, వ్యక్తపరచటంలోనూ తగిన సామర్థ్యాలను సంతరించుకోవాలని చెప్పారు. ఉత్తమ పంచాయితీలను, ఆదర్శ గ్రామాల విజయగాధలను రూపొందించుటలో తగిన మెళకువలు పాటించి, అక్షర బద్ధం చేయటం అలవాటు చేసుకొనగల్గితే భవిష్యత్తులో మంచి రచయితలుగా, వ్యాసకర్తలుగా ఎదగటానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యాలయాలలో పనిచేసే సిబ్బందికి తగిన వ్రాత నైపుణ్యం లేకపోతే నోటుఫైలుకు, ఉత్తరానికి తేడా లేకుండా వ్రాసే ప్రమాదముందనీ అటువంటి వారికి కూడా తగిన శిక్షణ ఇచ్చే విధంగా ఇ.టి.సి. ఫ్యాకల్టీ తగు విధంగా మాడ్యూల్సు రూపొందించాలనీ కమీషనర్ కోరారు.

ఫ్యాకల్టీ సామర్థ్యాల పెంపు, నైపుణ్యాల పెంపుకోసం ఇ.టి.సి. రాజేంద్రనగర్ తీసుకునే ముందస్తు చర్య, మిగతా ఇ.టి.సి.లకు ఆదర్శం కావాలనీ, ఆయా విస్తరణ శిక్షణా కేంద్రాలు కూడా తగు విధంగా ఇటువంటి వర్కుషాపులు నిర్వహించుకోవాలని చెప్పారు.

మూడు రోజుల పాటు ఇ.టి.సి.లో జరిగిన ఈ వర్కుషాపులో విషయ నిపుణులు డాక్టర్ రాళ్ళబండి కవితా ప్రసాద్, ప్రొ. బలరాములు, శ్రీమతి గోగు శ్యామల, ప్రొఫెసర్ శ్రీ పంతుకల శ్రీనివాస్, ప్రొ. ఆర్. లింబాద్రి, ప్రొఫెసర్ రాజారామ్, శ్రీ వెంకట కృష్ణ, శ్రీ బి.యన్. రాములు వంటి వారు పాల్గొని పార్టిసిపెంట్సుకు రచనా వ్యాసంగంపై మెళుకువలు నేర్పారు.

అత్యంత ఉత్తేజ పూరితంగా సాగిన మూడు రోజుల సామర్థ్యాల పెంపు వర్కుషాపు రాజేంద్రనగర్, హసన్‌పర్తి విస్తరణ కేంద్రాల ఫ్యాకల్టీ మెంబర్స్‌తో పాటు ఆయా కేంద్రాల పరిధిలోని జిల్లా పరిషత్ శిక్షణా కేంద్రాల ట్రైనింగ్ మేనేజరు పాల్గొని వారి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఈ వర్కుషాపును డిప్యూటీ కమీషనర్ మరియు ప్రిన్సిపాల్ శ్రీ వి. రంగా నిరంతరం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి కోర్సుకో-ఆర్డినేటర్‌గా శ్రీ గవర్రాజు వ్యవహరించారు.

# అప్నా సహకారం అమోఘం

## కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ డి.కె. జైన్



**ప్రజాస్వామ్య బద్ధంగా ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు స్వచ్ఛంధ సంస్థల సహకారంతో ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ చేస్తున్న ప్రయోగం వినూత్నమైనదని, ఎన్.జి.ఓ లన్నింటినీ 'అప్నా' పేరుతో ఒక్కత్రాటిపైకి తెచ్చి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుచేస్తున్న తీరు యావత్ దేశానికి మార్గదర్శకమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ డి.కె. జైన్, ఐ.ఏ.ఎస్. అన్నారు.**

30.4.2011న అపార్డులో జరిగిన రాష్ట్ర స్థాయి అప్నా సమావేశంలో పాల్గొన్న జాయింట్ సెక్రటరీ డి.కె. జైన్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి హామీ పథకం అమలు తీరు తెన్నులను పరిశీలించటానికి ప్రత్యేకంగా రావటం జరిగిందనీ, శ్రమశక్తి సంఘాలు, సామాజిక తనిఖీ, ఎలక్ట్రానిక్ పద్ధతిలో మస్టరు నిర్వహణ, చెల్లింపులు తదితర అంశాలను పరిశీలించటానికి ప్రత్యేకంగా రావడం జరిగిందని అన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ ఆర్. సుబ్రహ్మణ్యం, రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం అమలు గూర్చి ఆయనకు వివరించారు. ఈ పర్యటనలో శ్రీ డి.కె. జైన్‌తో పాటు అండర్ సెక్రటరీ శ్రీ పి.యం. శుక్లా, కన్సల్టెంట్ యస్.కె. భన్సాల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనరు శ్రీమతి జయలక్ష్మి, ఎన్.ఆర్.ఇ.జి.యస్. డైరెక్టరు మురళి, ప్రత్యేక కమీషనరు శ్రీ విద్యాసాగర్, సోషల్ ఆడిట్ డైరెక్టర్ కుమారి సౌమ్య, అపార్డ్ జాయింట్ డైరెక్టర్ గంగాధరం, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ఒక నిరంతర ప్రక్రియ

# "గ్రామ పునర్నిర్మాణానికి భారత నిర్మాణ్ వాలంటీర్లుగా యువత ముందుకు రావాలి"

**- అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్.**

**అభివృద్ధి అనేది ఒక నిరంతర ప్రక్రియ అని, సాధించిన విజయాలతో సంతృప్తి చెందకుండా ఇంకా సాధించాల్సిన విషయాలపై శ్రద్ధ చూపి గ్రామంలో మరింత ప్రగతి సాధించాలని అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి అన్నారు. 4-5-2011న వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అనంతరం గ్రామాన్ని సందర్శించిన అపార్డు కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి గ్రామసభను ఉద్దేశించి మాట్లాడుతూ, మహిళా స్వయం సహాయక సంఘాలు, యువత, గ్రామ పంచాయితీ చేయి చేయి కలిసి గ్రామాన్ని 18 రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన తీరు ఆదర్శ వంతమని అన్నారు. గ్రామంలో అమలు అవుతున్న సంపూర్ణ మద్య నిషేధం వల్ల గ్రామీణ కుటుంబాలలో వస్తున్న ఆర్థిక ప్రగతి హర్షదాయకమన్నారు. రాజకీయా లకు అతీతంగా అన్ని పార్టీలు గ్రామ అభివృద్ధికి సహకరించుకుంటున్న తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తపర్చారు.**

అభివృద్ధి సాధించాలనే తపన, దానికి తగ్గ నాయకత్వం, గ్రామస్తుల భాగస్వామ్యం వంటివి లభించినప్పుడు గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దటానికి నిధులలేమి ఒక పెద్ద సమస్య కాదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణాభివృద్ధి కోసం 250కి పైగా పథకాలు అమలుచేస్తున్నాయని, ఈ పథకాల నుండి నిధులు రాబట్టుకోవచ్చని అన్నారు. అటు ప్రజా ప్రతినిధులలో కానీ, క్షేత్రస్థాయిలో అధికారులలో గానీ ఈ పథకాలపై పూర్తి అవగాహన లేనందువల్ల పథక ప్రయోజనాలు ఆశించిన తీరులో నెరవేరటం లేదని అన్నారు. అందుకే అపార్డు కీకాప్ - (లాబ్ టు ల్యాండ్), అంటే ప్రయోగశాల నుండి ప్రజలలోకి వచ్చి వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించటానికి నడుం బిగించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాబోయే 6 నెలల కాలంలో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిలో ఒక సామాజిక స్పృహ, చైతన్యం కలుగచేయటానికి ప్రయత్నిస్తామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామంలో ఆచరణలోకి తీసుకొని రావటానికి ప్రోత్సాహకులైన యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్థానిక ఎంపిడిఓ వద్ద భారత నిర్మాణ వాలంటీర్లుగా నమోదు కావాలని ఆయన పిలుపు నిచ్చారు.







# చీదేడులో పారిశుద్ధ్య ప్రచారం నిర్వహిస్తున్న ఆచార్య ఎన్.జి.రంగా యూనివర్సిటీ విద్యార్థినులు

చీదేడు గ్రామంలో, గృహవిజ్ఞాన కళాశాల (హోమ్‌సైన్స్ కాలేజ్) విద్యార్థినులు (ఐదుగురు) ప్రజలకు పారిశుద్ధ్యం పైన అవగాహన కల్పిస్తున్నారు. ప్రతిరోజు గ్రామ ప్రజలతో మాట్లాడుతూ, వారి పరిస్థితులను తెలుసుకుని, వారికి పెరటితోట పెంపకం వలన లాభాలు, బహిరంగ మలవిసర్జన వలన నష్టాలు తెలియజేసి వారిని గ్రామ అభివృద్ధి మార్గంలోకి తీసుకెళ్తున్నారు. అలాగే చిన్న పిల్లలను (6-15 సంవత్సరాల) ప్రతిరోజు సాయంత్రం వేళలో ఆటలు ఆడిస్తూ, పిల్లలకు ఆటల ద్వారా బహిరంగ మలవిసర్జన వల్ల కలిగే నష్టాలు, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతిరోజు ఒక మంచి సందేశాన్ని పారిశుద్ధ్యం గురించి తెలియజేసి, వారిని పాటించే దిశగా తీసుకెళ్తున్నారు. పిల్లలకు తెలియజేసిన అంశాలు ముఖ్యంగా బహిరంగ మలవిసర్జన వలన నష్టాలు, మరుగుదొడ్డి ఏర్పాటు గురించి, ప్లాస్టిక్ వస్తువుల వలన నష్టాలను గురించి, మంచి అలవాట్లు, అలాగే పారిశుద్ధ్యం గురించి తెలియజేసి, వాటిని ఆచరణలోకి తీసుకువెళ్ళే విధంగా ప్రయత్నిస్తున్నారు. ■




భారత నిర్మాణ వాలంటీర్లకు వివిధ ప్రభుత్వ కార్యక్రమాల ఉద్దేశ్యాలు, తదితర వివరాలతో పాటు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అంశాలపై కూడా అపార్డులో శిక్షణ ఇస్తారని ఆయన చెప్పారు. అంతకుముందు గ్రామ సర్పంచ్ శ్రీ గొర్రె దేవేందర్ మాట్లాడుతూ, 1056 జనాభాగల అనంతారం పంచాయితీలో గత నాలుగు సంవత్సరాలు జరిగిన అభివృద్ధిని వివరించారు. గత నాలుగు సంవత్సరాలలో గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం, 100% పారిశుద్ధ్యం, 100% వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, 100% బడి ఈడు పిల్లలు బడిలో నమోదు, 6-50 సం॥లోపు వయసున్నగల వారిని 100% అక్షరాస్యులుగా తీర్చిదిద్దటం, 100% పన్నుల వసూళ్ళు, 100% పక్కా గృహాల నిర్మాణం, 100% కుటుంబ నియంత్రణ, 100% కుటుంబాలకు సురక్షిత త్రాగునీరు, తదితర అంశాలలో విశేషమయిన ప్రగతి సాధించామని వివరించారు.

గ్రామంలో అభివృద్ధిని వివిధ కమిటీల సహకారంతో సాధించామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా వివిధ కమిటీల అధ్యక్షురాళ్ళు శ్రీమతి రాజేశ్వరి, స్వరూప, జీవిత, తదితరులు తమ కమిటీలు సాధించిన ప్రగతిని వివరించారు. మండల ప్రజా పరిషత్తు నుండి వారికి చెందవలసిన వాటాను నిష్పాక్షికంగా అందచేస్తున్నట్లు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ అభివృద్ధి అధికారిణి శ్రీ రమాదేవి, తహశీల్దార్ యుగాంతర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రీ మదన్, అపార్డు ఫ్యాకల్టీ సభ్యులు, జిల్లా పరిషత్ శిక్షణా మేనేజర్లు శ్రీ యజ్ఞనారాయణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. ■

# చీదేడు గ్రామంలో కీ – క్యాప్

**ఎ.యం.ఆర్ అపార్డ్‌లోని నీరు మరియు పారిశుద్ధ్య శాఖ కీ-క్యాప్‌లో భాగంగా ఏప్రిల్ 2011 మాసంలో రెండు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది.**

**పాఠశాల పారిశుద్ధ్యం, ఆరోగ్య విద్యపై శిక్షణా కార్యక్రమం**

ఏప్రిల్ 23, 2011 తేదీన చీదేడు గ్రామంలోని, ప్రాథమికోన్నత పాఠశాలలోని 55 మంది విద్యార్థినీ, విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, పాఠశాల పారిశుద్ధ్యం అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ శిక్షణా కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం "పారిశుద్ధ్యం, ఆరోగ్యపరంగా విద్యార్థులలో సరైన అవగాహన కల్పించడం, ఈ దిశలో మంచి అలవాట్లను వారిచే అభ్యాసం చేయించి, తద్వారా వాటిని దినచర్యలో భాగంగా చేయించడం". ఈ నేపథ్యంలో వారిచేత కొన్ని ప్రత్యేక ఆటలు ఆడించడం ద్వారా విషయ అవగాహన కలిగేటట్లు చేయడం జరిగింది. తదుపరి కొన్ని మంచి అలవాట్లను ఉదా: చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోవటం లాంటి విషయాలను వారిచే





చేయించి విషయాన్ని అర్థమయ్యేట్లు నిర్వహించటం జరిగింది. అనంతరం హాయిగా-ఆరోగ్యంగా అనే యానిమేటెడ్ ఫిల్మ్ చూపించడం ద్వారా పారిశుద్ధ్యపరంగా చేయవలసినవి, చేయకూడని విషయాల గురించి చర్చించడం జరిగింది.

**కిశోర బాలికలకు ఋతుచక్ర నిర్వహణ - పారిశుద్ధ్యంపై శిక్షణా కార్యక్రమం**

ఏప్రిల్ 29, 2011 తేదీన చీదేడు గ్రామంలోని 11 నుండి 19 సంవత్సరాల మధ్య వయసు కలిగిన బాలికలకు ఋతుచక్ర నిర్వహణ, పారిశుద్ధ్యంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి 47 మంది బాలికలు హాజరైనారు.

**ఈ శిక్షణా కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం**

"బాలికలకు నెలవారీ ఋతుచక్ర నిర్వహణపై అవగాహన కల్పించడం, తత్సంబంధిత పారిశుద్ధ్య అంశాల గురించి వివరించడం".

పై ఉద్దేశ్యానికి అనుగుణంగా, ఋతుస్రావ నిర్వహణపై ప్రస్తుతం వారు అవలంబిస్తున్న పద్ధతులు, అందులో గల లోటుపాట్లు గురించి చర్చారూపంలో శిక్షణను అందించడం జరిగింది.

ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతలో భాగంగా జననాంగాల శుభ్రత, గుడ్డ లేదా శానిటరీ పాడ్‌ను వాడటం, వాడిన తదుపరి శుభ్రపరచడం లేదా పారవేయడం గురించి విపులంగా చెప్పడం జరిగింది. తక్కువ ఖర్చుతో, ఎవరికి వారే శానిటరీ ప్యాడ్ తయారు చేసుకోవడం, దానిని ఉపయోగించడంపై వారికి చేసి చూపించడం జరిగింది. చేతులు శుభ్రపరుచుకునే విధానాన్ని వారితో చేయించడం ద్వారా అవగాహన కల్పించడం జరిగింది.

బహిరంగ మలవిసర్జన వలన కలిగే నష్టాల గురించి ఆట ఆడించడం ద్వారా అవగాహన కల్పించడమైనది. పైవిధంగా కిశోర బాలికలకు ఋతుచక్ర నిర్వహణపై, ఆరోగ్యకర అలవాట్లపై శిక్షణను అందించడం జరిగింది.

**- మాధురి, జూనియర్ ఫ్యాకల్టీ,**
**సి.డబ్లు.ఎస్, అపార్డ్**

# పారిశుద్ధ్య లోపమే మానవ మనుగడకు పెద్ద శాపం

**ప్రపంచంలో ప్రస్తుతం పారిశుద్ధ్యం, సురక్షిత మంచినీటి సమస్య తీవ్రత వల్ల ప్రతి మూడు సెకండ్లకు ఒకరు చొప్పున ప్రపంచంలో ఏదో ఒక చోట చనిపోతున్నారని అపార్డు కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.యస్. అన్నారు.**

ఈ రంగాలలో గత 60 సంవత్సరాలుగా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, పల్లెలో పారిశుద్ధ్యంతో పాటు కనీస వసతులు మెరుగుపడటం లేదన్నారు. వరంగల్ జిల్లా గంగదేవి పల్లిలో అపార్డు, భారత నవనిర్మాణ సంస్థ 'మారి' ఆధ్వర్యంలో 3-5-2011న 108 సర్పంచ్‌లతో నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిధిగా శ్రీ కె. చంద్రమౌళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తులో మెరుగైన ఈ మానవ సమాజం కనుమరుగు కావటానికి 1) ఎయిడ్స్ 2) ప్రపంచ యుద్ధం 3) నాయకత్వలోపం అనే మూడు ప్రధాన కారణాలు అవుతాయనేది ప్రపంచంలో మేధావుల ఉద్దేశ్యం అని చెప్పారు.

ప్రస్తుత గ్రామాలకు నాయకులుగా వున్న గ్రామ సర్పంచ్‌లు తమలో ఉన్న నాయకత్వ లోపాలు సరిదిద్దుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధికి నిధుల కొరత పెద్ద ఆటంకంకాదని ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసే సర్పంచ్ వుంటే ఆ గ్రామం గంగదేవిపల్లిలా తప్పక అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. నాయకత్వ లోపంతో వ్యక్తుల మధ్య సంఘర్షణ మొదలవుతుంది. సమస్యలు తలెత్తుతాయి. గ్రామస్థాయిలో నాయకత్వం పెంపొందించటానికి రాజ్యాంగం ద్వారా పంచాయితీ రాజ్ సంస్థలను ఏర్పరచి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులుగా ఎన్నికయ్యే అవకాశాన్ని సామాన్య ప్రజలకు కల్పించిందన్నారు.

గంగదేవిపల్లిలో గ్రామ ప్రజలలో ఐక్యత, ప్రతిపనికి ఒక్కో కమిటి ఏర్పరచుకొని తద్వారా గ్రామంలో అభివృద్ధిని సాధించటం, సర్పంచ్‌కి మంచి నాయకత్వ లక్షణాలు కలిగివుండటం కారణంగా గ్రామానికి నేడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని అభినందించారు.

గ్రామ పంచాయితీలకు ప్రభుత్వం ప్రత్యక్షంగా యిచ్చే ఎస్.ఎఫ్.సి., టి.ఎఫ్.సి., బి.ఆర్.జి.ఎఫ్. లాంటి నిధులతో పాటు స్వతహాగా గ్రామాలలో పుట్టించగల్గినటువంటి నిధులను సమీకరించుకొని ముందుకు నడిచినాడు గ్రామాల అభివృద్ధి దానంతట అదే వస్తుందని ఆయన అన్నారు.

గ్రామీణ ప్రాంతాలలో ప్రజల జీవన ప్రమాణాలస్థాయి నానాటికీ దిగజారుతోందని, ప్రతి సంవత్సరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 8 లక్షల కోట్ల రూపాయల నిధులు ఖర్చు పెడుతూనే ఉన్నాయన్నారు. ఉన్న నిధులు పూర్తిగా ఖర్చు కావాలి. ఖర్చు అయ్యే నిధులు సక్రమంగా ఖర్చు కావాలి అనే రెండు అంశాలు ఈ రోజు సర్పంచ్‌లంతా గుర్తెరగాలని అన్నారు.

ప్రజలందరికి అందుబాటులో ఉండేవాడు, ప్రజలందరికి నిత్యం కనిపించేవాడు, అవసరం అయినప్పుడు సలహాలు ఇచ్చేవాడు, కష్టం వచ్చినపుడు నివారించేవాడు. ప్రజారంజకంగా పరిపాలించేవాడే మంచి రాజు అని చాణక్యుడు తన అర్థ శాస్త్రంలో వివరించాడని, అదే విధంగా గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు వ్యవహరించాలని సూచించారు.

''ఎవరు రాజులాంటి వ్యక్తి అంటే ప్రజాస్వామ్యంలో రాజ్యాంగపరంగా ప్రజల మంచి కోరి అవిశ్రాంతంగా సేవలందించే సర్పంచే మంచి రాజులాంటి వ్యక్తి. మీరందరు 108 గ్రామాలలో ఏమి సాధించాలో సాధించండి. సాధించిన తరువాత 108 గ్రామాలవారు నన్ను పిలవండి నేను నా టీంను తీసుకొని మీ గ్రామాలకు వస్తాను.'' అని తెలియజేస్తూ ఆయన తన ఉపన్యాసాన్ని ముగించారు.

ఏప్రిల్ 4 నుండి 7, 2011 వరకు శ్రీలంక దేశంలోని కొలంబోలో జరిగిన దక్షిణాసియా పారిశుద్ధ్య సదస్సులో గంగదేవి పల్లి పంచాయితిలో సాధించిన సంపూర్ణ పారిశుద్ధ్యం, రక్షిత మంచినీటి రంగాలలో సాధించిన ప్రగతిని గూర్చి వివరించడం జరిగిందని గంగదేవి పల్లి సర్పంచ్ శ్రీ కూసం రాజమౌళి సర్పంచ్‌లకు తెలియచేసారు.

ఈ సదస్సులో పాల్గొన్న దేశాలన్నీ కూడా సంపూర్ణ పారిశుద్ధ్యం సురక్షిత త్రాగునీటిని దేశప్రజలందరికి అందించటానికి ప్రయత్నం చేయాలని నిర్ణయం చేయడం జరిగిందని శ్రీ రాజమౌళి అన్నారు. కనుక వరంగల్ జిల్లాలోని ప్రతిపాదిత నిర్మల్ గ్రామ పురస్కార్

గ్రామాలైన 108 గ్రామాలలోనైనా సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించటానికి, నూతన ఉత్సాహం కలుగజేయటానికి గంగదేవిపల్లిలో సదస్సును ఏర్పాటుచేయడం జరిగిందని రాజమౌళి అన్నారు.

ఈ సందర్భంగా శ్రీ హెచ్. కూర్మారావు, సెంటర్ హెడ్ ఎన్.ఆర్.యం. అపార్డ్, మాట్లాడుతూ ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమం గూర్చి సర్పంచ్‌లకు వివరించారు.

ప్రొఫెసర్ ఆర్. సూర్యనారాయణ రెడ్డి, సెంటర్ హెడ్ సి.డి.పి.&ఏ ఎ.ఎం.ఆర్. అపార్డ్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో సంపూర్ణ పారిశుద్ధ్యానికి నిదర్శనంగా గంగదేవిపల్లి గ్రామం నిలిచిందన్నారు. కమిటీలు అంకితభావంతో పనిచేయడం వలన దేశవ్యాప్తంగా ఆదర్శ గ్రామంగా గంగదేవిపల్లి పేరుప్రతిష్టలు, గౌరవం సంపాదించిందన్నారు.

శ్రీ ఆర్. మురళి 'మారి' స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ గంగదేవిపల్లి లాగ ప్రతి గ్రామం ఎదగాలని, ప్రతి గ్రామ సర్పంచ్ అందుకుగాను కృషిచేయాలన్నారు. గ్రామాలు రక్షిత మంచినీరు, సంపూర్ణ పారిశుద్ధ్యం సాధిస్తేనే ఆ గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. ఈ రెండు అంశాలు సాధించకపోయినట్లయితే, ఇంకా ఏ అభివృద్ధి సాధించినా అభివృద్ధి చెందినట్లు కాదు అని ఆయన తెలియజేసారు.

కాట్రపల్లి సర్పంచ్ దస్రూనాయక్ మాట్లాడుతూ, గ్రామాలలో ఎం.ఎన్.ఆర్. ఇ.జి.ఎస్. పనులలో మరుగుదొడ్ల నిర్మాణానికి గుంతలు తీసుకోవటానికి అవకాశం కల్పించాలని, తను గ్రామ పంచాయితీలో ప్రజలందరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకొనేలా సమాయత్తపర్చి గంగదేవిపల్లిలా తీర్చిదిద్దుకోవాలని నిర్ణయించుకున్నామని, దీనికి సంబంధించిన అధికారులందరిని సహకరించాలని కోరినారు.

ఈ కార్యక్రమంలో డా॥ వి. శివశంకర ప్రసాద్, సెంటర్ హెడ్, మీడియా & పబ్లికేషన్స్, ఎ.ఎం.ఆర్. అపార్డు, ఎ. సుభాష్ చంద్రగౌడ్ సీనియర్ ఫ్యాకల్టీ, డిప్యూటి డైరెక్టర్ అకౌంట్స్, ఎ.ఎం.ఆర్. అపార్డు, శ్రీమతి ఎన్. ప్రసునా రాణి, ఇ.టి.సి. ప్రిన్సిపాల్, హసన్‌పర్తి, శివకామేశ్వర్, జియాలజిస్ట్ టి.యస్.సి. కోఆర్డినేటర్, ఆర్.డబ్ల్యు.ఎస్. వరంగల్, కె. యజ్ఞనారాయణ డి.టి.యం., వి. కర్ణాకర్ డి.టి.ఎం. జిల్లా శిక్షణ కేంద్రం వరంగల్, రాజమోహన్ రెడ్డి జి.ఐ.ఎఫ్. మేనేజర్ 'మారి' సంస్థ, శ్రీనివాస మూర్తి, సలహాదారులు గంగదేవిపల్లి, కూసం లింగయ్య మంచినీటి కమిటి అధ్యక్షులు గంగదేవిపల్లి, వివిధ కమిటీలవారు, 108 గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

**వి. కర్ణాకర్, జిల్లా శిక్షణా మేనేజర్**
**జిల్లా శిక్షణా కేంద్రం, జిల్లా ప్రజాపరిషత్ వరంగల్**

# బి.పి.ఎల్. సర్వేకు కేంద్రం పచ్చ జెండా

**దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజల సంఖ్యను గుర్తించటంతో పాటు వారి కులమతాల వివరాలు తెల్సుకునేందుకు సర్వేక్షణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని డా. మన్మోహన్ సింగ్ అధ్యక్షతన 19-5-2011న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో లబ్దిదారుల ఎంపికకు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి జాబితా అత్యంత కీలకం.**

2002లో చివరి సారిగా బి.పి.ఎల్. సర్వే జరిగింది అప్పటినుండీ ఇప్పటివరకూ పలు వివాదాల కారణంగా సర్వే ప్రాతిపదికలు నిర్ణయించటంలో తీవ్ర జాప్యం ఏర్పడింది. సుప్రీం కోర్టు జోక్యంతో ఎట్టకేలకు మంత్రి వర్గం బి.పి.ఎల్. సర్వేను చేపట్టాలని నిర్ణయించటం పేదల పాలిట వరంగా భావించవచ్చును. దేశ వ్యాప్తంగా చేపట్టే ఈ సర్వేను త్వరిత గతిన పూర్తి చేయటానికి టాబ్లెట్ పి.సిలను (చిన్న కంప్యూటర్లు) వినియోగించి, జాబితాలను రూపొందించటానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఏర్పాట్లు చేస్తుంది.

జూన్ నెలాఖరు నుండి ప్రారంభమయ్యే ఈ సర్వే డిసెంబరు 2011 నాటికి ముగుస్తుంది. కంప్యూటర్ ఆధారిత సాఫ్ట్‌వేర్ ద్వారా బి.పి.ఎల్ సర్వే చేయనుండటంతో, నిర్దేశిత ప్రామాణికాల సహాయంతో దారిద్ర్య రేఖకు ఎగువున ఉన్న వారు ముందుగా జాబితాల నుండి తొలగిపోతారు. నిరుపేదలను గుర్తించటానికి 7 సూచికలను ఉపయోగించి వారికి ర్యాంకులు కేటాయిస్తారు.

ర్యాంకుల కేటాయింపును ప్రాతిపదికగా 1) ఒకే ఒక గదిలో నివసించే కుటుంబాలు 2) 16-59 ఏళ్ళ వయస్సు కలిగిన సంపాధించే వ్యక్తి ఎవరూ లేనటువంటి కుటుంబాలు 3) ఇంటి యజమానిగా పూర్తిగా మహిళలు ఉన్న కుటుంబాలు 4) వికలాంగులు ఉన్న కుటుంబాలు 15) శారీరకంగా ఎటువంటి సామర్ధ్యం లేని వ్యక్తులు కల్గిన కుటుంబాలు 6) 25 ఏళ్ళు నిండినా చదువు లేని పెద్దలు ఇంట్లో ఉన్న కుటుంబాలు 7) వేతన ఉపాధితోనే శారీరకశ్రమతో కూడిన జీవనాలను వెళ్ళ బుచ్చే, భూమిలేని కుటుంబాల వంటివి ఉన్నాయి. ■

# ప్రభుత్వ పాఠశాలల్లో అకడమిక్ మానిటరింగ్ కమిటీలు

**పాఠశాలల అభివృద్ధికి పాఠశాలల మానిటరింగ్ కమిటీలు ఎంతో అవసరం. పర్యవేక్షణ కోసం తల్లిదండ్రుల ప్రతినిధులతో, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన కమిటీని అకడమిక్ మానిటరింగ్ కమిటీ అంటారు. పాఠశాల సమాజానికి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరికీ చెందినది. విద్యార్థులు క్రమం తప్పకుండా బడికి రావటం, చక్కని నాణ్యతతో కూడిన విద్యను పొందటం కోసం అందరూ సమిష్ఠిగా సహాయ సహకారాలు అందించుకుంటూ చక్కని వాతావరణం నెలకొల్ప వలసియున్నది. ఇలా సమాజం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయం కలిగి ఉండేలా చేసేందుకు ఏర్పడినవే ఈ అకడమిక్ మానిటరింగ్ కమిటీలు.**

- పాఠశాలలో అతి ముఖ్యమైనవారు పిల్లలు
- విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాలతో సంబంధం ఎంతైనా అవసరం.
- తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల శ్రద్ధను, బాధ్యతను కలిగి ఉండాలనే భావనను దృఢపరుస్తుంది ఈ అకడమిక్ మానిటరింగ్ కమిటీ.
- విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటంలో కృషిచేసేది ఉపాధ్యాయులు.
- తమ పిల్లలు చదవగలగటం, రాయగలగటం, లెక్కలు చేయగలగటం వంటివి తల్లిదండ్రులు గమనించుకోవాల్సి ఉంటుంది. అలా తల్లిదండ్రులు గమనించుకుని ఉపాధ్యాయులతో చర్చించినపుడు పిల్లల్లో సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడుతుంది.
- తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణ, విధి విధానాల రూపకల్పనలో భాగస్వామ్యం కలిగి సహకరిస్తే పాఠశాల అభివృద్ధి పథంలో ఉంటుంది.
- తల్లిదండ్రులు ఎక్కువసార్లు బడి కార్యక్రమాల్లో పాల్గొనాలి. ఈ బడి తమది తమ పిల్లలకోసం ఏర్పడినదే అనే భావన కలిగినప్పుడే వారు సహకరిస్తారు. ఇదంతా అకడమిక్ మానిటరింగ్ కమిటీ ద్వారా సాధ్యమౌతుంది.

### సభ్యులు

- ఈ కమిటీకి గ్రామ సర్పంచ్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు.
- పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈ కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు.
- పాఠశాలలో ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీ వర్గాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారు.
- ఒక్కో తరగతిలో LEP రిజిస్టర్ ప్రకారం బాగాచదివే విద్యార్థి తల్లి/తండ్రి, మరియు చదువులో వెనుకబడిన విద్యార్థి తల్లి/తండ్రి సభ్యులుగా ఉంటారు.
- వీలైనంత మేరకు తల్లులను సభ్యులుగా తీసుకుంటారు.

### సమావేశంలో చర్చించవలసిన అంశాలు

- విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు
- ప్రగతి ప్రదర్శన
- మధ్యాహ్న భోజనం
- నిధుల వినియోగం
- పాఠశాల అభివృద్ధికి చర్యలు

### కమిటీ పరిశీలించవలసిన అంశాలు

- బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్చటం, బడి బయట పిల్లల్ని బడిలో చేరేలాచూడటం. వారందరూ క్రమంగా హాజరయ్యేలా చర్యలు చేపట్టడం.
- ప్రార్థనా సమయానికి పిల్లలు, ఉపాధ్యాయులు హాజరయ్యేలా చూడడం.
- ఉపాధ్యాయులు మరింత బాగా పనిచేసేందుకు సహకరించటం.

- ప్రతినెలా తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించటం. అందరూ హాజరయ్యేలా చేయటం.
- ఎంతమంది చదువులో వెనుకబడినారో పరిశీలించి వారికి ప్రత్యేక చర్యలు చేపట్టటం.
- పిల్లలు డైరీ రాయటం, తదితర వినూత్న కార్యక్రమాల నిర్వహణను పరిశీలించడం.
- గ్రాంటుల వినియోగం పరిశీలించటం.
- త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ పరిశీలించటం.
- రేడియో/ టీ.వి / కంప్యూటర్ తదితరాలు వినియోగిస్తునదీ లేనిదీ చూడడం.
- మధ్యాహ్న భోజనం అమలు తీరును, పిల్లలు అభిప్రాయాలను సమీక్షించటం.
- పాఠశాల అభివృద్ధికి సహకరించే స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, తదితరులతో సంప్రదించటం, వనరులను అదనంగా సమకూర్చటం.
- బడిబాట, మేళాలు, సామూహిక అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలలో పాల్గొని సహకరించటం.

**వివరాలను రికార్డులో భద్రపరచటం**

- సమావేశ తీర్మానాలను నమోదుచేయటం.
- గతసమావేశపు చర్చలు, తీర్మానాల అమలు గురించి చర్చ నమోదు.
- అభివృద్ధిని నమోదు చేయడం.
- పాఠశాల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు జరపటం.

**పిల్లలు ప్రగతి సాధించాలంటే వారు ఏం చేయగలగాలి?**

- వార్తా పత్రికలు, కథల పుస్తకాల వంటివి తడబాటు లేకుండా ధారాళంగా చదవగలగాలి.
- చదివినది అర్థంకావాలి. వ్యక్తపరచగలగాలి.
- పదాలు, వాక్యాలు తప్పులు లేకుండా రాయగలగాలి.
- ఏదైనా అంశం గురించి స్వీయరచన చేయగలగాలి.
- కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలు అనే అంశాలలో లెక్కలు చేయగలగాలి.
- ఇంగ్లీష్‌లో చెప్పే వాక్యాలను అర్థంచేసుకొని వ్యక్త పరచగలగాలి.




- తెలిసిన వాటి గురించి 2,3 వాక్యాలు ఇంగ్లీష్‌లో మాట్లాడగలగాలి.
- పరిసరాల విజ్ఞానంలో ప్రయోగాలు, ప్రాజెక్టులు, పట్టణనైపుణ్యాలు పెంపొందాలి.
- మన గ్రామం, జిల్లా, రాష్ట్రం, దేశం, ప్రపంచ పటాలను గీయగలగాలి. వాటిలో ఇచ్చిన ప్రదేశాలను / అంశాలను గుర్తించగలగాలి.
- పిల్లలు రోజూ డైరీ రాయాలి.

ఈ సమావేశాల నిర్వహణా విధానాన్ని సంబంధిత అధికారులు సమీక్షిస్తారు. మండల స్థాయిలో ఎం.ఆర్.పి., మండల విద్యా శాఖాధికారి, స్థానిక సంస్థల ప్రతినిధులు ఇతర సంబంధిత శాఖల అధికారులు ఎవరైనా ఈ సమావేశాల నిర్వహణను పరిశీలించవచ్చు. ఆహ్వానించినపుడు హాజరుకావచ్చు.

జిల్లా స్థాయిలో జిల్లా విద్యా శాఖాధికారి, ప్రాజెక్టు అధికారి, ఆర్‌విఎంలోని ఇతర అధికారులు ఇలా ఎవరైనా పర్యవేక్షించవచ్చు. జిల్లా కలెక్టర్స్ ఈ సమావేశాల ప్రాముఖ్యతను గుర్తించి కమిటీ సభ్యులతో, తల్లిదండ్రులతో, గ్రామస్థులతో పాఠశాల పనితీరునూ, విద్యార్థుల విద్యాప్రమాణాలను, ఉపాధ్యాయులపై తల్లిదండ్రులు గ్రామస్థుల అభిప్రాయాలను తెలుసికొంటున్నారు.

ఇలా పాఠశాలల అభివృద్ధికి అకడమిక్ మానిటరింగ్ కమిటీలు ఎంతో అవసరమని ప్రభుత్వం వీటిని ఏర్పరచింది.

Photo: పశ్చిమగోదావరి జిల్లా, పెదపాడు మండలం, రామచంద్రపురం పాఠశాలలో జరిగిన అకడమిక్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు జిల్లా కలెక్టర్, Project Officer, RVM (శ్రీ రామమోహన్‌రావు) (శ్రీమతి వంశీప్రసాద్)

సర్పంచ్ (శ్రీ కాకరాల రామకృష్ణ ప్రసాద్), గ్రామస్థులు, తల్లిదండ్రులు, విద్యార్థులు) (మార్చి 2011)

**వి. నాగపద్మిని**
**మం.ప పాఠశాల, పెదపాడు**

# జాతి పునర్నిర్మాణానికి భారతనిర్మాణ్ వాలంటీర్లు

**వివిధ ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ఉద్దేశించబడిన సేవలు నిర్దేశిత వ్యక్తులకు చేర్చటానికి పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ప్రజలలో అవగాహన పెంపొందించాలని భారతప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ యోచిస్తోంది. మన దేశంలో నేడు వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నా, గ్రామీణ ప్రాంతాలలోని సమస్యలను పరిష్కరించాలన్నా ప్రస్తుతం అమలు అవుతున్న పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలి. ఇందుకుగాను గ్రామీణ ప్రాంతాలలో వివిధ సేవలు అందచేస్తున్న ప్రభుత్వ శాఖల సామర్థ్యాలు పెంచాలి.**

ప్రజలలో చైతన్యం కల్గించాలి. అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని సాధించటానికి ప్రజలతో మమేకం కావాలంటే, ప్రస్తుతం మన వద్దనున్న ప్రభుత్వ యంత్రాంగం సరిపోదు. ఇందుకుగాను అంకితభావంతో ఉన్న ఒక స్వచ్ఛంధ కార్యకర్తల బృందం ప్రతీ గ్రామంలోనూ ఏర్పడాలి. స్వచ్ఛంద కార్యకర్తల బృందం గ్రామీణ కుటుంబాలతో సన్నిహితంగా మెలగటమేకాక, స్థానిక ప్రభుత్వాలకు/ ప్రభుత్వ శాఖలకు సహాయకారిగా ఉంటూ వివిధ పథకాల సక్రమ అమలుకు సహకరించాలి. ఇలాచేయటం వల్ల పరిపాలనలో సమర్థత పెరగటమేకాక, తక్కువ ఖర్చుతో మేలైన ఫలితాలు సాధించటానికి అవకాశం ఉంటుంది. అందుకనే భారతప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రతి గ్రామ పంచాయితీలో దశలవారీగా భారత్ నిర్మాణ్ వాలంటీర్లను ఏర్పాటు చేయటానికి రంగం సిద్ధం చేస్తోంది.

### భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చేయాల్సిన కార్యక్రమాలు

1. వివిధ ప్రభుత్వ పథకాలలో భాగస్వాములైన గ్రామీణ కుటుంబాలతో సంబంధ బాంధవ్యాలు ఏర్పర్చుకోవటం.
2. వివిధ ప్రభుత్వ పథకాలను ఏ విధంగా ఉపయోగించుకోవచ్చుననన్న విషయంపై గ్రామీణ ప్రజలలో అవగాహనను కల్గించటం.
3. వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలు, వ్యవసాయ అభివృద్ధి పథకాలు, వాటర్‌షెడ్ అభివృద్ధి, ఆరోగ్యకుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, విద్య, మహిళ, శిశు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన (రహదారులు, విద్యుదీకరణ, నీటిపారుదల, త్రాగునీరు, పారిశుధ్యం, బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ, టెలిఫోన్లు, బ్యాంకింగు, పోస్ట్ ఆఫీసులు), పర్యావరణ పరిరక్షణ, తత్సంబంధిత రంగాలలో ప్రజలకు న్యాయ విజ్ఞానం కలుగచేసి ఆయా చట్టాల క్రింద ప్రజలకు గల హక్కులు, బాధ్యతలు తెలియ చేయటం.
4. ప్రభుత్వ యంత్రాంగం, పంచాయితీరాజ్ సంస్థలలో సిటిజన్ ఛార్టర్ అమలు చేయటంలోను. ఇతర అధికారిక కార్యక్రమాలు నిర్వహించటంలో స్వచ్ఛందంగా సహకరించటం.
5. ప్రభుత్వ కార్యక్రమాలపై సోషల్ ఆడిట్ నిర్వహించటంలో సహకరించటం.
6. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించబడేలా చూడటం, హెల్ప్‌లైన్‌లు పనిచేయటంలో సహకరించటం.
7. ప్రభుత్వ కార్యక్రమాల అమలు నాణ్యత పెరిగేలా వివిధ కార్యక్రమాల అమలు తీరుతెన్నులపై బాధ్యతగల అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందచేసి కార్యక్రమాలు సజావుగా జరిగేలా చూడటం.
8. జాతి నిర్మాణంలో ఔత్సాహికులైన ప్రజలు పాల్గొనేలా అవకాశాలు కల్పించటం.
9. ప్రజలలో నాయకత్వ పటిమను/ లక్షణాలను పెంపొందించటం.
10. సుశిక్షితులైన స్వచ్ఛంద కార్యకర్తలను గుర్తించి, వారిని అభివృద్ధి పరచటం. అభివృద్ధి కోసం, మార్పుకోసం అవసరమయినగ్రామీణ ప్రాంతాలలో శాంతి సామరస్యాలు పెంపొందేలా అనువైన వాతావరణాన్ని ఏర్పర్చటం.

### భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా ఎవరు పనిచేయవచ్చు?

భారత్ నిర్మాణ్ వాలంటీర్‌గా పనిచేయదలచిన వ్యక్తి 18 సం॥ పైబడి ఉండాలి. ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా తనవంతు సహాయ సహకారాలు అందచేయటానికి సన్నద్ధుడై ఉండాలి. భారత్ నిర్మాణ్ వాలంటీర్‌గా పనిచేయదల్చిన వ్యక్తి సంబంధిత మండల పరిషత్తు అభివృద్ధి అధికారిని కానీ / గ్రామ పంచాయితీని కాని సంప్రదించవచ్చు.

### భారత్ నిర్మాణ్ వాలంటీర్‌గా జీవితకాలం సేవలందించవచ్చు.

ఒకసారి భారత్ నిర్మాణ్ వాలంటీర్‌గా సేవలందించటానికి ముందుకు వచ్చిన వారెవరెయినా తమ పూర్తి జీవితకాలం సేవలందించవచ్చు. ఐతే వీరు అంకిత భావం, మంచి నడవడిక కల్గి ఉండాలి.

### భారత్ నిర్మాణ్ వాలంటీర్ సేవలు ఏ విధంగా ఉపయోగించుకొవచ్చు?

ప్రతీభారత్ నిర్మాణ్ వాలంటీర్ తను నివసించే ప్రదేశంలో గల 40 కుటుంబాలకు ప్రాతినిధ్యం వహించాలి. (ఇలా ఎంపిక చేయబడిన కుటుంబాలకు) వివిధ ప్రభుత్వ పథకాల క్రింద ఉద్దేశించిన సేవలు సక్రమంగా చేరేలా భారత్‌నిర్మాణ్ వాలంటీర్ల సేవలు ఉపయోగించుకోవచ్చు. ఈ కుటుంబాలకు సంబంధించిన సమస్యలను/ అవసరాలను సంబంధిత పంచాయితీ మండల దృష్టికి తీసుకొని వెళ్ళటానికి భారతనిర్మాణ్ వాలంటీర్లు కృషి చేయాలి.

### భారత్ నిర్మాణ్ వాలంటీర్ల నడవడిక ఎలా ఉండాలి?

భారత్‌నిర్మాణ్ వాలంటీర్ తన నడవడికలో నలుగురికీ ఆదర్శవంతంగా, స్ఫూర్తిదాయకంగా ఉండాలి. భారత్ నిర్మాణ్ వాలంటీర్‌లు గ్రామంలో అన్ని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా తమవంతు కృషి చేయాలి. తాము చేసినటువంటి సహాయానికి ఎటువంటి లాభాన్ని ఆశించకుండా, ధనాపేక్ష లేకుండా గ్రామానికి సేవచేయాలి. సక్రమ నడవడిక లేనటువంటి వారిని గ్రామపంచాయితీ వెంటనే బాధ్యతల నుండి తొలగించాలి.

### భారతనిర్మాణ్ వాలంటీర్ల కర్తవ్యాలు

**1. ప్రచార కార్యక్రమాలు**

ప్రతీ భారత్ నిర్మాణ్ వాలంటీర్ తనకు కేటాయించబడిన గ్రామీణ కుటుంబాలకు వివిధ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై అంటే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కార్యక్రమం, గ్రామీణ రహదారులు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, వాటర్‌షెడ్ అభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖ ద్వారా అమలయ్యే కార్యక్రమాలు తదితర కార్యక్రమాలపై విస్తృతమైన అవగాహన కల్గిస్తారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, పారిశ్రామిక, బ్యాంకింగ్ ఆరోగ్య వైద్య రంగాలలోని వివిధ ప్రభుత్వ కార్యక్రమాల క్రింద లబ్ధిదారులకు కల్పించబడిన హక్కులు, వారి పాత్ర, బాధ్యతల గూర్చి లబ్ధిదారులకు పూర్తిగా అవగాహన కలిగేలా బాధ్యత వహించాలి.

**2. ప్రజాభాగస్వామ్యం**

వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపై గ్రామీణ కుటుంబాలకు అవగాహన కలగచేసిన తరువాత ఆయా కార్యక్రమాల ప్రణాళికీకరణ, అమలు,




పర్యవేక్షణలో ఆయా కుటుంబాలు నిర్మాణాత్మకంగా భాగస్వాములయ్యేలా భారతనిర్మాణ్ వాలంటీర్లు శ్రద్ధ వహించాలి. గ్రామసభ నిర్వహణలో గ్రామ పంచాయితీతో సహకరించి వివిధ కుటుంబాల సమస్యలు సభలో చర్చకు వచ్చేలా చూడటమేకాక, ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొనటంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు కృషి చేయాలి. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల దీర్ఘదర్శి, వార్షిక ప్రణాళికలు రూపొందించటంలో గ్రామసభకు సహకరించటమే కాక, ఆయా ప్రణాళికల సక్రమ అమలుకు దోహదం చేయాలి. గ్రామసభను బలహీనం చేయటానికి ప్రయత్నించే శక్తులను నిర్వీర్యం చేయటానికి భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చేయి చేయి కలిపి సమైక్యంగా పనిచేయాలి.

**3. ప్రభుత్వ సేవలు**

వివిధ ప్రభుత్వ పథకాల క్రింద ప్రజలకు సేవలు సక్రమంగా అందేలా చూడటానికి గ్రామ పంచాయితీలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, జిల్లా కలెక్టర్లు, వివిధ ప్రభుత్వశాఖలు బాధ్యత వహిస్తాయి. కానీ గ్రామస్థాయిలో ఈ శాఖలకు ప్రత్యేక సిబ్బంది లేక పోవటంవల్ల ప్రభుత్వసేవలు ఆశించిన స్థాయిలో ప్రజలకు అందచేయటం ప్రభుత్వానికి సాధ్యంకాదు. భారత్‌నిర్మాణ్ వాలంటీర్లు గ్రామపంచాయితీకి, వివిధ ప్రభుత్వ శాఖలకు, మండల పరిషత్తు, అభివృద్ధి అధికారులకు, జిల్లా కలెక్టర్లకు సహాయకులుగా వ్యవహరించి, వివిధ ప్రభుత్వ పథకాల సేవలను నిర్దేశిత కుటుంబాలకు చేర్చేందుకు సహకరించాలి.

**4. సోషల్ ఆడిట్**

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ప్రకారం సామాజిక తనిఖీ తప్పని సరి. అభివృద్ధి పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకొని వచ్చేందుకు సామాజిక తనిఖీ ఒక ముఖ్యసాధనంగా ఉపయోగపడుతుంది.

సామాజిక తనిఖీ ప్రక్రియలో గ్రామీణ కుటుంబాలు చురుగ్గా పాల్గొనేలా భారతనిర్మాణ్ వాలంటీర్లు వారిని ప్రేరేపించాలి.

**5. సిటిజన్ ఛార్టర్**

వివిధ ప్రభుత్వ శాఖలనుండి పౌరులకు ఏవిధమైన సేవలు నిర్ణీత ప్రమాణాలతో లభ్యమవుతాయో తెలియచేసే ఒక చక్కని సాధనం సిటిజన్ చార్టర్. ఈ సిటిజన్ ఛార్టర్ వల్ల సేవల లభ్యతలో గల అనిశ్చితి తొలిగి ప్రజలకు సులువుగా సౌకర్యవంతంగా సేవలందటానికి వీలు కల్గుతుంది. గ్రామ పంచాయితీ, మండల పరిషత్తు, జిల్లా యంత్రాంగాలకు వివిధ స్థాయిల్లో సిటిజన్ ఛార్టర్లు రూపొందించటానికి భారత్ నిర్మాణ్ వాలంటీర్లు సహకరించాలి. సిటిజన్ ఛార్టర్ అమలులో వివిధ సంస్థలకు సహకరించాలి. వివిధ ప్రభుత్వ శాఖలనుండి సేవల లభ్యతకు నిర్ణీత  ప్రమాణాలు ఏ విధంగా ఉండాలని ప్రజలు ఆశిస్తున్నారన్న సమాచారాన్ని ప్రభుత్వశాఖలకు అందజేసి సిటిజన్ ఛార్టర్ రూపకల్పనకు సహకరించాలి.

**6. ఫిర్యాదుల పరిష్కారం, హెల్ప్‌లైన్‌లు**

మండల పరిషత్తులు, జిల్లా కలెక్టర్లు, జిల్లాలోని వివిధ ప్రభుత్వశాఖలలో వనరుల లేమివల్ల పెద్ద సంఖ్యలో ప్రజా సమస్యలు అపరిష్కృతంగా ఉంటాయి. ఇటువంటి సమస్యలను పరిష్కరించటానికి సంబంధిత కుటుంబాలకు, ప్రభుత్వ శాఖలకు మధ్య వారధిగా భారత్ నిర్మాణ్ వాలంటీర్లు కృషిచేసి సమన్వయపర్చాలి. అదే విధంగా హెల్ప్‌లైన్‌లు కూడా పనిచేసేలా శ్రద్ధ వహించాలి.

**7. గ్రామీణ విలేఖరులు**

వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం ప్రజలకు చేరవేయటానికి గోడ సమాచార పత్రికలు, కమ్యూనిటీ రేడియో వంటి సాధనాలను వినియోగించుకోవచ్చు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామీణ ప్రాంతాలలో విలేఖరులుగా పనిచేసి, గోడపత్రికలు నిర్వహించటం, కమ్యూనిటీ రేడియో నిర్వహణ చేపట్టడంలో సహాయపడటం చేయవచ్చు.

**8. సమాచార సేకరణ - కంప్యూటరీకరణ**

వివిధ ప్రభుత్వ కార్యక్రమాల క్రింద గ్రామాలలో జరుగుతున్న




లావాదేవీల వివరాలను సేకరించి గ్రామ పంచాయితీ, మండల పరిషత్తుల వద్దనున్న కంప్యూటర్‌లలో ఆ సమాచారాన్ని నిక్షిప్తం చేయటంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు సహకరించాలి.

**9. నిఘా, పర్యవేక్షణ**

వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలు జరుగుతున్నాయో గమనించాలి.

**10. జనగణన**

గ్రామీణ కుటుంబాల సమాచారాన్ని సక్రమంగా నిర్వహించేందుకు, స్వయంసహాయక సంఘాలకు చెందిన సమాచార నిర్వహణకు, వివిధ ప్రభుత్వ పథకాల క్రింద చేపట్టబడిన పనుల సమాచార నిర్వహణకు, దారిద్ర్యరేఖకు దిగువన నివసించే కుటుంబ సర్వేక్షణ కోసం భారత్ నిర్మాణ్ వాలంటీర్లు సహకరించాలి.

**11. ఫీడ్‌బ్యాక్**

విద్య, వైద్య-ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, పర్యావరణం, విద్యుదీకరణ, ఇతర గ్రామీణ వ్యవస్థాపన అభివృద్ధి కార్యక్రమాలు గ్రామంలో ఏ విధంగా అమలు చేయబడుతున్నాయో, సదరు సమాచారాన్ని ఎప్పటికప్పుడు గ్రామపంచాయితీకి, మండలపరిషత్తుకు చేరవేసేందుకు భారత్‌నిర్మాణ వాలంటీర్లు కృషి చేయాలి.

**12. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు**

భారతనిర్మాణ్ వాలంటీర్ల సేవలు కేవలం గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలవరకే పరిమితం కానవసరంలేదు. గ్రామంలో అమలు చేయబడే వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య, సూక్ష్మ, చిన్న తరహా, మధ్యతరహా పరిశ్రమల రంగంలో అభివృద్ధికి కూడా వీరి సేవలు వినియోగించుకోవచ్చు.

**13. బ్యాంకింగ్ కరస్పాండెంట్లు**

బ్యాంకు నిబంధనలకు లోబడి భారత్ నిర్మాణ్ వాలంటీర్లు స్థానిక బ్యాంకులకు గ్రామీణ ప్రతినిధులుగా వ్యవహరించవచ్చు. గ్రామీణ కుటుంబాలకు బ్యాంకులకు మధ్య వారధిగా పనిచేస్తూ వ్యవస్థాగత పరపతి అందేలా చూడవచ్చు. బ్యాంకుకు ఋణపడ్డ బకాయిదారులనుండి ఋణాల వసూలుకు బ్యాంకుకు సహకరించవచ్చు.

**14) స్వయం సహాయక సంఘాలు**

గ్రామీణ కుటుంబాలను ప్రేరేపించి స్వయం సహాయక బృందాలుగా ఏర్పడేలా ప్రోత్సహించాలి. స్వయం సహాయక సంఘాల సామర్థ్యాల పెంపుదలకు కృషి చేసి ఆయా సంఘాలకు బ్యాంకులు నుండి ఋణాలు పొందటం, తీర్చటం ఆర్థిక కార్యకలాపాలు చేపట్టటానికి అవసరమయిన నైపుణ్యాలను అందచేయటానికి కృషిచేయాలి.




**15) ఆరోగ్యం, పారిశుద్ధ్యం, నిర్మల గ్రామం**

హెచ్.ఐ.వి/ఎయిడ్స్, క్షయ, మలేరియా, అతిసార వ్యాధి తదితర వ్యాధుల నివారణకు ప్రభుత్వం అందచేస్తున్న సేవలు సమర్ధవంతంగా ప్రజల దరిచేరేలా భారత్ నిర్మాణ్ వాలంటీర్లు కృషి చేయాలి. గ్రామంలో ఏవేని వ్యాధులు సంక్రమించినప్పుడు సదరు సమాచారాన్ని ఎ.ఎన్.ఎమ్/ఆశా కార్యకర్త దృష్టికి తీసుకొనివచ్చి వ్యాధిగ్రస్తులకు సత్వరమే మందులు అందేలా కృషిచేయాలి. అవసరమయితే వ్యాధిగ్రస్తులను ఆసుపత్రిలో చేర్చాలికూడా. మాతృ, శిశు మరణాలు నివారించటానికి గాను, ప్రసవాలన్నీ ఆసుపత్రిలోనే జరిగేలా ప్రోత్సహించాలి. వాలంటీర్లు తమకు కేటాయించిన కుటుంబాలలో పోషకాహారలోపంతో బాధపడుతున్న పిల్లలు, గర్భిణీ స్త్రీలను గుర్తించి, వారికి సమీప అంగన్‌వాడీ కేంద్రం నుండి పోషకాహారం, విటమిన్ సప్లిమెంట్లు అందేలా జాగ్రత్త వహించాలి. గ్రామీణనీటి సరఫరా పథకం క్రింద ప్రతి ఒక్కరూ సురక్షిత నీరు పొందేలా కృషి చేయాలి. గ్రామంలో బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు కృషి చేసి, ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకొని, వినియోగించుకొనేలా ప్రేరేపించాలి. గ్రామాన్ని నిర్మల గ్రామంగా మార్చటానికి కృషి చేయాలి.

**16. అక్షరాస్యత, విద్య**

గ్రామంలో నిరక్షరాస్యులైన వారిని గుర్తించి అక్షరాస్యతా కార్యక్రమాల్లో వారిని నమోదు చేసి పఠనాసామాగ్రిని అందచేయాలి. బడిమానివేసిన పిల్లలను గుర్తించి వారు మరల పాఠశాలలకు హాజరు అయ్యేలా కృషి చేయాలి. గ్రామంలోని ప్రజలందరినీ అక్షరాస్యులుగా తీర్చి దిద్దేందుకు, బడిఈడుకల పిల్లలందరూ పాఠశాలకు హాజరు అయ్యేటట్లు, గ్రామాన్ని బాలకార్మిక రహితమైన గ్రామంగా తీర్చి దిద్దడానికి కృషి చేయాలి. న్యాయ అవగాహనా సదస్సులు, సమావేశాలు నిర్వహించి ప్రజలకు వారి హక్కులపట్ల చైతన్యం కల్గించాలి.

**17. ఆహారభద్రత**

గ్రామంలోని ప్రజలందరికీ ఆహార భద్రత కల్పించటానికి, గ్రామంలో అర్హత కల్గి రేషను కార్డులు లేనటువంటివారి సమాచారాన్ని తగుచర్యకోసం తెలియచెయ్యాలి. చౌకధరల దుకాణం నుండి సరకుల పంపిణీ సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ కూడా ఎప్పటికప్పుడు సమాచారంపై అధికారులకు అందచేయాలి. రాష్ట్రీయ కృషి వికాసయోజన, జాతీయ ఆహార భద్రతా మిషను, సమీకృత బంజరు భూముల అభివృద్ధి పథకం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషను తదితర పథకాలలోని వనరులను సద్వినియోగ పర్చుకొని గ్రామంలో ఆహారధాన్యాలు, ఫలాలు, కాయగూరలు, మసాలదినుసులు, చెరకు, ప్రత్తి, పాలు, మాంసం, గుడ్లు, చేపలు తదితర ఉత్పత్తులు దిగుబడిని పెంచటానికి కృషి చేయాలి.

**18. ఇళ్ళ స్థలాలు, నివాస గృహాలు**

గ్రామంలో నివాస గృహాలు లేనటువంటి వారి జాబితాను, ఇళ్ళ స్థలాలు లేనటువంటి వారి జాబితాలను రూపొందించి గ్రామపంచాయతీకి, మండల పరిషత్తుకు రెవెన్యూశాఖకు పంపించటానికి భారత్ నిర్మాణ్ వాలంటీర్లు కృషి చేయాలి. ఇందిరా ఆవాస యోజన తదితర గృహనిర్మాణ పథకాల క్రింద అర్హులైన వారికి ఇళ్ళు మంజూరయ్యేలా చూడటంతోపాటు, నిర్మాణంలో ఉన్న గృహాలకు చెల్లింపులు సక్రమంగా జరిగేలా వారికి సహాయపడాలి.

**19. సహజవనరుల సంరక్షణ పర్యావరణ పరిరక్షణ**

గ్రామంలోని సహజవనరులను సంరక్షించటానికి, సహజ వనరుల సక్రమ యాజమాన్యానికి బాధ్యత వహించేలా భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు తగుపనులు గ్రామ పంచాయితీ లేదా మండల పరిషత్తు అప్పగించవచ్చు. ఉదాహరణకు గ్రామంలో సాగుకు అనువుగా లేని భూములను, బంజరు భూములను భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సహాయంతో గుర్తించి, మొక్కలు నాటటం ద్వారా అటవీ విస్తరణ పనులు చేపట్టవచ్చు. అదే విధంగా ఇలాంటి భూములను గుర్తించి అట్టి భూములలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, బంజరుభూముల అభివృద్ధి పథకం క్రింద ఆ భూములను సాగులోకి తీసుకొని రావటానికి కృషి చేయవచ్చు. వ్యవసాయ నీటిపారుదల సౌకర్యం ఉన్న ప్రదేశాలలో 'పానీ పంచాయతీల' వంటి ఏర్పాటులో భారత్ నిర్మాణ్ వాలంటీర్లను భాగస్వాములను చేయటం ద్వారా నీటి పంపిణీలో అసమానతలను తగ్గించవచ్చు.

**20. ఇతర పనులు**

పైన పేర్కొన్న పనులకే కాక భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవలను, ప్రజాహితమైన పలు కార్యక్రమాలకోసం వినియోగించుకోవచ్చు. ప్రజల భద్రత, శిక్షణ, సంక్షేమ సంబంధిత అంశాలలో భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవలను ఉపయోగించుకోవచ్చు.

**అనువాదం: శ్రీ యస్.యస్.పి.**



# పారిశుద్ధ్య వసతులతోనే ఆరోగ్యం పదిలం

**ప్రపంచ వ్యాప్తంగా 260 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ మరుగుదొడ్లు ఇత్యాది కనీస పారిశుద్ధ్య సౌకర్యాలకు నోచుకోవడం లేదు. కోట్లాది ప్రజలు బహిరంగ మల విసర్జన చేయడం వల్ల వ్యాధులు ప్రబలిపోతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం దాదాపు 22 లక్షల మంది పిల్లలు ప్రతి ఏటా డయేరియా వ్యాధి ప్రభావానికి గురై మరణిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం పరిసరాలలో పారిశుద్ధ్యం లేమి, దాని ప్రభావం వల్ల కలిగే మంచినీటి కాలుష్యం మొదలైన సమస్యలు. సమగ్ర పోషకాలతో కూడిన ఆహారం తీసుకున్నప్పటికీ, పారిశుద్ధ్య లోపంతో సంక్రమించే అనారోగ్యంతో, తిన్న ఆహారాన్ని మన శరీరం ఇముడ్చుకోలేదు.**

పారిశుద్ధ్య లోపం ఆహార భద్రతకు కూడా ముప్పే. ఎయిడ్స్, క్షయ, క్యాన్సర్ రోగాల వల్ల మరణిస్తున్న వారి సంఖ్య కంటే పారిశుద్ధ్యం లోటు, కలుషిత నీరు తాగడం వల్ల సోకే రోగాల బారిన పడి మరణిస్తున్న వారి సంఖ్యే ఎక్కువ అని పరిశోధనల్లో వెల్లడయింది. ముఖ్యంగా కూలీ పనులు, వృత్తిపనులు, వ్యవసాయం, చిల్లర వ్యాపారాలు చేసుకొని బ్రతికే ప్రజానీకానికి పారిశుద్ధ్యం లోపం వల్ల వచ్చే జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలు వారి అభివృద్ధిని తీవ్రంగా నిరోధిస్తున్నాయనేది వాస్తవం.

ప్రపంచబ్యాంకు నిర్వహించిన ఒక అధ్యయనంలో 2006లో పారిశుద్ధ్యం లోపం వల్ల సంభవించిన దుష్పరిణామాల వల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థకు కల్గిన నష్టం రూ. 2,40,000 కోట్లుగా అంచనా వేశారు. అంటే దేశ జనాభాలో ప్రతి ఒక్కరికి సగటున రూ. 2,180 నష్టం సంభవించింది.

మరుగుదొడ్ల వసతి కూడా లేని 260 కోట్ల మందిలో 72 శాతం మంది ఆసియా ఖండవాసులు కాగా, వీరిలో 41 శాతం మంది దక్షిణాసియాలో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా పారిశుద్ధ్య అభివృద్ధి నిరాశాజనకంగా ఉండడానికి భారత్, చైనాల్లో కోట్లాది ప్రజల అలవాట్లలో మార్పులు రాకపోవడమే ఒక ప్రధాన కారణమని చెప్పక తప్పదు.

మన దేశంలో ఇంకా 66 శాతం మంది గ్రామీణ ప్రజలకు, 20 శాతం మంది మంది పట్టణ వాసులకు కనీస పారిశుద్ధ్య వసతులు అందుబాటులో లేవు. అవగాహనా రాహిత్యం వల్ల పారిశుద్ధ్యాన్ని పరిరక్షించే అలవాట్లు ప్రజలకు లేవు. ఎక్కడ గోడలు కన్పిస్తే అక్కడ మూత్ర విసర్జన చేయడం, నిరాటంకంగా బహిరంగ మలవిసర్జన, రోడ్లపై పేరుకుపోయే చెత్త కుప్పలు, భరించలేని దుర్వాసనతో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు, పబ్లిక్‌ప్లేసెస్ (ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్లు, ప్రయాణ స్థలాలు, విద్యాలయాలు, ఇతర జనరద్దీ ప్రాంతాలు)లో ఎక్కడా మరుగుదొడ్లు, మూత్రశాలలను సక్రమంగా నిర్వహించక పోవడం, చెరువులు, నదీ ప్రవాహాలు మురుగునీరుతో నింపబడడం మొదలైన దృశ్యాలన్నీ పారిశుద్ధ్య లోపానికి నగ్న రూపాలుగా భావించవచ్చును.

ఐకరాజ్యసమితి మిలీనియం అభివృద్ధి లక్ష్యాలలో తాగునీరు, పారిశుద్ధ్య పరిస్థితుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమిచ్చారు. యం.డి.జి-7 ప్రకారం ప్రపంచంలో రక్షిత మంచినీరు, పారిశుద్ధ్య వసతులు లేని జనాభాను 2015 సంవత్సరం నాటికి కనీసం సగానికి తగ్గించాల న్నది లక్ష్యం. ప్రసూతి మరణాల తగ్గింపు, ఆరోగ్య పరిరక్షణ, మహిళలకు సమాన అభివృద్ధి అవకాశాలు, విద్యాభివృద్ధి తదితర మిలీనియం లక్ష్యాలను చేరుకోవాలంటే కూడా త్రాగునీరు, పారిశుద్ధ్య వసతుల అభివృద్ధి తప్పనిసరిగా అవసరం.

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి త్రాగునీరు, పారిశుద్ధ్య వసతులను మానవ హక్కులుగా గుర్తించింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కూడా గత సెప్టెంబర్ 30న మంచినీరు, పారిశుద్ధ్య వసతుల ను మానవ హక్కుగా గుర్తిస్తూ తీర్మానం చేసింది. ఈ తీర్మానాలను



Sthanka_BW June.indd 28 30/05/11 5:41 PM

పరిశీలిస్తే, విశ్వసనీయ అభివృద్ధి సాధనలో పారిశుధ్యానికున్న ప్రాధాన్యం అర్థమవుతుంది. భారత రాజ్యాంగంలోని జీవించే హక్కును (రైట్ టు లైఫ్) పరిపూర్ణంగా ప్రజలందరూ అనుభవించాలంటే పారిశుద్ధ్య వసతులు అందుబాటులో ఉండాలి.

ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా పరిణమిస్తోన్న పారిశుద్ధ్య లోపానికి సంబంధించిన అంశాలన్నింటినీ కొలంబొలో 2011 ఏప్రిల్ నెల 4 నుండి 7వ తేదీ వరకు జరిగిన నాల్గవ దక్షిణాసియా పారిశుద్ధ్య సదస్సులో సమగ్రంగా చర్చించారు.

అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక దేశాల మంత్రులు, ప్రభుత్వాధికారులు, పౌర సంఘాల అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, కమ్యూనిటీ లీడర్లు ఈ సదస్సులో పాల్గొన్నారు. వీరంతా విన్పించిన వాదనలన్నింటినీ పరిగణనలోనికి తీసుకొని సదస్సుకు హాజరైన ఎనిమిది దేశాల మంత్రుల సంతకంతో విడుదల చేసిన ప్రకటనలోని ముఖ్యాంశాలు.




* నీరు, పారిశుద్ధ్య వసతులను మానవ హక్కుగా గుర్తిస్తూ ఐకరాజ్యసమితి చేసిన తీర్మానానికి దక్షిణాసియా దేశాలు ఆమోదం తెలుపుతూ, దానికి అనుకూలంగా ఓటు వేశాయి. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలందరికీ చట్టబద్ధంగా ఆ హక్కును కల్పించడానికి ప్రగతిశీలమైన చర్యలు చేపట్టడం.
* బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఇండియాలో జరిగిన గత మూడు సదస్సుల ప్రకటనల్లో పేర్కొన్న అన్ని వాగ్దానాలను నిర్ణీత సమయంలోపు ఆచరణలోకి తీసుకురావడానికి అవసరమైన నిధులు సమకూర్చడం.
* పారిశుద్ధ్య వసతులకు నోచుకోకుండా అశ్రద్ధ చేయబడ్డ వర్గాల ప్రజలను (గిరిజనులు, వికలాంగులు, వృద్ధులు తరచుగా ప్రకృతి భీభత్యాలకు గురవుతున్న ప్రాంతాల్లో నివసిస్తున్నవారు, మరుగుదొడ్డి కట్టుకోవడానికి ఏ మాత్రం స్థలం లేని పట్టణ బస్తీవాసులు మొదలైనవారు) స్థానిక పరిస్థితులకు కనుగుణంగా అభివృద్ధి చేయడం.
* పారిశుద్ధ్య కార్యక్రమాల అమలులో జరుగుతున్న జాప్యం, నిధుల దుర్వినియోగం వంటి సమస్యల విచారణకు పారదర్శకత, జవాబుదారీ తనంతో కూడిన సమాచార సేకరణ, పర్యవేక్షణ వ్యవస్థలను ప్రవేశపెట్టడం.
* పారిశుద్ధ్య కార్యక్రమాలలో ప్రజా భాగస్వామ్యాన్ని, స్థానిక సంస్థల పాత్రను బలోపేతం చేయడానికి నిర్ధిష్టమైన చర్యలు చేపట్టడం.
* పాఠశాలల్లో సమగ్ర పారిశుద్ధ్య వసతుల కల్పనకు, మహిళల బహిష్టు సమయంలో అవసరమైన పరిశుభ్రత అలవాట్లను అభివృద్ధి చేయడానికి అవసరమైన కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం. (ఎ) రెండు సంవత్సరాల తరువాత నేపాల్‌లో జరుగబోయే ఐదవ సదస్సులో గత వాగ్దానాల అమలుకు సంబంధించి సాధించిన ప్రగతిని తగిన స్పష్టమైన సమాచారంతో, నివేదికల రూపంలో అందరితో పంచుకోవడం పారిశుద్ధ్య అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆరోగ్య విద్య, ఆర్థిక శాఖలకున్న పాత్రను గుర్తిస్తూ ఆయా శాఖల మంత్రులను కూడా అన్ని దేశాల నుంచి, తదుపరి సదస్సుకు ఆహ్వానించడం.

శ్రీలంక, భూటాన్‌లు అనేక ఆర్థిక సమస్యలు, అంతర్గత సవాళ్ళను ఎదుర్కొంటున్నప్పటికీ, పారిశుద్ధ్య అభివృద్ధిలో సాధించిన బ్రహ్మాండమైన ఫలితాలకు ప్రభుత్వాల రాజకీయ నిబద్ధతే కారణమని కొలంబో సదస్సులో అన్ని దేశాల వారు గుర్తించారు.

మన దేశంలో పారిశుద్ధ్య అభివృద్ధికి కేటాయిస్తున్న నిధులు గత పది సంవత్సరాలలో పదిరెట్లు పెరిగాయి. రానున్న పది (2012-22) సంవత్సరాలలో కేవలం గ్రామీణ పారిశుద్ధ్య వసతుల అభివృద్ధికి దాదాపు రూ. 47,000 కోట్ల పెట్టుబడితో ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ విషయాన్ని మన కేంద్ర ప్రభుత్వ అధికారులు కొలంబో సదస్సులో వెల్లడించారు.

'నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డు' ద్వారా మన గ్రామాల్లో చైతన్యాన్ని తీసుకురావడాన్ని ఇతర దేశాల వారు కొనియాడారు. ఈ సదస్సు ద్వారా దక్షిణాసియా ప్రాంత ప్రజల పారిశుద్ధ్య సౌకర్యాల ను మెరుగుపరుస్తాయని, వారి ఆరోగ్య పరిరక్షణకు మెరుగైన జీవన ప్రమాణాలను సాధించడానికి తోడ్పడతాయని ఆశిద్దాం.

***- రావిశెట్టి మురళి***
*భారత నిర్మాణ సంస్థ (మారి)*



Sthanka_BW June.indd 29 30/05/11 5:41 PM

# సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమంలో ప్రజలు పాల్గొనాలి

**సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమం 1999లో ప్రారంభమైంది.**

**గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణ స్థాయిని పెంచడం.**

**పారిశుద్ధ్య కార్యక్రమాన్ని గ్రామాల్లో విస్తరింపజేయడం.**

**ఆరోగ్య విషయాలపై చైతన్యపరుస్తూ మరుగుదొడ్లు, మరియు పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజల నుంచి మరింత సహకారం వచ్చేట్లుగా చేయడం.**

**పాఠశాలల్లో కావలసిన మరగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించి, విద్యార్థులలో పరిశుభ్రత, ఆరోగ్య విషయాల పట్ల మంచి అలవాట్లను పెంపొందింపజేయడం.**



**తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉండేవిధంగా మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించడం.**

**కలుషితమైన నీరు, అపరిశుభ్రమైన వాతావరణం వలన కలిగే అనారోగ్యాలు తగ్గేటట్లుగా చూడడం.**

### మీకు తెలుసా?

మన భారతీయ సంస్కృతిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఉంది. పరిశుభ్రంగా ఉండటం భగవత్సంబంధమైనదిగా భావిస్తాం. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం అనేది అసలు ఉండదు. అక్కడ అది నేరం. మన గ్రామాల్లో సగటున ప్రతి రోజూ బహిరంగ మలవిసర్జన వల్ల ప్రతి గ్రామంలో 10 క్వింటాళ్ల మలం వెదజల్లబడుతుంది. దీని వల్ల ఎంత వాతావరణ, జల కాలుష్యం ఏర్పడుతుందో ఊహించండి. ఇందులో 1% మన ఆహార పానీయాల్లో చేరినా సుమారు 4 గ్రాముల మలం రోజూ ప్రతి మనిషి ఆహారంలో కలుస్తున్నట్లు లెక్క.

### పారిశుద్ధ్య లోపం వలన కలిగే పర్యవసానాలు

అనారోగ్యాలే కాకుండా - మహిళా గౌరవానికి భంగం, ఆత్మనూన్యత, పాఠశాలల్లో సరియైన వసతులు లేకపోవడం వలన చాలా మంది బాలికలు పాఠశాలలు మానేస్తున్నారు. అసౌకర్యం, ఇబ్బంది, దుర్భరంగా ఉండే గ్రామ వాతావరణం, ఇంటి పరిసరాల కారణంగా జబ్బుల బారిన పడటం వలన సుమారు 2000 లక్షల పనిదినాలు కోల్పోవడం.




### మన కర్తవ్యాలు

***గ్రామ పంచాయితీ :*** ప్రతి గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రజానీకానికి మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య పాలన ద్వారా చక్కటి ఆరోగ్యం అందించే గురుతర బాధ్యత గ్రామ పంచాయితీదే.

***స్త్రీలు :*** సౌభాగ్య భారతదేశానికి మహిళలే సారధ్యం వహించాలి. పల్లెపల్లెలో పారిశుద్ధ్యం వికసించాలి. ప్రజారోగ్యం పెంపొందాలి. ప్రజల సౌకర్యార్థం ఎంతో డబ్బు ఖర్చు చేసి నీరు, పారిశుద్ధ్య సదుపాయాలని ఏర్పాటు చేసుకోవడం ఎంతముఖ్యమో, వాటిని సక్రమంగా నిర్వహించి, సర్వ ఫలితాలు పొందుతూ ఉండటం కూడా అంతే ముఖ్యం.

నిజానికి నీటి సరఫరా, పారిశుద్ధ్యం, గ్రామీణ గృహ నిర్మాణం, సామాజిక ఆస్తుల నిర్వహణ వంటి కార్యక్రమాలు వ్యక్తిగతంగానే కాక సాంఘిక పరంగా ఎన్నో సత్ఫలితాల నిస్తాయి. కాబట్టి ఎంపిక విషయంలో మొదలయిన ప్రజల భాగస్వామ్యం ప్రణాళికలతో ముందుకు సాగి, నిర్మాణంలో సహకరించి, నిర్వహణలో సైతం కొనసాగాలి.

☆



Sthanka_BW June.indd 30 30/05/11 5:41 PM

# మంచినీటి సరఫరాలో విధిగా పాటించవలసిన సూచనలు

* బావులు, బోర్ల పరిసర ప్రాంతాలలో మురికినీరు నిలవకుండా చూసుకోవాలి.
* చేతి పంపుల దగ్గర, పబ్లిక్ నల్లాల దగ్గర స్నానం చేయటం, బట్టలు ఉతకటం, కోళ్ళు, మేకలు మాంసం వగైరాలను శుభ్రం చేయడం నిషేధించాలి.
* పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని నీరు నిలువకుండా జాగ్రత్తపడాలి.
* పరిసరాలలోని పనికిరాని డబ్బాలు, పగిలిన సీసాలు, కుండ పెంకులు, కొబ్బరిచిప్పలు, టైర్లు వగైరాలలో నీళ్ళు నిలవకుండా జాగ్రత్త పడాలి.
* మురుగునీటి కందకాలను మట్టితో పూడ్చివేయాలి.
* మురుగునీటి కాలువలలో చెత్త, చెదారం వేయరాదు.
* మురికినీరు తిరిగి బావులలో చేరకుండా తగు జాగ్రత్తలు పాటించాలి.
* చేతి పంపులు (బోరు బావులు), త్రాగునీటి బావుల వాడకపు నీరు బయటకు పోవడానికి తగిన ఏర్పాటు చేయాలి.
* మంచినీటికై వాడే అన్ని బావులలో / ఓహెచ్‌యస్‌ఆర్‌లలో 10,000 లీటర్ల నీటికి 50 గ్రాముల చొప్పున బ్లీచింగ్ పౌడరు ట్యాంకు పరిమాణాన్ని బట్టి ప్రతిరోజు కలపాలి.
* మంచినీటి సరఫరా పైపులైను, గేటు వాల్వులలో లీకేజీ ఉన్నట్లయితే, తక్షణమే గ్రామ పంచాయతీ ద్వారా మరమ్మత్తులు చేయించాలి.
* బహిరంగ మల, మూత్ర విసర్జన చేయరాదు.
* మల విసర్జన తరువాత, భోజనానికి ముందు చేతులను తప్పనిసరిగా సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
* త్రాగునీటిపై మూతలు పెట్టి కాడ గిన్నెతో మాత్రమే నీరు తీసుకోవాలి.
* మంచినీటి నల్లాల గుంటలు వెంటనే పూడ్చి వేయాలి.
* ప్రతి పబ్లిక్, చేతి పంపును ఫ్లాట్‌ఫారం లేని వాటికి గ్రామ పంచాయితీ ద్వారా నిర్మించాలి.
* కనీసం 15 రోజులకు ఒకసారి ఓహెచ్‌యస్‌ఆర్ / జియల్‌యస్‌ఆర్ లతో శుభ్రపరచాలి. నీటి ట్యాంకుపై శుభ్రపరచిన తేదీని, శుభ్రపరచవలసిన తేదీని విధిగా పేర్కొనాలి.
* క్లోరోస్కోప్ ద్వారా ప్రతి రోజు నీటిలో క్లోరిన్ శాతం కొలిచి సరిచూచుకోవాలి. ఇది మొదటి కుళాయి వద్ద 0.5 పిపియం నుండి చివరి కుళాయి వద్ద 0.2 పిపియం వరకు ఉండాలి.
* 20 లీటర్ల పరిమాణం గల బిందెడు నీటిలో ఒక క్లోరిన్ బిళ్ళను పొడి చేసి వేసిన 30 నుండి 60 నిమిషాల తర్వాత స్వచ్ఛమైన క్రిమిరహితమైన త్రాగునీటిని త్రాగాలి.
* క్లోరినేషన్ చేయబడిన నీరు వాడాల్సి వచ్చినప్పుడు క్లోరిన్ మాత్రలు కలిపిన తర్వాత మాత్రమే త్రాగాలి.
* అకస్మాత్తుగా నీటి పైపులు లీకేజీలు, పిట్‌ట్యాప్‌లు, ప్లాట్‌ఫారం లేని బోరు బావులు మొదలగు వాటి వల్ల త్రాగునీరు కలుషితమైతే క్లోరిన్ మాత్రలు కలిపిన నీటిని మాత్రమే వాడాలి.
* జాతరలు, పెళ్ళిల్లు, సమావేశాలు, సభలు, వ్యవసాయ బావుల వద్ద నీరు త్రాగాల్సి వచ్చినప్పుడు క్లోరిన్ మాత్రలు కలిపిన నీటిని మాత్రమే త్రాగాలి. చెరువులలోని నీరు త్రాగకూడదు. వర్షాకాలం కాగబెట్టి చలార్చిన నీటిని త్రాగాలి.



* చేతి పంపుల ద్వారా వాడిన నీటిని మురికి కాల్వలలోకి మళ్లించాలి.
* వర్షాకాలంలో నిల్వ ఉన్న పదార్థాలను భుజించకూడదు.
* క్లోరినేషన్ చేయుబడిన నీటిని క్లోరోస్కోప్ ద్వారా పరీక్ష చేసిన దానిని లాగ్‌బుక్‌లో నమోదు చేయుగలరు. అలాగే గ్రామాన్ని సందర్శించే అధికారుల పరిశీలనార్థం ఉంచాలి.

☆



Sthanka_BW June.indd 31 30/05/11 5:41 PM

**అనేక విధాలుగా వివక్షతకు గురవుతున్న మహిళలకు రక్షణగా 'సెడా' అంతర్జాతీయ ఒప్పందం సెప్టెంబర్ 3, 1991లో అమలులోనికి రాగా, భారతదేశంలో ఆగష్టు 8, 1993 నుంచి అమలులోనికి వచ్చింది.**

వరకట్న నిషేధ చట్టం-1961, సతీ నిషేధ చట్టం -1987, శరణాలయాలు, ఇతర ఆశ్రమాల తనిఖీ నియంత్రణ చట్టం -1960, ఆంధ్రప్రదేశ్ దేవదాసీల చట్టం -1988, పౌర హక్కుల చట్టం-1955 మొదలైన వాటి ద్వారా మహిళలకు రక్షణ కల్పించడం జరిగింది. వీటన్నిటిలో ఇప్పటి వరకు మహిళలకు రక్షణగా నిలిచింది ఒక్క వరకట్న నిషేధ చట్టం మాత్రమే! ఈ చట్టం కేవలం భార్యలకు మాత్రమే వర్తిస్తుంది.

పలు విధాలుగా, మహిళలను వేధించినా, ఆ విధంగా బెదిరించినా కూడా గృహ హింస నిరోధక చట్టం క్రింద శిక్షార్హులే. అయితే ఈ చట్టం ప్రత్యేకత ఏంటంటే, నిందితులకు శిక్షపడటం కన్నా, బాధితులకు రక్షణ, ఊరట కలిగేలా చూడడమే ముఖ్యోద్దేశం.

చట్టంలోని కీలకమైన అంశం, మహిళలకు నిలువ నీడను కల్పించడమే! గృహహింస అనేది విశ్వ వ్యాప్తంగా ఉందన్న విషయం బహిరంగ రహస్యమే!

గృహహింసకు పాల్పడిన వారు భారత శిక్షాస్మృతి 498/ఎ అధికరణ క్రింద శిక్షార్హులే!

ఈ చట్టం అమలులో కీలకపాత్ర వహించేది రక్షణాధికారులు

# మహిళలకు రక్షణగా 'గృహహింస నిరోధక చట్టం'

(PROTECTION OFFICERS), సేవలనందించే వారు (SERVICE PROVIDERS). ప్రభుత్వం తగు సంఖ్యలో వీరిని ప్రతి జిల్లాలో నియమిస్తుంది. ప్రభుత్వంచే నియమితులైన సేవలనందించేవారు, లేదా రక్షణాధికారులు లేదా పోలీస్‌లు లేదా న్యాయస్థానాలు వీరిలో ఎవరికైనా బాధితులు ఫిర్యాదు చేయవచ్చు. రక్షణాధికారులు చట్టపరిధిలో పనిచేస్తూ, మేజిస్ట్రేటుకు సహాయకారిగా వుంటారు. ఫిర్యాదు అందగానే, దానిని పరిశీలించి, డొమెస్టిక్ ఇన్సిడెంటు రిపోర్టు (డి.ఐ.ఆర్) ను రూపొందించి, న్యాయస్థానానికి సమర్పించగా, నమోదైన 60 రోజులలోపు తీర్పునివ్వాలి.

గృహ హింసకు బలవుతున్న స్త్రీలకు రక్షణ కోసం బిల్లును పార్లమెంట్‌లో 2006 ఆగస్టులో ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. సెప్టెంబర్ 13, 2006న రాష్ట్రపతి ఆమోదం లభించింది. ఇది 'ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ ఫ్రం డొమెస్టిక్ వయోలెన్సు ఆక్టు -2005'. అంటే గృహ హింస నుండి మహిళలకు రక్షణ చట్టం-2005గా పిలవబడే ఈ చట్టం అక్టోబర్ 26, 2006 నుండి అమలులోకి వచ్చింది.

ఇది మహిళల చేతిలో వజ్రాయుధం. మహిళలకు రక్షణ కవచం వంటిది.

ఈ చట్ట పరిధి చాల విశాలమైంది. ఒకే కుటుంబం, లేదా, ఉమ్మడి కుటుంబంలో నివసించే మహిళే కాదు, వివాహ బంధం లేకుండా కలసి నివసిస్తున్న మహిళ, తల్లి, కూతురు, దత్తత సంతానం, ఏదో ఒక వరుస కలిగిన బంధువు, వీరిలో ఎవరిని హింసించినా, హింసించిన వారిపై గృహహింస నిరోధక చట్టం క్రింద ఫిర్యాదు చేయవచ్చు.

భౌతికంగా, మానసికంగా, లైంగికంగా, ఆర్థికపరంగా, భావావేశాలతో

కోర్టుకు కేసును సమర్పించే ముందే, ఈ ప్రొటెక్షన్ అధికారులు బాధితులను, నిందితులను కలిసి పరిష్కార మార్గాలు చూపాలి. ఫలితం లేకపోయినప్పుడు మాత్రమే కేసును కోర్టుకు సమర్పించాలి.

లీగల్ సర్వీసెస్ ఆక్టు -1987 లోని 39వ అధికరణ ప్రకారం, బాధితులకు లీగల్ ఎయిడ్‌ను ప్రొటెక్షన్ అధికారులు ఉచితంగా అందజేయాలి. గాయపడిన బాధితులకు వైద్య పరీక్షలు చేయించి వైద్య నివేదికలను మేజిస్ట్రేటుకు అందజేయాలి. కోర్టులో కేసు నడుస్తున్నప్పుడు సర్వీసు ప్రొవైడర్లు బాధితులకు ఆశ్రయం కల్పించాలి.




మేజిస్ట్రేట్ ఆదేశాలను ఉల్లంఘించిన నిందితులు ఒక సంవత్సరం కారాగార శిక్ష లేదా 20 వేల రూపాయల జరిమానా లేదా ఆ రెండు శిక్షలకు అర్హులవుతారు. చట్టం అమలును నిర్లక్ష్యం చేసిన వారు కూడా పైన పేర్కొన్న శిక్షలకు అర్హులవుతారు.

ప్రభుత్వం దోషరహితంగా చట్టాలను అమలు చేయాలి. అలాగే బాధిత మహిళలు తమ బాధల నివృత్తికి ఈ చట్టాన్ని సక్రమంగా ఉపయోగించుకుని రక్షణ పొందడం సర్వదా అభిలషణీయం!

చట్టాన్ని దుర్వినియోగం మాత్రం చేయకూడదు.

*- ఎ.వి.రాజా*



Sthanka_BW June.indd 32 30/05/11 5:41 PM

# ఆరోగ్య విపత్తుల పైనా దృష్టి పెట్టాలి

**అభివృద్ధి చెందిన దేశాలు ప్రకృతి విపత్తులతో పాటు ఆరోగ్యవిపత్తుల మీద శ్రద్ధ చూపుతున్నాయి. కాని అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇంకా ప్రకృతి విపత్తుల మీదే శ్రద్ధ వహిస్తున్నాయి. భారతదేశంలో ఈ ఆరోగ్య విపత్తుల బారిన పడేవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. కావున ఈ ఆరోగ్య విపత్తుల మీద అవగాహన కలిగి వుండటం ఎంతో అవసరం. ఈ క్రింది విశదీకరించిన ఆరోగ్య విపత్తులు మానవాళికి గుబులు పుట్టించే విధంగా ఉన్నవి.** అవి

1. క్షయ
2. మధుమేహం
3. నీటికాసులు
4. గుండె జబ్బులు

### క్షయ

ట్యూబర్క్యులోసిస్ బ్యాసిల్లస్ అనే సూక్ష్మజీవి ఈ వ్యాధికి కారణం. ఈ సూక్ష్మజీవి ప్రతివారి శరీరంలోనూ ఉంటుంది. అయితే వ్యాధి నిరోధక శక్తి తగ్గినవారిలో మాత్రం వ్యాధి రూపంలో బయటపడుతుంది. ఈ వ్యాధి రెండు రకాలుగా కనిపిస్తుంది - పల్మోనరీ టీబి, ఎక్స్‌ట్రా పల్మోనరీ టీబి. ఊపిరితిత్తుల్లో వ్యాధిని కలుగజేస్తే పల్మోనరీ టీబి అంటారు. ఊపిరితిత్తుల్లో కాకుండా శరీరంలోని వేరే భాగాల్లోవస్తే దాన్ని ఎక్స్‌ట్రా పల్మోనరీ ట్యూబర్క్యులోసిస్ అంటారు. గతంలో దాదాపు 95% పల్మోనరీ టీబియే ప్రధానంగా కనిపించేది. ఎక్స్‌ట్రా పల్మోనరీకేసులు 5% మాత్రమే కనిపంచేవి. ఇప్పుడు దాదాపు 40% మందిలో ఎక్స్‌ట్రా పల్మోనరీ కేసులు కనిపిస్తున్నాయి. పల్మోనరీ టీబి మాత్రమే ఒకరి నుండి ఇంకొకరికి వ్యాపిస్తుంది. ఎక్స్‌ట్రాపల్మోనరీ టీబి రోగుల నుంచి ఇతరులకు వ్యాపించదు.

ఇటీవలి కాలంలో మారిన జీవనశైలి. ఒత్తిడి, నిద్రలేమి, పనిభారం, కొవ్వు ఉన్న ఆహారం తీసుకోవటం పెరిగినందువల్ల రోగులసంఖ్య విపరీతంగా పెరుగుతుంది.

క్షయ మొండి వ్యాధి. ఇది మనదేశంలో రోజుకు సగటున 980-1000 మందిని, గంటకు 41 మందిని బలి తీసుకుంటూ వస్తుంది. కానీ దీని నిర్మూలన అసాధ్యమేమి కాదు. 12-17% మందిలో మందులు వేసుకోవటంలో నిర్లక్ష్యం కారణంగా లొంగని విధంగా మారుతోంది.

రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఏటా 1.15 లక్షల క్షయ వ్యాధి కేసులు కొత్తగా నమోదు అవుతున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా ఏటా 97 లక్షల మంది క్షయ బారిన పడుతుంటే ఒక్క మన దేశంలోనే 19-40 లక్షల కేసులు నమోదు అవుతున్నాయి. గతంలో పేదవారిలోనే కనిపించే ఈ జబ్బు మారినజీవన శైలి. ఒత్తిళ్ల వల్ల ఆర్థికంగా మెరుగైన వర్గాల్లో కూడా కనిపిస్తుంది. కావున మందులు క్రమం తప్పకుండా వాడితే క్షయ వ్యాధి పూర్తిగా సయమవుతుంది.

### నీటి కాసులు

నీటి కాసులు (కంట్లో తుఫాను) ఇది పైకి కనిపించని నివురుగప్పిన ఉప్పెన. దీనికి కారణం కంట్లో ఒత్తిడి. మన కనుగుడ్డులో నిరంతరం స్వచ్ఛమైన ద్రవం (అక్వియస్ హ్యూమర్) ఊరుతుంటుంది. కార్నియా పొరకు, లెన్స్ మొదలైన వాటికి కావాల్సిన పోషకాలను అందించేది ఈ ద్రవమే. ఈ ద్రవం ఎంత ఊరుతుందో తిరిగి అంత మొత్తం గుడ్డు లోపల మూలల్లో నుంచి బయటకు వెళుతుంది. నీటి కాసుల సమస్య తలెత్తినప్పుడు ఈ ద్రవం బయటకు వెళ్ళాల్సినంత వెళ్ళక లోపలే నిల్చిపోతుంటుంది. దీనితో గ్రుడ్డులో ద్రవం పరిమాణం పెరిగి లోపల ఒత్తిడి పెరుగుతుంది. దీన్నే ఇంట్రా ఆక్యులర్ ప్రెషర్ అంటారు.

దీన్ని మెడికల్ టెర్మినాలజీలో గ్లకోమా/ట్రాకోమా అని అంటారు. దీన్ని గ్రామీణ ప్రాంతంలో నల్లముత్యం అని అంటారు. ఇవి 3 రకాలు - ప్రైమరీ గ్లకోమా, సెకండరీ గ్లకోమా మరియు కంజెనిటల్ గ్లకోమా లేదా పిడియాట్రిక్ గ్లకోమా.

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం భారతదేశంలో 1.2 కోట్ల కంటే ఎక్కువ మంది గ్లకోమా వ్యాధి వల్ల చూపును






పోగొట్టుకుంటున్నారు.

40 ఏళ్ళు పైబడిన వారికి ఎక్కువగా వస్తుంది. కానీ దీనికి వయస్సుతో నిమిత్తం లేదు. వంశపారపర్యంగా వచ్చే అవకాశం ఉంది. మైనస్ పవర్ అద్దాలు వాడే వారిలో, రెటినోపతి సమస్య వచ్చిన వారిలో ఈ రిస్కు ఎక్కువ. కంట్లో స్టిరాయిడ్ చుక్కల మందుల వాడే వారికి, ఆయింట్ మెంటులు వాడే వారికి, కంటి ఆపరేషన్స్ చేయించుకున్న వారికి ముప్పు ఎక్కువ. కాబట్టి 40 ఏళ్ళు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా సమగ్ర కంటి పరీక్ష చేయించుకోవటం అవసరం.

### గుండె జబ్బులు

మనదేశంలో గుండె జబ్బులు ఎక్కువగా ఉండటానికి అధిక కొలెస్ట్రాల్ ఒక ముఖ్యమైన కారణం. దీనిలో మంచి కొలెస్ట్రాల్, చెడ్డ కొలెస్ట్రాల్, మరో రకం కొవ్వు పదార్థం ట్రైగ్లిజరైడ్లు ఉంటాయి. మనదేశంలో చాలా మందికి మంచి కొలెస్ట్రాల్ తక్కువగా, చెడ్డ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటోంది. కొందరికి ఇది జన్యుపరంగా వస్తే, మరికొందరికి ఇది ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవటం వంటి జీవన శైలి సమస్యల వల్ల వస్తోంది. చాలా మంది లావుగా ఉన్న వారికి కొలెస్ట్రాల్ ఎక్కువ వుంటుందని, బక్కగా ఉన్న వారికి ఉండదనుకుంటారు. కానీ అది సరికాదు. 25-30 ఏళ్ళు దాటిన తర్వాత ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి పరగడుపున ఈ కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకొని తీరాలి.

### ముగింపు

ప్రకృతి వైపరీత్యాలు మానవాళికి కల్గిస్తున్న సమస్య కంటే ఆరోగ్య విపత్తులు మానవాళికి కల్గిస్తున్న సమస్యలు రాను రాను అధికం అవుతున్నాయి. ప్రకృతి విపత్తులు కంటికి కనబడతాయి కానీ ఆరోగ్య విపత్తులు కంటికి కనబడకుండా చాలా నష్టాన్ని కల్గిస్తున్నాయి. కావున ఆరోగ్యవిపత్తుల మీద అవగాహన కలిగి ఉండటం, దానికి తగిన సన్నసద్ధత కలిగివుండటం ఎంతైనా అవసరం.

**డా. నిర్మలాదేవి**
**ఫ్యాకల్టీ**

# మూగవోయిన పిల్లన గ్రోవి

ఒక్క క్షణంలో జీవితం కుప్ప కూలిపోయింది
కనుచూపుమేర ఇసుక దుమారం కప్పేసింది
కన్న కల నిట్టనిలువుగా చీలి రుధిరం కురుస్తోంది
హఠాత్తుగా
పాదాల కింద భూమి విడిపోతున్న స్పర్శ
నెత్తిన వెయ్యిపిడుగులు ఒక్కసారిగా పడినా దీనికంటే సుఖమేనేమో...
అన్నీ విడిచి
నమ్మలేని నిజాలు గాల్లోకి ఆవిరైపోతూ
జీర్ణంకాని వాస్తవం కన్నపేగును మెలేస్తూ
కంటిపాపను కంటి నుండి ఎవరో దూరం చేస్తూ
గుండెలు పట్టని దుఃఖం
రెప్పలు ఆపలేని శోకం
ఈ బాధ ఒక ప్రపంచానికి సరిపోయేది కాదు
మరో ప్రపంచం తీర్చేదీ కాదు
నిత్యం మండే అగ్నిని..
పలకరింపులూ.. ఆత్మీయస్పర్శలు.. ఆజ్యంలా రెచ్చగొడుతున్నాయి
లతలు తెగిన వనంలో చెట్లు బతికేదెట్లా
ఏ పిల్లగాలీ లేని ఆవరణంలో గుండె ఊపిరి పీల్చేదెట్లా
హృదయనాళం పుటుక్కున తెగిపోయినా
ఎలాగో జీవిస్తున్న తడి ఎండిపోయిన గడ్డిపూలివి
వీటిని ఏ మంచు చల్లబరచలేదు
పంట పక్వానికి రాకముందే కోతకు గురయిన జీవితాలివి
ఏ చేతులూ ఆదుకోలేవు
నిలువెల్లా గాయమైన మూగవోయిన పిల్లనగ్రోవులివి
ఏ గాలీ ప్రాణశక్తిని నింపలేదు
అయినా ఒక్కసారి నీ స్మృతులలోకి నడవనీ
కళ్ళను బండిచక్రాలంత పెద్దవిచేసి
అమాయకంగా సంధించే ప్రశ్నల్లో చిక్కుకున్న జీవితాలివి
కోరికలే లోకమాయ చేసే మారాముల్ని తీర్చలేక విక్కున పాపపు కోపాలివి
ముద్దులమూటలు... నీ మురిపాలమాటలు
మా జీవితాలకింత అమృతం చిలకరించనీ
కలల్లో నయినా మోడులు చివురులేస్తే..
వరమే అయినా నీ స్పర్శ గుండెను తాకుతూ ఉంటే..
శాపమే అయినా నీదుఃఖంలో మునిగి అంతమయిపోతే చాలనిపిస్తోంది
అంతా అంతమే అయినప్పుడు
నా అన్నదంతా నీతోనే పోయినప్పుడు
నువ్వులేని ఈ శూన్యాకాశంలోకి..
వెలుతురు కొండపై ఉదయించాలని..
(ఇటీవల దేశ విదేశాలలో ప్రమాదాలలో బిడ్డల్ని కోల్పోయి తపిస్తున్న హృదయాల కోసం)

*- అద్దంకి శ్రీనివాస్*




# దక్షులెవ్వార లుపేక్ష సేసిరి . . .

**మా**ట్లాడడం ఒకకళ. పెదవులపై మాట విరిసీ విరియడంతోనే శ్రోతల హృదయాలలో ఆహ్లాదపు గాలులు వీచేలా మాట్లాడే నైపుణ్యం ఉండాలి. మన చుట్టూ ఒక ఆనందమయ ప్రపంచం ఆవిర్భవించాలంటే ఆ ప్రపంచంలో అందరూ మధురభాషణులై ఉండాలి. హృదయాన్ని ఎప్పుడూ నిర్మలంగా ఉంచుకోవడం, ఆధ్యాత్మిక సాధన ద్వారానే ఇది సాధ్యం. ఏదైనా ఒక విషయాన్ని ఇతరులకి చెప్పడంలో అనేక మార్గాలున్నాయి. సున్నితమైన అంశాలను మొరటుగా చెప్పి విఫలమయ్యే వారు కొందరైతే, మొరటుగా చెప్పవలసిన అంశాన్ని సైతం చాలా సున్నితంగా చెప్పి కార్యాన్ని సాధించుకొనేవారు కొందరు.

ఎదుటివారిలోని లోపాలను, అనర్హతలను, అయోగ్యతలను చెప్పవలసి వచ్చినప్పుడు చాకచక్యంగా, ఎదుటివారి మనసు బాధపడకుండా చెప్పడంలోనే అసలైన నైపుణ్యం దాగి ఉంది. మహాభారతంలో పేష్యుడు ఉదంకునితో - అంతఃపురంలో ఉన్న తన భార్య నుండి కుండలాలు తీసుకొమ్మని చెప్పి పంపుతాడు. అక్కడ ఉదంకునికి ఆమె కనిపించదు. ఆ విషయమే ఉదంకుడు పేష్యునితో చెప్తాడు. పేష్యుని భార్య పరమ పతివ్రత. ఆమె అశుచులకు కన్పించదు. అంటే ఉదంకుడు అశుచే కదా! ఈ విషయం ఉదంకుడు నొచ్చుకోకుండా చెప్పాలి. ఎంత సున్నితంగా చెప్పాడో చూడండి.

**భూవినుత! నిన్నుఁద్రి భువనపావను నశుచివని యెట్లు పలుకఁగనగు?న**
**ద్దేవి పవిత్ర. పతివత్ర! గావున నశుచులకు ఁగానఁగా దనవద్యా (1-1-96)**

'ఉదంకా! లోకపావనుడవైన నిన్ను అశుచివని ఎలా సంబోధించను? కానీ నా దేవి పతివ్రత! అశుచులకు కన్పించదే' అన్నాడు. లోపాలు అందరిలోనూ ఉంటాయి. కేవలం ఆలోపాలనే ఎత్తి చెప్పకుండా, వారిలోని సుగుణాలను ప్రశంసించి, పిదప మెల్లగా లోపాలను చూపితే తప్పక అర్థం చేసుకొంటారు. ఇది ఒక వాక్వైచిత్రి.

ఇక కొన్ని సందర్భాలలో చెడును ఖండించవలసి వచ్చినప్పుడు, ధర్మం అధర్మం వల్ల భంగమై అవస్థల పడే సందర్భాలలో ఇలా మాటల్లో నైశిత్యం పనికిరాదు. కాఠిన్యమూ తప్పదు. శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో ధర్మగ్లాని జరుగుతోందని ఉపేక్షించడం తగదని నిర్ద్వంద్వంగా చెప్తాడు.

**'సారపుధర్మమున్ విమల సత్యము బాపము చేత బొంకుచే**
**పారము పొందలేక చెడదారినదైన యవస్థ దక్షులె**
**వ్వారలుపేక్ష సేసిరది వారల చేటగుగాని ధర్మని**
**స్తారకమయ్యు సత్యశుభదాయక మయ్యుయు దైవముండెడిన్'**

'సారమైన ధర్మమూ, విమలమైన సత్యమూ పాపం వల్ల కొనసాగలేని స్థితిలో ఉన్నప్పుడు, ఆ పరిస్థితి నుండి ధర్మసత్యాలను నిలబెట్టే దక్షత ఉండి కూడా ఉపేక్ష చేసిన వారికి కీడే జరుగుతుందిగానీ ధర్మసత్యాలకు వచ్చే నష్టం ఏమీ ఉండదు. ఎందుకంటే ధర్మాన్ని, సత్యాన్ని నిలబెట్టేందుకు దైవం ఉన్నాడు. ఇదీ శ్రీకృష్ణుని ఉవాచ.

వాక్కు చాలా శక్తివంతమైనది. ఎందరో వ్యక్తులూ, ఆయుధాలు, సైన్యం, బుద్ధి, బలం, ధనం కూడా చేయలేని పనుల్ని చాలా సులభంగా వాక్కు ద్వారా సాధించిన చరిత్రలున్నాయి. అందుకే 'వాగ్భూషణమ్ భూషణమ్' అన్నారు. నోటిని అదుపులో పెట్టుకోవడం, మాటల్లో సంస్కారం ఉట్టిపడేలా మాట్లాడడం, మనసులో ఉండే ప్రేమభావాన్ని మాటల్లో కురిపించి జగమంతటినీ ప్రేమమయం కావించడం మానవుని చేతుల్లో ఉన్న పవిత్ర కర్తవ్యాలు. నీటిని, గాలిని కలుషితం చేస్తే లోకానికి ఎంత చేటో మాటని కలుషితం చేస్తే అంతకన్నా ఎక్కువ చేటే కలుగుతుంది. అందువల్ల భాషణాన్ని భూషణంలా ధరించేవాడే ధన్యజీవి. దక్షులు మాటను నియంత్రించాలి. అవసరమైన చోట అస్త్రంగా ప్రయోగించాలి. మనకెందుకులే అని కూర్చోవటం సామర్థ్యం ఉన్న వారికి తగదు. అది మానవ ద్రోహం.

***- డా॥ అద్దంకి శ్రీనివాస్***



# హాజీపల్లిని సందర్శించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి




**షాద్‌నగర్ రూరల్, మే 26 (ఆన్‌లైన్) నిర్మల్ పురస్కార్ సాధించిన ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లి గ్రామాన్ని గురువారం కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి నితిన్‌చంద్ర సందర్శించారు. గ్రామ పంచాయితీ కార్యాలయం అవరణలో సర్పంచ్ జంగమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా సంఘాల సభ్యులతో ఆయన మాట్లాడారు.**

ప్రభుత్వ ఆర్థిక సహకారంతో చేపట్టిన స్వయం ఉపాధి హామీ పథకాల గురించి వారి నుండి వివరాలు సేకరించారు. పాడిపరిశ్రమ, వ్యవసాయాభివృద్ధి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో ఎంత మంది పనిచేస్తున్నారు. జాబ్ కార్డులు ఎన్ని ఉన్నాయని వారిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎంత మంది ఉన్నారని గ్రామస్థులనడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించి ఆర్థిక సహకారంతో ఎక్కువగా పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకున్నట్లు మహిళా సంఘాల సభ్యులు ఆయనకు వివరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అపార్డ్ కమీషనర్ కె. చంద్రమౌళి, ప్రొఫెసర్ కె. సూర్యనారాయణ, కన్సల్టెంట్ శ్రీపతిరావు, డిప్యూటీ డైరెక్టర్ సుభాష్‌గౌడ్, డాక్టర్ శివశంకరప్రసాద్, ఎం.పి.డి.ఓ. సుదారాణి, మాజీ సర్పంచ్ సింగారం శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి కళ్యాణి, బుర్ర రాంచంద్రయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. ■




# పంచాయితీలకు సహాయకారిగా



# భారత్ నిర్మాణ్ వాలంటీర్లు

**ప్రభుత్వ కార్యక్రమాల సక్రమ అమలులో గ్రామ పంచాయితీకి సహాయకారిగా ఉంటూ ఆయా ప్రభుత్వ కార్యక్రమాల ఫలాలు ప్రజలకు చేరేలా చూడటానికి, స్వచ్ఛందంగా ముందుకు వచ్చే యువతను భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా నమోదు చేయాలని అపార్డు కమీషనరు 79 గ్రామ పంచాయితీ సర్పంచ్‌లకు పిలుపునిచ్చారు.**

16-5-2011న 22 జిల్లాల్లో కీ - క్యాప్ కార్యక్రమం క్రింద ఎంపిక చేయబడిన 79 గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు, సెక్రటరీలు, సంబంధిత ఎం.పి.డి.ఓలు, ఇ.టి.సి. సిబ్బందితో అపార్డ్ కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్. హైదరాబాద్ ఎన్.ఐ.సి. నుండి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్డ్ కమీషనర్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధిలో యువతను భాగస్వాములను చేయటం వల్ల సామాజిక రంగంలో మంచి మార్పును తీసుకొని రావచ్చు అని అన్నారు. యువత భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి చేయటం అనే ప్రయోగం వినూత్నమైనదనీ 'కీ-క్యాప్' పేరుతో మన రాష్ట్రంలో మొత్తం 79 గ్రామ పంచాయితీలలో అమలు చేయబోతున్నట్లు తెలియచేసారు. గత 6 దశాబ్దాలుగా 11 పంచవర్ష ప్రణాళికలు అమలు చేసినప్పటికీ, గ్రామాలు అనుకొన్న రీతిలో అభివృద్ధి చెందటం లేదని, 10 సంవత్సరాల క్రితం గ్రామంలోని పరిస్థితికి నేటి పరిస్థితికి చాలా తేడా వచ్చిందని ఆయన అన్నారు. గ్రామాలలో 10 సంవత్సరాల క్రితం సాధారణంగా కన్పించే పచ్చదనం, భూగర్భ జలాల లభ్యత, విద్య, వైద్యం, ఆరోగ్యం, త్రాగునీరు, పారిశుద్ధ్యం, పౌష్టికాహారం తదితర రంగాలలో ప్రభుత్వ సేవలలో నాణ్యత నేడు లోపిస్తున్నాయన్నారు. సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాల సాధనలో మన దేశ వెనుకబాటుతనం స్పష్టంగా గోచరిస్తోందని, ఈ లక్ష్యాల సాధనకు భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సహకారంతో ఈ 79 గ్రామ సర్పంచ్‌లు కృషి చేయాలని అన్నారు. పంచాయితీ పాలక వర్గం, ప్రజలు కలిసి పనిచేయాలని, ప్రజలలో ప్రభుత్వంపై ఉన్న చిన్న చూపు పోవాలని, ప్రభుత్వ సంస్థల ద్వారా అందే సేవలలో నాణ్యత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయితీల సందర్శన కోసం ప్రజా ప్రతినిధులు ఇతర రాష్ట్రాలు సందర్శించటం మంచిదే అయినప్పటికీ, మన రాష్ట్రంలోనే ఇటువంటి గ్రామాలను రూపొందించుకోవడానికి సర్పంచ్‌లు కృషి చేయాలన్నారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవలను వినియోగించుకుంటూ రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని చీదేడు గ్రామం పురోగతి సాధిస్తోందని, భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సహకారంతో ఈ 79 గ్రామాలు కూడా మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కీ -క్యాప్ క్రింద ఎంపిక చేసిన గ్రామాలు ఇప్పటికే వివిధ రంగాలలో ప్రతిభ కనబరుస్తూ, ఉత్తమ గ్రామ పంచాయితీలుగా గుర్తించబడ్డాయని, ఐతే సాధించిన అభివృద్ధి ఏ కొద్ది రంగాలకో పరిమితం చేయకుండా మిగిలిన అన్ని రంగాలకు విస్తరించాలని సూచించారు. మంచి నాయకత్వ లక్షణాలతో ప్రజల అభిమానాన్ని చూరగొనాలని ఇందుకు ఉదాహరణగా తూర్పు గోదావరి జిల్లాలోని ఉలిమేశ్వరం గ్రామ పంచాయితీ సర్పంచ్ గత 50 సంవత్సరాలలో 35 సంవత్సరాలు సర్పంచ్‌గా 5 సంవత్సరాల పాటు జడ్.పి.టి.సి. సభ్యునిగా పనిచేయటం అన్న ప్రజలు ఆయనపై ఉంచిన నమ్మకం అని కొనియాడారు.

ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న వివిధ గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు తాము సాధించిన ప్రగతిని, కీ- క్యాప్ ప్రయోగంలో ఏర్పరుచుకొన్న లక్ష్యాలను గూర్చి వివరించారు. తమ అనుభవాలను పంచుకొన్న సర్పంచ్‌లలో విజయనగరం జిల్లా ఇద్దనవలస గ్రామ సర్పంచ్, నెల్లిమర్ల మండలం జరజాపుపేట సర్పంచ్, నల్గొండ జిల్లా మాంధాపూర్, కరీంనగర్ జిల్లా రామ చంద్రాపూర్, దేశాయ్ పేట్, మహబూబ్‌నగర్ జిల్లా, దూసకల్, హాజీపల్లి, నెల్లూరు జిల్లా జయపురం పంచాయితీ, కర్నూలు జిల్లా కన్నప్పకుంట, వరంగల్ జిల్లా గంగదేవిపల్లి, అనంతారం, కొండాపూర్, అదిలాబాద్ జిల్లా వెలమల్, కొరిటికల్, గుంటూర్ జిల్లా అమరావతి, తూర్పు గోదావరి జిల్లా ఉలిమేశ్వరం సర్పంచ్ తదితరులు ఉన్నారు.

ఈ 79 గ్రామాల్లో ఎంపిక చేసిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు 3 రోజుల పాటు అపార్డులో శిక్షణ అందచేయనున్నట్లు, జిల్లా శిక్షణా మేనేజర్లు, ఇ.టి.సి. ప్రిన్సిపాల్స్ సమన్వయంతో వ్యవహరించి బి.ఎన్.వి.లను అపార్డుకు పంపాలని సూచించారు. బి.ఎన్.వి.లను సుశిక్షిత సైనికులుగా తీర్చిదిద్దేబాధ్యత అపార్డుదని, క్షేత్ర స్థాయిలో వారి సేవలను ఉపయోగించుకొనే బాధ్యత అందరు సర్పంచ్‌లు తీసుకోవాలని కమీషనరు కె. చంద్రమౌళి సూచించారు. ఈ కార్యక్రమంలో అపార్డు ఫ్యాకల్టీ సభ్యులు ప్రొ. సూర్యనారాయణరెడ్డి, డా. కృష్ణమోహన్ రావు, హెచ్. కూర్మారావు, డా.వి.ఎస్.ఎస్. ప్రసాద్, సుభాష్ గౌడ్, రంగారెడ్డి, ఇ.టి.సి. ప్రిన్సిపల్ రంగా, ఫ్యాకల్టీ సభ్యులు రాధ, డా. అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### పూర్వపు చరిత్ర

పచ్చని పశ్చిమ గోదావరి జిల్లాలోని నిడదవోలు మండలంలో మారుమూల చిన్న పల్లెటూరు సురాపురం. పూర్వం శూరుల (దేవతలు) పురంగా పిలువబడేది. కాలక్రమేణ సురాపురంగా రూపాంతరం చెందినది.

అనాగరికతకు అసలు పేరుగా, అపరిశుభ్రతకు పుట్టినిల్లుగా, కక్షలకు, కార్పణ్యాలకు ప్రతిబింబంగా పేరు పొందింది. మంచితనం లేని మానవత్వంతో ప్రజలు జీవిస్తున్న ఆ కాలంలో పొరుగు గ్రామాల నుండి పెద్దలు వచ్చి గ్రామ సమస్యలు, ప్రజల తగాదాలు పరిష్కరించేవారు. సురాపురం గ్రామంలోకి వెళ్ళాలంటే ఒళ్ళు జలదరించేది. అడ్డదిడ్డంగా పడేసిన చెత్తా, చెదారం, రోడ్డుపై పేరుకుపోవడంతో పాటు బహిరంగ మలవిసర్జన తోడై అపరిశుభ్రతతో నిండివున్న ఇరుకైన రోడ్డుపై నుండి వెళ్ళవలసి వచ్చేది. వేరే దారిలేదు. అర్థ కిలోమీటరు దూరం పొడవునా మల విసర్జన చేయడం ద్వారా వచ్చే దుర్గంధం వర్ణనాతీతం. అందువలన పొరుగు గ్రామాల ప్రజలు కనీసం సురాపురం మంచినీళ్లు కూడా త్రాగేవారు కాదు.



*2007లో గౌ॥ భారత రాష్ట్రపతి శ్రీ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్‌గారి చేతుల మీదుగా 'నిర్మల్ గ్రామ్ పురస్కార్' అవార్డును అందుకుంటున్న పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు మండలం, సురాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి వద్దిరెడ్డి శ్రీలక్ష్మి*

# పశ్చిమంలో పరిశుభ్ర కుసుమం – సురాపురం

ప్రజలు అన్ని రంగాలలో చాలా వెనుకబడిన వారు. కూలి పనుల కోసం ఇతర గ్రామాలకు వెళ్ళి జీవనం చేసుకునేవారు. నిరక్షరాస్యత, మూర్ఖత్వం, అవగాహన లేమితో ప్రజా జీవనం సాగించేవారు. మంచినీటికి కూడా ఎంతో ఇబ్బంది పడేవారు. అన్ని కష్టాలు, దారిద్ర్యం ఈ గ్రామానికే స్వంతం అయినట్లుగా వుండేవి ఆనాటి పరిస్థితులు.



*2008లో గౌ॥ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి గారి చేతుల మీదుగా 'శుభ్రమ్' అవార్డును అందుకుంటున్న పశ్చిమ గోదారి జిల్లా, నిడదవోలు మండలం, సురాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి వద్దిరెడ్డి శ్రీలక్ష్మి*

### ప్రస్తుత పరిస్థితి

ఇది నిజమా? అనిపిస్తుంది ప్రస్తుత పరిస్థితి.

కాలం మారింది, కాలానికి అనుగుణంగా ఆ ఊరూ మారింది. సురాపురం గ్రామం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. మానవత్వం పరిమళించింది. నైతిక విలువలుకు అర్థం తెలిపే ప్రజలు మెండుగా, దండుగా వున్నారు.

నేడు సురాపురం గ్రామ ప్రజలు నైతిక విలువలతో కూడిన దేశ సంస్కృతిని, సంపదను పెంపొందించుకోవడానికి నడుంకట్టారు. వ్యర్థ రాజకీయాలు, ముఠా తగాదాలు, గొడవలు, కొట్లాటలు ఈర్ష్యా ద్వేషాలకు స్వస్తి పలికారు. మానవ విలువలుకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి గ్రామాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో ఏ ఒక్కరికి ఆపద వచ్చినా, కష్టం కలిగినా వెనువెంటనే స్పందించి మేమున్నాం, భయపడవద్దని అభయమిచ్చి ఆదుకునే గొప్ప మనుషులు వుండడం ఈ గ్రామానికే గర్వకారణం. ఒక్కరి కోసం అందరూ - అందరి సంక్షేమ కోసం ప్రతి ఒక్కరు కలుపుగోరుతనంతో కలిసికట్టుగా, ఐకమత్యంతో, ప్రేమానురాగాలతో ఆర్థికపరమైన, అసాధారణ సహాయమైనా సాధ్యమేనని నిరూపించారు. మంచి సుగుణాలు గల ప్రజలు సురాపురం గ్రామవాసులు.

### మౌలిక సదుపాయాలలో జీవనోపాధుల అభివృద్ధి

నాటి కూలి బ్రతుకులు - మెతుకులు కోసం దీనంగా ఎదురుచూసే హీనమైన దుర్భర బ్రతుకులు పోయాయి. కాలగర్భంలో కలిసిపోయాయి. గ్రామంలో ప్రతి ఇల్లు వ్యాపారానికి నిలయంగా మారింది. జీవనోపాధికి లోటులేదు. ధాన్యం, అపరాలు, జీడిపప్పు, మిరపకాయలు, చింతపండు



Sthanka_Junecolo.indd 29 31/05/11 2:24 PM

వంటి ముఖ్య ఆహార ధాన్యాలు, ఆయా సీజన్‌లో వచ్చే ఫలసాయాల వ్యాపారంపై ఈ గ్రామ ప్రజల జీవనం కొనసాగుతుంది. ఈ గ్రామవాసులు సుమారు 60 శాతం మంది యువకులు 5 జిల్లాల వరకు వ్యాపారాలు కొనసాగి స్తున్నారు. మిగిలినవారు స్థానిక వ్యవసాయ పనులపై ఆధారపడి జీవనం చేస్తున్నారు. పొదుపు చేయటంలో గ్రామానికి ఎవరూ సాటిరారని చెప్పేందుకు అనుమానం లేదు.



## నైతిక విలువలతో సమైక్యత

గ్రామంలో గడచిన పది ఏళ్ళ నుండి నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నది. వర్గ వైషమ్యాలు, ద్వేష, భేషజాలు, అసూయ, కలహాలు, కక్షలతో కూడిన కార్పణ్యాలు కంటికి కన్పించవు. నేరాలు, సమస్యలు అసలే వినపడవు. పోలీస్‌స్టేషన్ రికార్డులలో ఎటువంటి కేసులు నమోదై వుండలేదు. ప్రజాస్వామ్యంలో విలువైన ఓటును ఎవరికి వారే వినియోగించుకుంటున్నారు. రాజకీయ భేదాలు సమసిపోయాయి. ఎన్నికల సమయాలలో ఎవరికి నచ్చిన పార్టీలకు, నాయకులకు వారు స్వేచ్ఛగా ఓటు వేసుకునే సంస్కృతిని అలవరచుకున్నారు.

## వికసించిన ప్రగతి పుష్పం- పారిశుద్ధ్యం

గతంతో పోల్చుకుంటే కలా? నిజమా? అన్న సందేహం తప్పక కల ుగుతుంది. గ్రామానికి వెళ్తూ, విసర్జించిన మలాన్ని తొక్కుకుంటూ, చీదరించుకుని ఒళ్ళు జలదరించుకుని నడిచే పెద్దవాళ్ళు నేటి సురాపురం గ్రామాన్ని సందర్శించి 'ఆహా... ఎంత విచిత్రం' అనేమాట తథ్యం.

2007 సంవత్సరంలో నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డును భారత రాష్ట్రపతి గౌరవ శ్రీ ఎ.పి.జె. అబ్దుల్‌కలామ్ గారి చేతుల మీదుగా అందుకుంది గ్రామం.

2008 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి గౌరవ డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి గారి చేతులమీదుగా 'శుభ్రమ్' అవార్డును కైవసం చేసుకొని మరో విజయాన్ని దక్కించుకుంది సురాపురం.

## టి.ఆర్.డి.ఓ. స్వచ్ఛంద సంస్థ కృషి అభినందనీయం

గ్రామాభివృద్ధితో పాటు పారిశుద్ధ్యం సాధించేందుకు ట్రైబల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ విశేష కృషి చేసింది. నిరంతరం ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రతి ఇంటికి అవగాహన కల్పించింది. వ్యవసాయం, ఆరోగ్యం, విద్యా, పొదుపు, హెచ్.ఐ.వి. / ఎయిడ్స్, జీవన నైపుణ్యాలు, నీరు -పారిశుధ్యం, నాయకత్వం, ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవటం వంటి తదితర సామాజిక అంశాల పై ఎప్పటికప్పుడు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించింది. టి.ఆర్.డి.ఓ. సంస్థ చైర్మన్ గుర్రాల షిబారత్నం, గ్రామ సర్పంచ్ శ్రీమతి వడ్డిరెడ్డి శ్రీలక్ష్మి, గ్రామం అభివృద్ధే లక్ష్యంగా ఎంతో శ్రమించి సొంత నిధులు వెచ్చించిన శ్రీ వడ్డిరెడ్డి రాంబాబులదే ఈ విజయం అని పలువులు కొనియాడారు.

## పారదర్శకతతో కూడిన సమర్థవంతమైన పాలన - గ్రామపంచాయితీ

మునుపటి పరిస్థితులకు, ప్రస్తుత పరిస్థితులకు నక్కకు-నాగలోకం అంత తేడా స్పష్టంగా కన్పిస్తుంది. తమ గ్రామాన్ని తామే బాగుచేసుకొని, తమ సమస్యలను తామే పరిష్కరించుకోవాలనే మంచి స్పృహతో యువతీ యువకులు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామ పంచాయితీలు తమ వంతు తోడ్పాటును అందించారు. గ్రామ పంచాయితీ ఆదాయ వనరులు అతి తక్కువైనప్పటికీ, నిరాశ చెందక వనరుల సమీకరణలో ఒక స్వచ్ఛంద సంస్థ వలె గ్రామ పంచాయితీ ప్రయత్నించి వివిధ ప్రభుత్వ అధికారులను కలిసి నిధులు సేకరించుకొని, అభివృద్ధికి కృషి చేయటంతో పాటు ప్రజలకు జవాబుదారీగా నిల్చింది. ప్రస్తుతం గ్రామంలో రాజకీయ విభేధాలు లేవు. ధనిక, పేద, కులమతాల భేషజాలు లేవు. ద్వేషాలు, అసూయలు అడుగంటిపోయాయి. ఈర్ష్యలు, వైషమ్యాలు, కక్ష్యలు, కార్పణ్యాలు కంటికి కన్పించవు. సమిష్టిగా, ఐకమత్యంగా, సహజీవనం చేస్తున్నారు. ప్రజలంతా ముక్త కంఠంతో ఐకమత్యపు రాగమాలికను లోకానికి వెల్లడిస్తున్నారు.




ఈ గ్రామంలో ప్రస్తుతం కాపు, రజక, నాయీ బ్రహ్మణ, కుమ్మరి, గౌడ, వైశ్య వంటి సామాజిక వర్గాలకు చెందిన 346 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరంతా సర్వతోముఖాభివృద్ధిని సాధించేలా ప్రశాంతమైన జీవనం కోసం సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా, ప్రత్యేక స్ఫూర్తిని అలవరచుకుంటున్నారు. అందమైన జీవితానికి ఆల వాలంగా అందరూ మమేకమై ముందుకు పోతున్నారు. అన్నింటా అందరి భాగస్వామ్యం కనిపించేలా ప్రగతి పథంలో అడుగిడుతున్నారు.



Sthanka_Junecolo.indd 30 31/05/11 2:24 PM

ఇందుకు సాక్ష్యంగా ప్రస్తుతం గ్రామంలో అభివృద్ధిని అంశాలవారీగా సమీక్షిద్దాం.

* నూటికి నూరు శాతం పారిశుద్ధ్యం
* నూటికి నూరు శాతం వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం
* నూటికి నూరు శాతం పరిసరాలను పరిరక్షించుకోవడం
* నూటికి నూరు శాతం బహిరంగ మలవిసర్జన లేకపోవడం
* నూటికి నూరు శాతం రహదార్లు అన్నీయు సిమెంట్ రోడ్లు
* నూటికి నూరు శాతం బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో నమోదు




* నూటికి నూరు శాతం పాఠశాలకు హాజరు కావడం
* నూటికి నూరు శాతం బాలకార్మికులు లేకపోవడం
* ప్రభుత్వ అంచనాల మేరకు 90 శాతం వయోజన అక్షరాస్యత సాధించడం
* సక్రమంగా వీధి దీపాల వినియోగం
* ప్రతి ఇంట్లో విద్యుత్ సౌకర్యం ఏర్పరచుకోవడం
* ప్రజా భాగస్వామ్యంతో ఐకమత్యంగా మెలగడం
* నేరాలు, నేరస్తులు లేకుండా జాగ్రత్తపడటం
* బాల్యవివాహాలు జరపక పోవడం
* పారదర్శకతతో పంచాయితీ పాలన కొనసాగించడం
* ఇంటి పన్నులను నూటికి నూరు శాతం చెల్లించడం
* గ్రామ సభల నిర్వహణ ద్వారా అర్హులైన వారిని పథకాల వినియోగానికి ఎంపిక చేయడం
* ప్రజల ఆర్థిక పరిపుష్టిని పెంపొందించేలా చర్యలు చేపట్టడం
* గ్రామ అవసరాలను గుర్తించి, అవి సాధించుకునే దిశలో ఉండడం
* క్రమబద్ధంగా పంచాయితీ సమావేశాలు నిర్వహించుకోవడం
* నిర్ణీత సమయంలో గ్రామస్థాయి ప్రణాళికలను రచించుకోవడం
* సహజ వనరుల పరిరక్షణను నూటికి నూరు శాతం గమనించడం
* చిన్న మొత్తాల పొదుపుతో 70 శాతం ప్రగతి సాధించడం
* మహిళా సాధికారతను సాధించడం

ఇలా ఎన్నెన్నో మంచి పనులు చేపట్టారు. అనుకున్న ప్రగతిని సాధించారు.

ఒక్కరి వల్ల కాదనుకున్నారు. అందుకే అంశానికో కమిటీని ఏర్పరచుకున్నారు.

ఆ కమిటీలను ఇలా రూపకల్పన చేసుకున్నారు.

* జీవనోపాదుల వనరుల కమిటీ
* త్రాగునీటి కమిటీ
* పారిశుద్ధ్య పరిరక్షణ కమిటీ
* విద్యాభివృద్ధి కమిటీ
* మహిళా సాధికారతా కమిటీ
* పశు సంరక్షణ కమిటీ






Sthanka_Junecolo.indd 31 31/05/11 2:24 PM

* ఆరోగ్య పరిరక్షణా కమిటీ
* తల్లీ బిడ్డల సంరక్షణ కమిటీ
* శాంతి భద్రతల కమిటీ
* వ్యవసాయ కమిటీ

ఇలా రకరకాలుగా కమిటీలు ఏర్పరచుకున్నారు. సాధించాల్సిన ఆశయాలను రూపొందించుకున్నారు. ఆశయ సాధనకు నడుం కట్టుకున్నారు. అనుకున్నది లక్ష్యాత్మకంగా సాధించారు. విజయ సంకేతాన్ని తోటి లోకానికి చాటి చెప్పారు.

***2006 సంవత్సరం నుండి గ్రామ పంచాయితీ చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు-***

* 13 లక్షల రూపాయల వ్యవసాయంతో రక్షిత మంచినీటి సదుపాయం కోసం వాటర్‌ట్యాంక్ నిర్మించడమైంది.
* 15 లక్షల రూపాయల వ్యయంతో గ్రామంలోని సిమెంట్ రోడ్లును నిర్మించడమైనది.




* 10 లక్షల రూపాయల వ్యవసాయంతో డ్రెయినేజ వ్యవస్థను ఏర్పాటు చేయడమైనది.
* 7 లక్షల 75 వేల వ్యయంతో (ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. గ్రాంట్లు) వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేయుడమైనది.
* జిల్లా పరిషత్, స్త్రీ సంక్షేమ శాఖల నిధులతో రూ. 4.50 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాలు, డ్వాక్రా మహిళా బిల్డింగ్ నిర్మించడమైనది.
* 3 లక్షల 80 వేల రూపాయల సర్వ శిక్ష అభియాన్ ఆర్.వి.ఎమ్. నిధులతో పాఠశాల భవనం నిర్మాణం
* 60 వేల రూపాయలతో పంచాయితీ స్థలాలను ఎత్తు చేయటం.
* 75 ఇళ్లను ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మించడమైనది.
* 53 మంది లబ్ధిదారులకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయడం జరిగింది.
* 103 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేయడమైనది.
* గ్రామస్తులందరకు వ్యక్తిగత మరుగుదొడ్లను మంజూరు చేసి నిర్మించడమైనది.
* అర్హులైన వారందరికి రేషన్ కార్డులు ఇప్పించడమైనది.
* గ్రామ పంచాయితీ పరిధిలో ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టడమైనది.
* పంచాయితీ కార్యాలయం, అంగన్‌వాడీ భవనం నిర్మించడమైనది.
* 3 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు నిర్మించడమైనది.
* గ్రామస్థుల శ్రమదానంతో గుమ్మడి గొయ్యి చెరువు బాగు చేయడమైనది.

ఈ గ్రామంలో వరి, చెరకు, అరటి, కూరగాయల పెంపకంతోపాటు, కొబ్బరి, పామాయిలు, కోక్, జామ, మామిడి, వివిధ అపరాల సేద్యం, మొక్కజొన్న మొదలైన పంటలతో 600 ఎకరాల వినియోగంతో ఆ గ్రామమంతటా సస్యశ్యామల వాతావరణాన్ని నూటికి నూరు పచ్చదనాన్ని ఏర్పరచుకున్నారు. ఫలప్రదమైన జీవన సంపదను పెంచుకుంటున్నారు. సమిష్టిగా ఆలోచనలు అందరూ పంచుకుంటున్నారు. నిర్మాణాత్మకమైన, సృజనాత్మకమైన, క్రియాత్మక కార్యాచరణ సాగిస్తున్నారు. అందుకే ప్రగతి సాధ్యం అయింది అని వారే అనుకుంటున్నారు.

నాటికి నేటికి ఎంత మార్పు అని సంబరపడి పోతున్నారు. ఇక పంచాయితీ వనరులు, ఆదాయాలు పరిశీలిద్దాం.

| | |
|---|---|
| పంచాయితీ చెరువుల చేపల ద్వారా | రూ. 60,000.00లు |
| కొబ్బరి చెట్ల వేలం ద్వారా | రూ. 6,000.00లు |
| ఇంటి పన్నుల వసూలు ద్వారా | రూ. 65,000.00లు |
| నీటి పన్ను ద్వారా | రూ. 57,000.00లు |
| దుకాణాల ద్వారా | రూ. 2,000.00లు |
| పచ్చగడ్డి పాటల ద్వారా | రూ. 1,000.00లు |

ఇలా మొత్తం మీద రమారమి రెండు లక్షల రూపాయిలు ఆదాయాన్ని కలిగి ఉన్నారు. ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా ఆదాయాన్ని సమీకరిస్తున్నారు. సమీకరించిన దానితో సమిష్టిగా వినియోగిస్తున్నారు. సహజీవనం సాగిస్తున్నారు. ఎందరికో ఆదర్శులయ్యారు.

అవార్డుల కోసం ఈ గ్రామం పాటు పడలేదు.

స్వగ్రామ ప్రగతికి ఆలోచన చేశారు.

గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పరచుకున్నారు.

ప్రభుత్వ ప్రశంసలను, అధికారుల ఆదరాభిమానాలకు చూరగొన్నారు.

ప్రజాస్వామ్యంలో పల్లె ప్రగతికి నిదర్శనం అయ్యారు.

నాటి సురాపురానికి, నేటి సురాపురానికి వున్న తేడాను, అభివృద్ధిని, నలుగురికీ తెలిసేలా, గర్వించేలా నిలబడ్డారు.

*'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్,*
*ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్'*

అన్న గురజాడ మాటలను అడుగుజాడగా చేసుకొని సురాపురం జాడను విశాల విశ్వానికి ప్రగతి రూపకంలో ఆవిష్కరించారు.

*- గుర్రాల ప్రసంగిరాజు,*
*మేనేజరు, జిల్లా ప్రజా పరిషత్ ట్రైనింగ్ సెల్,*
*పశ్చిమగోదావరి జిల్లా*



Sthanka_Junecolo.indd 32 31/05/11 2:24 PM





**సచిన్ టెండూల్కర్, మహేంద్రసింగ్ ధోని, సైనా నెహ్వాల్, పుల్లెల గోపిచంద్, లియాండర్ పేస్, సానియా మీర్జా వంటి క్రీడాకారులు సాధించిన అద్భుత విజయాల వల్ల క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్‌లు మన క్రీడారంగంలో విడదీయలేని భాగాలయిపోయాయి.**

ఇప్పుడు కబడ్డీ అంతర్జాతీయ స్థాయిలో సంచలనాలు సృష్టిస్తోంది. భారతదేశపు సాంప్రదాయక క్రీడల్లో కబడ్డీ అగ్రస్థానంలో ఉంటుంది. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో ఈ క్రీడ సంచలనాలు సృష్టించడానికి ఆటగాళ్ల గ్లామర్ కంటే ఆటలోని ఆకర్షణ శక్తే కారణం.

భారతదేశంలో 'గల్లీ నుంచి ఢిల్లీ' వరకు సాధారణ ప్రజలు ఆడే ఈ కబడ్డీ ఇప్పుడు అనేక దేశాల్లో గుర్తింపు పొందిన, ప్రజాదరణ పొందిన క్రీడగా మారిందంటే, అది మనందరికీ గొప్ప గర్వకారణం, సంతృప్తి దాయకం. ప్రస్తుతం కబడ్డీని వివిధరూపాల్లో అమెరికా, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇతర దక్షిణాసియా దేశాల్లో ఆడుతున్నారు. మన దేశంలో కంటే, ఈ ఆట ఇరాన్‌లో ఎక్కువ ప్రభుత్వ మద్దతును, ప్రోత్సాహాన్ని పొందటం వింతగా అన్పించినా, అది నిజం.

1960ల దశకం వరకు ఫీల్డ్ హాకీలో భారతదేశానికి ఎదురేలేదని ప్రతి ఒక్కరికీ తెలుసు హాకీలో ఒలింపిక్ గోల్డ్‌మెడల్ భారతదేశపు సొత్తని ఇతర దేశాలు భావిస్తుండటంతో, కొన్ని తొలి ఒలింపిక్స్ పోటీలలో మనదేశం ఆడుతూ పాడుతూ పాటీల్లో పాల్గొంది. అంతర్జాతీయ క్రీడల్లో భారతదేశం శక్తిగా లేకపోయినప్పటికీ, కనీసం హాకీ జట్టు అయినా ఒలింపిక్స్ గోల్డ్‌మెడల్ సాధిస్తుందని ప్రజలు దృఢంగా విశ్వసించేవారు.

అయితే, తదుపరి సంవత్సరాలలో భారతదేశం తన హాకీ కిరీటాన్ని పాకిస్తాన్‌కు అప్పగించటమే కాదు, ఆ తరువాత ఇతర దేశాలకు

# అంతర్జాతీయ స్థాయికి మన గ్రామీణ

అప్పగించింది. అంతేకాదు, తన పతనాన్ని అతి శీఘ్రంగా కొనసాగించింది.

ప్రస్తుతం కబడ్డీలో భారతదేశం ప్రపంచంలో నెంబర్‌వన్‌గా ఉంది. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో దేశానికి తిరిగి గౌరవ ప్రదమైన స్థానాన్ని కబడ్డీ అందించింది. అయితే, అగ్రస్థానం మనకు ఎంతో కాలం ఉంటుందన్న ఆశ లేదు. ఎందుకంటే, కబడ్డీలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇరాన్ దేశాలు మనకు గట్టి పోటీని ఇస్తున్నాయి. మన దేశాన్ని అగ్రస్థానం నుంచి తోసివేయగలిగే శక్తిని ఇవి ప్రదర్శిస్తున్నాయి.

మనలో చాలామందికి కబడ్డీ వెనుక ఉన్న అద్భుతమైన చరిత్ర తెలియదు. మహాభారతంలోని చక్రవ్యూహం, పద్మవ్యూహం ఉదంతం స్ఫూర్తితో కబడ్డీ ఆట పుట్టిందని చెబుతారు. అర్జునుడి ధీరోదాత్తుడైన కుమారుడు అభిమన్యుడు పద్మవ్యూహమనే శత్రు శిబిరంలోకి ధైర్యంగా చొచ్చుకుని వెళ్తాడు గానీ, బయటకు రావటం తెలియక శత్రువుల చేతిలో మరణిస్తాడు.



# ం కబడ్డీ

భారతదేశంలోని ఉత్తర ప్రాంతాల్లోను, బంగ్లాదేశ్‌లోను కబడ్డీని షిరాజ్ డు-డు అని కానీ, షిరాజ్ టు-టు అని కానీ, కనక అనికానీ వ్యవహరిస్తారు. మన రాష్ట్రంలో దీని 'చెడుగుడు' అని పిలుస్తారు. ఈ క్రీడలో అమర, సంజీవిని, గామిని అనే వివిధ రకాలు ఉన్నాయి. అయితే, ప్రామాణికమైన కబడ్డీ మాత్రం ఈ అన్నిటి మేళవింపే.

మహారాష్ట్రలోని అమరావతి హనుమాన్ వ్యాయామ ప్రసారక్ మండల్ 1936లో బెర్లిన్ ఒలింపిక్స్‌లో దీన్ని ప్రదర్శించి నప్పుడే కబడ్డీ పేరు ప్రఖ్యాతులు దేశ సరిహద్దులు దాటాయి. 1938లో కలకత్తాలో జరిగిన ఇండియన్ ఒలింపిక్స్‌గేమ్స్‌లలో కూడా కబడ్డీని ప్రవేశపెట్టారు.

ఆ తరువాత ఆలిండియా కబడ్డీ ఫెడరేషన్, అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎకెఎఫ్‌ఐ) సంస్థలను నెలకొల్పి, కబడ్డీకి నిబంధనలకు తయారు చేశారు. 1950ల దశకంలో మొదటి పురుషుల జాతీయ స్థాయి పోటీలను మద్రాసు, మొదటి మహిళల జాతీయ స్థాయి పోటీలను కలకత్తా నిర్వహించాయి.




తదుపరి ఆసియన్ అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్‌ను నెలకొల్పారు. ఈ క్రీడను ప్రవేశపెట్టడానికి ప్రొఫెసర్ సుందరరావు ను ఫెడరేషన్ జపాన్‌కు పంపించింది. భారతదేశం, బంగ్లాదేశ్‌లు ఇరు దేశాల్లో టెస్టు మ్యాచ్‌లు ఆడాయి.



1980లో ప్రవేశపెట్టిన ఆసియన్ ఛాంపియన్‌షిప్‌ను భారతదేశం గెలుచుకుంది. 1985లో జరిగిన ఆసియన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కూడా ఆ ఛాంపియన్‌షిప్‌ను భారతదేశం నిలబెట్టుకుంది. బంగ్లాదేశ్ ద్వితీయ స్థానంలో వచ్చింది. ఈ పోటీల్లో జపాన్, మలేసియా దేశాలు కూడా పాల్గొన్నాయి.

బీజింగ్‌లో 1990లో జరిగిన ఆసియా గేమ్స్‌లో కూడా కబడ్డీని ప్రవేశపెట్టారు. ఈ పోటీల్లో చైనా, జపాన్, మలేసియా, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్ పాల్గొన్నాయి. భారత్ ఈ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి, ఆ తరువాత కూడా తన అగ్రస్థానాన్ని కాపాడుకుంది. 1994లో హిరోషిమా, 1998లో బ్యాంకాక్, 2002లో బూసాన్, 2006లో దోహా, 2010 గ్వాంగ్‌జూలలో జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ గోల్డ్‌మెడల్స్‌సాధించి కబడ్డీలో తన సత్తాను చాటుకుంది.

ఇంతకుముందే పేర్కొన్నట్లు, ఇరాన్ కబడ్డీ క్రీడలో దూసుకుని పోతోంది. త్వరలోనే ఇది భారత్‌కు, మన పొరుగుదేశాలైన బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లకు కూడా సవాలు విసిరే స్థాయికి చేరుకోవచ్చు. ఇరాన్‌లో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలున్నాయి. భారత జాతీయకోచ్, అర్జున్ అవార్డు గ్రహీత అయిన ఆశన్‌కుమార్ ప్రస్తుతం ఇరాన్‌కు కబడ్డీ కోచ్‌గా ఉంటూ, ఆ దేశ జట్టుకు శిక్షణ ఇస్తున్నారు.

ఇప్పటికే ప్రజాదరణ పొందిన కబడ్డీకి మరింత ఊపు తీసుకుని రావడానికి మనదేశంలోని పంజాబ్‌రాష్ట్రం 2010 ఏప్రిల్‌లో "సర్కిల్ స్టైల్ 2010 కబడ్డీ వరల్డ్ కప్" అనే పేరిట అంతర్జాతీయ స్థాయి పోటీలను నిర్వహించింది. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవ మ్యాచ్ పాటియాలాలో జరగగా, ముగింపు ఉత్సవం లూధియానాలో జరిగింది.

సర్కిల్ స్టైల్ వరల్డ్ కప్ మొదటి పోటీల ఛాంపియన్‌షిప్‌ను భారత్ గెలుచుకుంది. తన ప్రత్యర్థి పాకిస్తాన్‌ను ఫైనల్‌లో తేలిగ్గా మనదేశం ఓడించింది. తళతళ మెరిసే ట్రోఫీతో పాటు, మన జట్టుకు రూ. కోటిరూపాయల నగదు బహుమతి అందగా, పాకిస్తాన్ జట్టుకు రూ. 51 లక్షల నగదు బహుమతి లభించింది.

కబడ్డీ మొదటి ప్రపంచకప్ టోర్నమెంట్ 2004లో జరగగా, రెండవ ప్రపంచకప్ టోర్నమెంట్ 2007లో జరిగింది. ఫైనల్స్‌లో ఇరాన్‌ని ఓడించడం ద్వారా భారత్ రెండుసార్లు కప్ గెలుచుకుంది.

అంతర్జాతీయ కబడ్డీ ఫెడరేషన్‌లో ఆసియా నుంచి 19 దేశాలు, యూరప్ నుంచి 8 దేశాలు, ఆస్ట్రేలియా సభ్యులుగా ఉన్నాయి. దీనిని బట్టే కబడ్డీకి ఎంత ఆదరణ పెరిగిందో మనం అర్థం చేసుకోవచ్చు. ఈ దేశాలేకాక, అమెరికా, కెనడా, వెస్ట్ఇండీస్ కూడా కబడ్డీ వరల్డ్‌కప్ టోర్నమెంట్లలో పాల్గొన్నాయి. ■



# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల శిక్షణ దేశానికే ఆదర్శప్రాయం

**శ్రీ-క్యాప్ ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు అపార్డులో నిర్వహిస్తున్న 3 రోజుల శిక్షణా కార్యక్రమం విధానం దేశానికే మార్గదర్శకం అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ నితేన్ చంద్ర ఐ.ఏ.ఎస్. అన్నారు. రాష్ట్రంలోని 78 గ్రామ పంచాయితీల నుండి ఎంపిక చేయబడిన సుమారు 2200 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు ఉద్దేశించిన శిక్షణా కార్యక్రమం అపార్డులో తేది : 25.3.2011న ప్రారంభమైనది.**

తొలి విడతగా 1100 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు 5 బ్యాచ్‌లలో ది:23.5.2011 నుండి 8.6.2011 వరకూ శిక్షణ అందచేయటానికి అపార్డు అన్ని ఏర్పాట్లు చేసిందని అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి, కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీకి వివరించారు. ఈ సందర్భంగా శ్రీ నితేన్ చంద్ర మాట్లాడుతూ 3 రోజుల పాటు అందించే శిక్షణలో విషయ పరిజ్ఞానానికి తోడు వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మిక చింతన, సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు, దేశ సేవ, త్యాగ నిరతి వంటి అంశాలను చేర్చి శిక్షణ అందించటం అభినందనీయం అన్నారు. దాతృత్వం, ఔదార్యం వంటి గుణాలను ప్రదర్శిస్తున్న రామకృష్ణ, నిస్సార్‌లపై రూపొందించిన లఘు చిత్రాలు స్ఫూర్తి దాయకంగా ఉన్నాయన్నారు. అనంతరం ఈ ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ఎలా అమలు చేయాలనే విషయాలపై ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. డైరెక్టర్ శ్రీ మురళి, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ కమీషనర్ శ్రీమతి సువర్ణ, ఐఎఫ్ఎస్ లతో చర్చించారు.



# తరిగిపోతున్న ప్రకృతి వనరులు - పొంచి ఉన్న పెను ప్రమాదం

**భూభాగంలో జీవిస్తున్న సమస్త ప్రాణులు తమంతట తాము జీవించలేవు. సృష్టించబడిన ప్రతిజీవి తన మనుగడకోసం ఆహారం, ఆరోగ్యం, రక్షణ, ప్రత్యుత్పత్తి వంటి మౌలిక సదుపాయాలకోసం చుట్టూ వున్న ప్రకృతి, పరిసరాల మీద ఆధారపడి జీవిస్తాయి. అలాగే, మానవులు కూడా తమ మనుగడ కోసం పంచభూతాల్లో లభించే సహజవనరులపై ఆధారపడి జీవించవలసినవారే. ఏ జీవియైనా ఈ విషయంలో విఫలమైతే అది జీవించలేక కాలక్రమేణా నశించిపోతుంది, అదేవిధంగా సృష్టికర్తయైన పరమాత్ముడు సృజించిన సృష్టిని మానవులు దుర్వినియోగం చేసినట్లయితే, సృష్టంతా వినాశనమవుతుంది. దేవుడు పంచభూతాలను మానవుల మనుగడకు రక్షణ కవచంగా అమర్చాడు. సూర్యచంద్ర నక్షత్రాలు, నదులు, సముద్రాలు, పచ్చని పర్యావరణంతో కూడిన దట్టమైన అడవులు, ఎత్తైన కొండలు, పర్వతాలు వంటి రమణీయమైన సహజవనరులన్నీ, సర్వ సంపదలుగా మానవుల జీవన విధానాలకు అనువుగా ఏర్పాటు చేశాడు.**



పూర్వం మానవుడు సహజ వనరులను సక్రమంగా వినయోగించుకోవడంతో పాటు, వాటి సంరక్షణకు కృషి చేయడం వలన ఆరోగ్యవంతునిగా, పరిపూర్ణంగా జీవించగలిగాడు. పంచభూతాలు కూడ తమ చర్యలను సకాలంలో నిర్వహిస్తూ, సకల జీవుల జీవన విధానానికి మరింత మేలును సమకూర్చే విధంగా సహకరించగలిగాయి. మానవునికి కావలసినంత రక్షణ యిచ్చేవి. జీవరాసులన్నీ ఎంతో ఆనందంగా జీవిస్తూ, ప్రత్యుత్పత్తిని సాధించగలిగేవి. సమస్త జీవకోటికి రక్షణ కవచంగా వుండి వాటిని కాపాడేవి.

నేడు మానవులు అభివృద్ధి సాధించే దిశలో సహజ వనరులను అతిగా ఉపయోగించుకుంటూ వాటి పునరుత్పత్తిని నిర్వీర్యం చేస్తున్నారు. వీటిని వినియోగించడంలో నేర్పరులై, సంరక్షించడంలో నిర్లక్ష్యధోరణి అవలంబిస్తున్నారు. అభివృద్ధి అనే మీమాంసతో పచ్చదనం హరించి వేస్తున్నారు. పచ్చని చెట్లను, అడవులను అధికంగా నరికివేస్తున్నారు. దట్టమైన అడవులను, ఎత్తైన శిఖరాలను, పర్వతాలను పిండిచేస్తున్నారు. వాతావరణాన్ని నాశనం చేసే కాలుష్య కారకాలు గల ఫ్యాక్టరీలను, పరిశ్రమలను నిర్మిస్తూ నాణ్యత లేని ఆహారోత్పత్తులకు కారణమౌతున్నారు. జీవన వ్యవస్థ మనుగడను, ఉనికిని కోల్పోయే దుస్థితిని కల్పిస్తున్నారు. పంచభూతాలను సహితం కలుషితం చేసే హేయమైన చర్యలకు శ్రీకారం చుట్టారు. జనాభా పెరుగుదల, పేదరికం, వివిధ రకాల తెగుళ్లచేత ఆరోగ్యాలను కోల్పోవడం ద్వారా అకాల మరణాలు, అతివృష్టి- అనావృష్టి, కరువు, కాటకాలు, విపరీత ప్రకృతి వైపరీత్యాలకు తెరతీసారు. ఎప్పుడు ఏమి సంభవిస్తుందోననే భయం జీవించే విధంగా అభద్రతలో నివసిస్తుంది నేటి ప్రపంచం.

పంచభూతాలను సహితం లోబరచుకొని సహజ సంపదను అనుభవిస్తూ, ఎంతో అభివృద్ధికి సాధించారు మానవులు. కాని మానవ మనుగడకు మూలమైన సహజ సృష్టిని పరిరక్షించుకోవడంలో మానవుడు విఫలమై, జీవులకు శాపంగా మారడం దురదృష్టకరం.

ఎంతో సుందరమైన సహజ సృష్టిని మానవులు తమ స్వార్ధానికి బలితీసుకుంటున్నారు. ఎంతో సమతుల్యంగా, ఉన్నతంగా వుండే భూభాగాలను నాశనం చేస్తున్నారు. సహజ వనరులైన ప్రకృతి, భూగర్భజలాలు, ఖనిజ సంపద, గనులు, జలవనరులు, నదులు, వృక్ష సంపద, పర్యావరణ, జీవావరణం వంటి రక్షణ కవచాలను దుర్వినియోగం చేయడం వలన సకల జీవకోటి ప్రాణులు విషపుమడుగలో అత్యంత ప్రమాదాలకు గురికాక తప్పదు.

## తరిగిపోతున్న సహజవనరులు

### పర్యావరణం - పచ్చదనం

సృష్టికి ప్రతిరూపమే పర్యావరణం. ఆహ్లాదం, ఆరోగ్యం, ఆనందంతో పాటు మనసును ఉత్తేజపరిచేవి ప్రకృతి అందాలైన పచ్చని చెట్లు, దట్టమైన అడవులు, ఎత్తైన శిఖరాలు, పచ్చని పొలాలు, అనువైన మైదానాలు, పచ్చిక బయళ్లు, కొండలు, గుట్టలు, నదులు, సముద్రాలు, వన్యప్రాణులు, జలచరాలు. ఇవన్నీ పర్యావరణ వనరులే.

### వృక్ష సంపద

అడవులు అంతరించిపోతూ, చెట్లు తరిగిపోతూ వుండడం వలన వాతావరణంలో పెనుమార్పులు సంభవించి మానవ మనుగడకు ముప్పు ఏర్పడనున్నది. ప్రభుత్వం గాని, ప్రజా ప్రతినిధులు గాని సంబంధిత అధికారులుగాని పట్టించుకోకపోవడం దురదృష్టం, అక్రమార్జనకు అలవాటుపడిన మానవ మృగాలు కోట్లకు పడగెత్తి కోట్లాది ప్రాణాలకు సంకటంగా మారుతున్నారు.

అటవీ ప్రాంతాలను పరిరక్షించే అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రమే. ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు అడవులను ఎరగా వేస్తూ, లక్షలాది ఎకరాల అడవి భూములను పోడు భూములుగా మార్చటం వలన, రాష్ట్రంలో సహజ అడవులు రానురాను అంతరించి పోతున్నాయి. కొంతమంది స్వార్థపరులు ఏజన్సీ ప్రజల పేదరికం, అమాయకత్వం, నిరక్షరాస్యత వంటి బలహీనతలను అనుకూలంగా మార్చుకుని వారి చేతనే మంచి వృక్షాలను, విలువైన చెట్లను నరికిస్తూ, వన్యప్రాణులను సంహరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అటవీ ఉత్పత్తులను



StanikapalanaAditionJune2011_36to39and61to64Color_FSr.pmd 31/05/2011, 02:53 PM

అక్రమంగా అనుభవిస్తున్నారు. అటవీ జంతువులను విచ్చలవిడిగా వేటాడి, హతమార్చి అక్రమంగా వాటి మాంసాన్ని కూడా విక్రయిస్తున్నారు.

మానవ మనుగడకు జీవనాధారం సహజ సంపదలైన భూమి, నీరు, గాలి, పచ్చని చెట్లు, వాతావరణం, సహజ పంటలు కాగా, ఒకవైపు సహజ సంపదను కోల్పోతున్న సమాజం మరోవైపు కాలుష్యానికి గురౌతుంది, వ్యవసాయ సాగు పంటలు సైతం అధిక రసాయనాల ఎరువుల వాడకం ద్వారా కలుషితం కాబడి, ఋగ్మతలతో అనారోగ్యాల పాలై మనుషులు ఆయుః ప్రమాణం కోల్పోతున్నారు. పరిశ్రమలు, ఫ్యాక్టరీలు విడుదల చేసే రసాయనాల వ్యర్థపదార్థాలు, ధ్వని, పొగ, వేడి, కాంతిశక్తి, ప్లాస్టిక్ వినియోగం, వాయుకాలుష్యం వంటి కాలుష్య కారకాలు అదనంగా చేరడంవలన జీవావరణం దెబ్బ తింటుంది. అంతరిక్ష పరిశోధనలు అత్యధికంగా జరపడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు మేలు కంటే కీడు అధికంగా ఉత్పన్నమౌతుంది. భూమికి, అంతరిక్షానికి మధ్యనున్న ఓజోన్ పొరతో పాటు, పర్యావరణం, గాలి, నీరు ఆహారం కలుషితమై అనేక అనారోగ్యాలకు దోహదపడి మరణాలకు దారితీస్తాయి. మానవ ఆయు: ప్రమాణం కోల్పోవడంతో పాటు మానవ మనుగడకు ముప్పు వాటిల్లితుంది. భూగర్భ జలాలు ఇంకిపోతాయి. నదులు నీటి వనరులు ఎండిపోతాయి. వాతావరణం సక్రమంగా లేనందువలన వర్షాలు కుంటు పడతాయి. అతివృష్టి - అనావృష్టి, కరువు - కాటకాలు వాతావరణంలో విచిత్ర ధోరణి అవలంబిస్తాయి. సముద్రంలో పెనుమార్పులు, భూమిపై వింత దృశ్యాలు సంభవిస్తాయి.

## పర్యావరణ పరిరక్షణ - మనందరి బాధ్యత

పంచభూతాల (భూమి, ఆకాశం, వాయువు, నీరు, అగ్ని)ను సక్రమంగా వినియోగించుకుంటే సర్వ జీవరాసులకు రక్షణ కవచాలుగా మేలుచేస్తాయి. అక్రమంగా వినియోగించుకుంటే సమస్త సృష్టిని నాశనం చేసే అత్యంత భయంకరమైన విషశక్తులుగా మారతాయి. పర్యావరణాన్ని నాశనం చేసే పరిశ్రమలను అదుపుచేయాలి. వ్యర్థ పదార్థాలను సక్రమంగా వినియోగించని పరిశ్రమలు, ఫ్యాక్టరీలపై చర్యలు చేపట్టాలి. పరిశ్రమల పనితీరును చట్టానికి అనుగుణంగా పారదర్శకతతో పర్యవేక్షణ నిత్యం వుండే విధంగా ఏర్పాటుచేయాలి.

## తక్షణం చేపట్టవలసిన చర్యలు

### 1. భూసంరక్షణ :

పంచభూతాలు జీవరాశికి సహజసిద్ధంగా లభించిన గొప్ప సంపద. మానవజాతి సర్వసౌభాగ్యానికి మూలాధారం భూమి. భూసంరక్షణకు అందరూ శ్రీకారం చుట్టాలి. జనాభానంఖ్య నానాటికీ పెరుగుతున్నందువలన కావలసిన ఆహారోత్పత్తుల సాధనకోసం వ్యవసాయోగ్యమైన అధికశాతం భూములను వ్యవసాయానికే వినియోగించాలి. మంచి నేలలను దుర్వినియోగం చేయకుండా చట్టంద్వారా కాపాడాలి. వ్యవసాయానికి అనువుగాని నేలలలో వృక్షాలను నాటటం ద్వారా పర్యావరణ పరిరక్షణ ఎంతైనా అవసరం. జలకాలుష్య నియంత్రణ, నివారణలకు తగిన చర్యలు చేపట్టాలి.

### 2. భూగర్భజలాల వినియోగం :

భూగర్భజలాలు మానవునికి జీవనాధారం. గనుక భూమి మనుగడ కొరకు భూగర్భజలాలు ఇంకిపోకుండా వాటి వినియోగంపై అందరికీ అవగాహన పెంచాలి. పంటలకు సరిపడా నీటి వినియోగం, తేలికపాటి పంటలు పండించడం వర్షాల వలన వచ్చే నీటిని సంరక్షించుకోవడంలో తగిన పద్ధతులను తెలియజేయాలి. జల కాలుష్య నియంత్రణ నివారణలకు తగిన ప్రాధాన్యత నిచ్చి భూగర్భజాలాల పెంపునకు శ్రీకారం చుట్టాలి.

### 3. వృక్ష సంపద :

భూమి మనుగడకు మరోమూలం వృక్ష సంపద. భూమిపై సృష్టించబడిన సహజ వనరులలో ప్రధానమైనది వృక్ష సంపద, అడవులలో వృక్షాలను నరకివేయడం వలన వృక్ష సంపద నానాటికీ హరిస్తోంది. దీనివలన పర్యావరణం క్షీణిస్తూ, వర్షాలకు, ప్రాణవాయువుకు అంతరాయం కలిగి ఉష్ణోగ్రతల ప్రభావం భూమిపై పడి దుష్పరిమాణాలు కలిగిస్తాయి. ఓజోన్ పొర దెబ్బతినడం వలన తీక్షణమైన వేడివలన సకల జీవరాసులు నాశనానికి గురవుతాయి. వంటచెరకు కోసం సామాజిక అడవులను పెంచడం, తక్కువ రోజులలో ఏపుగా ఎదిగే చెట్లను నాటించేటట్లు ప్రజలకు చైతన్యవంతులను చేయాలి. అడవులను కాపాడుకొని చెట్లను నాటి వృక్ష సంపదను పెంపొందించుకొనే విధంగా ప్రోత్సహించాలి.

### 4. కాలుష్య నివారణ :

నీరు, గాలి, వాతావరణాన్ని కలుషితంచేసే కాలుష్యాన్ని సాధ్యమైనంత వరకు అరికట్టాలి. పరిశ్రమలు, ఫ్యాక్టరీల ద్వారా వెలువడే వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం, ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వాయు నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపట్టాలి.

### 5. పర్యావరణం - పచ్చదనం :

మనుషులు వదలుతున్న వ్యర్థపదార్థాలు భూమిని, నీటిని, గాలిని, పర్యావరణాన్ని పాడుచేసే సమస్త కాలుష్య కారకాలపై మంచి అవగాహన పెంచేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రజల భాగస్వామ్యంతో కాలుష్య కారకాల వినియోగానికి నివారణ చర్యలు చేపట్టాలి. పొంచిఉన్న ప్రమాదాన్ని ప్రభుత్వం, అంచనావేసి, అదుపుచేసేందుకు ప్రణాళికాబద్ధంగా మానవ మనుగడ రక్షణ కొరకు పనిచేయాలి.

పర్యావరణ పరిరక్షణ, సహజవనరుల సంరక్షణ, కాలుష్య నియంత్రణ నివారణ చట్టాలు పటిష్టంగా వేగవంతంగా అమలుచేసి ప్రజలకు, పారిశ్రామిక వేత్తలకు సమగ్ర అవగాహనను పెంచి, ముందున్న పెనుప్రమాదాన్ని తప్పించుకోవచ్చును. భూగర్భజలాలు, ఖనిజ సంపద, వృక్ష సంపద, జంతు సంపద, భూమి వినియోగం, పర్యావరణ పరిరక్షణ వంటి సహజ సంపదలపై శ్రద్ధచూపి వాటిని రక్షించుకోవలసిన బాధ్యత అందరిపై వుంది.

**- జి. ప్రసంగిరాజు,**

*జిల్లా ట్రైనింగ్ మేనేజరు, పశ్చిమగోదావరి జిల్లా.*



StanikapalanaAditionJune2011_36to39and61to64Color_FSr.pmd 31/05/2011, 02:53 PM

# రక్తహీనతను అధిగమించటం ఎలా?

**ఆరోగ్యం అంటే జబ్బులేకపోవటమే కాకుండా, శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉండటం.**

**ఈ విధంగా ఉండాలంటే మన శరీర తత్వానికి తగిన ఆహారం తీసుకోవటం, పోషక విలువలతో కూడి, మానసిక ఒత్తిడినీ తగ్గించే యోగా, మెడిటేషన్ చేయుటం, ఆటలు ఆడటం వంటి కొన్ని మంచి అలవాట్లు చేసుకొని ప్రతినిత్యం వాటిని ఆచరించటం వలన సాధ్యమవుతుంది. మన దేశంలోని గ్రామీణ ప్రాంతాలను పరిశీలించినట్లైతే, ప్రధానంగా మహిళల ఆరోగ్యం స్థితిగతులు ఆందోళనకరంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంత యువకులు, స్త్రీలు ఎక్కువగా పోషకాహార లోపం వలన కలిగే రక్తహీనత (అనిమియా)తో బాధపడుతుండడం సర్వ సాధారణం.**

### రక్తహీనత అంటే ఏమిటి?

- జబ్బులు లేకపోడమే ఆరోగ్యం కాదు. మనం ఆరోగ్యం అంటే స్త్రీ శరీరం, మనస్సు, బుద్ధి, అన్నీ బాగుండడం, శక్తివంతంగా ఉండడం.

  నేడు గ్రామీణ యువతులలో కానీ, ప్రతీ చోటా భారత దేశ స్త్రీలు బాధ పడుతున్న సమస్య, రక్తహీనత.

### రక్త హీనత అంటే ఏమిటి? స్త్రీలలోనే ఎందుకు ఉంది, పురుషులలో ఎందుకులేదు?

- ప్రాణ వాయువును ($O_2$) ఊపిరితిత్తుల నుంచి శరీరంలోని వివిధ అవయవాలకు సరఫరా చేయటానికి రక్తం చాలా అవసరం .
- ఎర్ర రక్తకణాలు (ఆర్.బి.సి.) ప్రాణవాయువును సరఫరా చేస్తాయి. ఈ ఎర్ర రక్తకణాలలోని హిమోగ్లోబిన్‌లో ఇనుము, ప్రోటీన్లతో కూడిన అణువులు ఉంటాయి.
- Hb హిమోగ్లోబిన్ అనేది ఒక ప్రొటీన్. ఎర్ర రక్త కణాల్లో తగినంత Hb లేకపోతే, రక్తంలో ఆక్సీజన్ శాతం తగ్గి, అది రక్త హీనతకు దారి తీస్తుంది.
- ఆ హిమోగ్లోబిన్‌కు అవసరమైన ఇనుము మన ఆహారం ద్వారా లభ్యమవ్వాలి. మన శరీరానికి కొన్ని మిల్లీ గ్రాముల ఇనుము అవసరముంటుంది.
- రక్త పరీక్షలో (ఆర్.బి.సి. కౌంట్‌లో) హిమోగ్లోబిన్ మోతాదు తక్కువగా ఉన్నట్లైతే దానిని రక్తహీనత గా నిర్ధారిస్తారు.

**100 మి.లీ రక్తంలో ఉండాల్సిన మోతాదు:**

| | | |
|---|---|---|
| స్త్రీలు | - | 12-16 గ్రా. |
| పురుషులు | - | 14-17 గ్రా. |
| పిల్లలు | - | 11 గ్రా. |

- స్త్రీలు రక్తహీనతతో బాధపడడానికి ముఖ్య కారణం వారి నెలసరి ఋతుస్రావం.
- గర్భధారణ

  పురుషులకు పై సమస్యలు లేవు కనుక వారిలో రక్త హీనత అరుదు. కానీ పురుషులలోనూ మూత్రపిండాల సమస్య కానీ, మలేరియా కానీ, వచ్చినచో రక్తహీనతకు గురిఅవుతారు..

### రక్తహీనత కారణాలు :

- శరీరానికి తగినంత పరిమాణంలో ఇనుము లభించనప్పుడు రక్తహీనత కలుగును.
- ఎర్ర రక్తకణాలు సరిగా ఏర్పడకపోవటం వలన కూడా రక్తహీనత కలుగును. దీనినే మెగాలోబ్లాస్టిక్ అనేమియా అందురు.
- విటమిన్ బి (ఫోలిక్ ఆసిడ్), విటమిన్ - సి ప్రొటీన్ లోపం వలన కూడా రక్తహీనత కలుగును.

**స్త్రీలలో**

- *ఋతుస్రావం వలన*
- *కాపర్ 'టి' ఉపయోగం వలన వారికి నెలసరి సమయంలో అధిక రక్తస్రావం కలుగును.*
- *గర్భసంచి (యుటరస్)లో (ఫైబ్రాయిడ్స్) కందులు కలిగినచో అధిక రక్త స్రావం అవును.*
- *భారత దేశంలో 87.6% స్త్రీలు గర్భధారణ సమయంలో చివరి త్రైమాసికంలో అధిక రక్తహీనతకు లోనవుతున్నారు.*
- *ఇంకా మలేరియా, మూత్ర పిండాల సమస్యలు గానీ, కడుపులో నులి పురుగులు ఉన్నను రక్తహీనత కలుగును.*

### రక్త హీనతను మనం ఎలా గుర్తిస్తాం?

- రక్త పరీక్ష ద్వారా (ఆర్.బి.సి. కౌంట్) నిర్ధారించవచ్చు. అయితే దాని కంటే ముందు మన శరీరంలో ఈ క్రింది లక్షణాలు కన్పించినప్పుడు రక్తహీనత ఉన్నట్లు గుర్తించవచ్చు.



StanikapalanaAditionJune2011_36to39and61to64Color_FSr.pmd 31/05/2011, 02:53 PM

- నీరసంగా ఉండటం.
- కళ్ళు తిరగటం
- ఉన్నట్లుండి చీకట్లు కమ్మడం.
- త్వరగా అలసిపోవడం.
- ఏ పనిలోను శ్రద్ధ పెట్టలేకపోవడం.
- కీళ్ళ నొప్పులు ఉండడం.

**రక్త హీనతను సులభంగా ఎలా నివారించగలము**

గ్రామీణ స్త్రీలు అతి సులభంగా రక్తహీనతను తమంతట తామే నివారించుకోవచ్చు. అది ఎలా అనగా:

- ఇనుముతో చేసిన వంట పాత్రలలో వంట చేయడం ద్వారా చాలా చిన్న పరిమాణంలో మన శరీరానికి ఇనుప ధాతువు అందుతోంది. తోమిన ఇనుప పాత్రలకు తుప్పు పట్టకుండా శుభ్రంగా పొడి బట్టతో నీరు లేకుండా తుడిచి కాస్తంత వేరుశెనగ నూనె గానీ, ఏదైనా నూనెతో తుడిచి దానిని మరల వంట చేయడానికి ఉపయోగించాలి. దీని వలన మన శరీరానికి మందులు, టానిక్స్ లేకుండా మన శరీరానికి ఇనుము తగిన మోతాదు అందును.
- జింక్ కలిగిన మందులు లేదా పాలు, టీ, కాఫీ, ఇవన్నీ కూడా ఇనుమును గ్రహించకుండా నిరోధిస్తాయి. కావున రక్తహీనతతో బాధపడేవారు ఇవి తగ్గించాలి.

రక్తహీనత ప్రమాదకరమైన జబ్బు కాకున్నను అశ్రద్ధ వహించినచో ప్రాణాంతకం కాగలదు.

**ఈ క్రింది 100 గ్రా. తిండి పదార్థములలో - ఇనుము పరిమాణం**

| | | |
|---|---|---|
| రాగులు | - | 8 మి.గ్రా |
| మరమరాలు | - | 6.6 మి.గ్రా |
| పుట్నాలపప్పు | - | 9.5మి.గ్రా |
| ఉలవలు | - | 6.8 మి.గ్రా |
| శనగలు | - | 8.6 మి.గ్రా |
| సోయాబీన్స్ | - | 10.4 మి.గ్రా |
| బీట్ రూట్ ఆకులు | - | 16.2 మి.గ్రా |
| తమలపాకులు | - | 10.6 మి.గ్రా |
| గంగవాయిల కూర | - | 14.8 మి.గ్రా |
| ఎండు సుందకాయ | - | 22.2 మి.గ్రా |
| ఎండు కలువకాడలు | - | 60.6 మి.గ్రా |
| నల్ల నువ్వులు | - | 56.7 మి.గ్రా |
| జీలకర్ర | - | 11.7 మి.గ్రా |
| పుచ్చకాయ | - | 7.9 మి.గ్రా. |
| ఎండు ఖర్జూర | - | 7.3 మి.గ్రా |
| నూనె తీసిన ఎండు కొబ్బరి | - | 69.4 మి.గ్రా |

అన్ని మసాలా దినుసులలోను ఇనుము ఉండును. పై పదార్థములను రోజూ ఆహారంలో గ్రహించడం ద్వారా సులభంగా రక్తహీనత నుండి స్త్రీలు తమని తాము కాపాడుకోవచ్చు.

**రక్త హీనత చికిత్స :**

గ్రామీణ స్త్రీలు మందులు, టానిక్స్‌కు ధనం వెచ్చించాల్సిన అవసరం లేకుండా మన అందుబాటులోనే ఉండే మొక్కల ద్వారా ఆయుర్వేద విజ్ఞానం ప్రకారం సులభంగా రక్తమును వృద్ధి పొందగలరు.

**1) పసుపు**

- పసుపులో ఇనుము అధిక మోతాదులో లభ్యమౌతుంది.
- 1 టీ స్పూన్ పచ్చి పసుపు రసమును తేనెతో కలిపి ప్రతీ రోజూ పుచ్చుకొనిన ఫలితం ఉంటుంది.

**2) ఉసిరి**

ఉసిరికాయలు తినడం వలన రక్తవృద్ధి అగును. ఇందులో విటమిన్ - సి ఉంటుంది. (లేదా) ఎండు ఉసిరి కాయలను కషాయం ద్వారా సేవించినను ఫలితం ఉంటుంది

**3) ధనియాలు (Corianderm sativum - Scientific name)**

స్త్రీలు - 60% వరకు అధిక రక్త స్రావం (ఋతుసమయంలో) వలన రక్త హీనతకు లోనవుతున్నారు. అలాంటి స్త్రీలు, 6 గ్రాముల ధనియాల గింజలను అర లీటరు నీళ్ళలో, మరిగించాలి. ఆ నీరు సగం ఇగిరిపోయే వరకు మరిగించి, ఆ నీరు గోరువెచ్చగా ఉన్నప్పుడే కాస్తంత పంచదార కలిపి సేవించినచో 3-4 రోజులలో ఫలితం కనిపించును.

**4) మెంతికూర**

మెంతికూర ఆకులు రక్తం తయారీలో తోడ్పడును.

**5) బూడిద గుమ్మడికాయ**

బూడిద గుమ్మడి గుజ్జును నీళ్ళలో మరిగించి, దానికి చక్కెర పాకం కలిపి తయారుచేసిన పదార్థం తిన్నచో రక్తహీనత తగ్గును మరియు శరీరంలో అధిక ఉష్టం తగ్గిపోవును, గుండెను బలపరుచును.

**6) వెల్లుల్లి**

వెల్లుల్లి మన శరీరంలో గల టాక్సిన్‌లను తొలగించి, రక్తమును పునరుత్తేజం చేసి రక్త ప్రసరణకు తోడ్పడును.

**7)** నల్లబెల్లం మరియు వేరుశనగతో చేసిన "చిక్కి" ప్రతిరోజు 10-20 గ్రా. తినటం వలన మంచి ఫలితం ఉంటుంది.

**8)** మునగ ఆకు పప్పు తినటం వలన కూడా మంచి ఫలితం ఉంటుంది.

**డా॥ మడిపెల్లి నాగమణి,** B.A., M.S.,



StanikapalanaAditionJune2011_36to39and61to64Color_FSr.pmd 31/05/2011, 02:53 PM

**రా**త్రి పొద్దుపోయింది. సందడి తగ్గి పరిసరాలన్నీ నిశ్శబ్దమయ్యాయి. చుట్టూ ముసురుకుంటున్న చీకట్ల మధ్య నిండుగా సింధూరం పూసివున్న ప్రసన్నాంజనేయస్వామి నిరాకారమైన నిలువైతు శిలలా వున్నాడు. గోదావరి తీరంలో రావిచెట్టు క్రిందవున్న పెద్ద బండ మీద వుంది స్వామి విగ్రహం. క్రిందంతా దుమ్ము, ధూళి ఒత్తుగా రాలిపడిన ఎండుటాకులు.

స్వామి పాదాల దగ్గరవున్న చిన్న కుందిలో దీపం సన్నగా వెలుగుతోంది గాలికి కొండెక్కకుండా. పైన చిల్లుల మూత కూడా వుంది. అయినా గాలికి రెపరెపలాడుతూ మినుకు మినుకుమంటోంది వత్తి. వాడిపోయిన రెండు ఎర్రమందారపూలు స్వామి వారి పాదాల మీద పడి వున్నాయి. ఒక ఇత్తడి పళ్ళెంలో తీర్థం పాత్ర, ఉద్ధరిణి, అక్షంతలు, సింధూరపొడి, పాదుకలు వున్నాయి. అక్కడ్నుంచి కాస్త దూరాన ఎదురుగా నిదానంగా ప్రవహిస్తున్న గోదావరి మీంచి గాలి చల్లగా వీస్తోంది.



# రహదారి దేవుడు

## యర్రమెల్లి విజయలక్ష్మి

పూర్వం... అంటే స్వామివారి విగ్రహం ఇక్కడ ప్రతిష్ట చెయ్యకముందు ఈ రేవులో ఎక్కువ ప్రమాదాలు జరిగేవి. ఏటా పిల్లలో, పెద్దలో నదిలోకి దిగినవారు ఒరవడికి కొందరు కొట్టుకుపోయేవారు.

మారుతి తాత గారీ విగ్రహాన్ని చేయించి గోదావరికి అభిముఖంగా రేవుగట్టున నిలిపాడు. అదేం మహత్యమో మరి స్వామి వచ్చాక ప్రమాదాలు తగ్గాయంటారు ఆ తరువాత ఎవరూ నీళ్ళలో కొట్టుకపోవటం లేదు. ప్రమాదాలను నివారించే శక్తి ఆ అభయాంజనేయుడి కుందని అందరూ నమ్ముతారు.

మారుతి తాతగారీ మర్మం గ్రహించి ప్రజాక్షేమం కోసం స్వంత ఖర్చుతో స్వామినిక్కడ రక్షణగా నిలబెట్టాడు. అప్పట్నుంచీ స్వామికో మందిరం కట్టించాలని తపనపడ్డాడాయన కానీ కాలం కలిసి రాలేదు. ముందు ఎండ, వానకు అడ్డంగా తాటాకు పందిరింటి కప్పు వేయించాడు. 15 అడుగుల భారీ విగ్రహం... గుడి నిర్మించాలంటే దశరథ రాములయ్యగారి శక్తి చాలలేదు. ఆయన ఆంజనేయ స్వామి ఉపాసకులు. స్వామివారి పూజాదికాలన్నీ ఆయనే చేసేవాడు.

మారుతి పుట్టిన దగ్గర్నించీ పెద్ద మారుతిని చూట్టానికి అలవాటు పడ్డాడు. తాతగారి వెంటే గుడి దగ్గర గడిపేవాడు. అందువల్ల శ్రవణవతే స్తోత్రాలు, పూజా విధానం పట్టు పడింది. తాతగారెప్పుడన్నా పనిపడి పొరుగూరి వెళ్ళి ఆ సమయానికి రాలేకపోతే గోదాట్లో స్నానం చేసి తనే వచ్చీరాని పూజ చేసేసి నైవేద్యం పెట్టి గంట వాయించి హారతిచ్చేసేవాడు మారుతి.

అతని శ్రద్ధ, భక్తి చూసి తాతగారు దగ్గరుండి అన్నీ నేర్పించారు. అప్పుడేమో కాని... ఇప్పుడు మాత్రం అడపాదడపా ఎవరో ఒకరిద్దరు స్నానానికో, సరదాకో తీరానికి వచ్చిన వాళ్ళు తప్ప వేరెవరూ ప్రత్యేకం అటుచూడరు. అయితే కార్తీకమాసంలోనూ, పర్వదినాలప్పుడు మారుతికి చేతినిండా పని వుంటుంది. కార్తీక మాసమంతా ఉదయానే నదీస్నానం చేసి భక్తులు తీరంలో వున్న శివాలయంలో అభిషేకాలు అర్చనలు చేసకుంటారు. ఇక్కడ సోమేశ్వరుడు స్వయంభు, భక్తజన సులభుడు భోళాశంకరుడు ఆయన మహాత్మ్యం ఊళ్ళో కథలు కథలుగా చెప్తుంటారు.

శివరాత్రికి అక్కడ పెద్ద తిరునాలే జరుగుతుంది. శివుడ్ని నమ్ముకుంటే ముక్తి మోక్షాలేనట! విష్ణుమూర్తిని నమ్ముకుంటే సకల సంపదలూనట. ఇక ఈ రహదారి దేవుడ్ని నమ్ముకున్న వారికి భయమనేదే వుండదట! రోజూ మూడు పూటలా భక్తి పూర్వకంగా హనుమాన్ చాలీసా చదువుకునే వాళ్ల బరువు బాధ్యతలన్నీ హనుమే చూసుకుంటాడట.

అలా ఆయా సందర్భాలలో అక్కడికి వచ్చిన వాళ్ళు, స్వర్ణశైలంలా ఆకాశమంత ఎత్తున చేతిలో గదపుచ్చుకుని మహావస్తాదులా నిలబడివున్న ఆంజనేయున్ని కూడా దర్శించుకుంటారు.

ఏ పుట్టలో ఏ పాముందో ఏ విగ్రహంలో ఏ మహత్తుందోనని దూరదృష్టితో ఆలోచించి ఒక కొబ్బరికాయో, రెండు అరటిపళ్ళో నివేదన సమర్పించుకుని ఒక అర్ధరూపాయి బిళ్ళ పాదుకలు పెట్టాక పళ్ళెంలో పడేసి ఆయనకో నమస్కారం పడేసి వెళ్ళిపోతారు. అర్ధరూపాయికి మించి సాధారణంగా దక్షిణ ఇవ్వరు. ఆకుపూజో, అష్టోత్తరమో చేయించుకుంటే రెండ్రుపాయలిస్తారు.

**ద్వితీయ బహుమతి పొందిన గ్రామీణ కథ**



Sthanka_Junecolo.indd 25 31/05/11 2:24 PM

ఎవరొచ్చినా, ఎవరు రాకపోయినా మారుతి మాత్రం ప్రతిరోజూ తెల్లారకుండానే నదిలో స్నానం చేసి శుచిగా సర్ది, దీపం వెలిగించి ఒక అగరుపుల్ల తిప్పి- రెండు పటిక బెల్లం పలుకులు నివేదించి హారతిస్తాడు.

భక్తులెవరైనా వచ్చి ఏ పండో ఫలమో సమర్పిస్తే తప్ప ఉదయం, సాయంత్రం స్వామివారికి చిటికెడు పటిక బెల్లం పలుకులే. ఆనక ఆ పెద్ద పెద్ద పాదాల మీద చెయ్యేసి కూర్చొని విధిగా రెండు పూటలా అష్టోత్తర శతకనామావళి- హనుమాన్ చాలీసా, రామరక్షస్తోత్రం, సుందరాకాండ వరసగా వర్లిస్తాడు.

ఇక సంవత్సరమంతా జూన్ మొదటి వారంలో వచ్చే హనుమజ్జయంతిని తలుచుకుంటూ - ఎదురుచూస్తూ వుంటాడు. ఆ రోజున గోదావరి నదీ తీరమంతా భక్తులతో సందడించిపోతుంది. వారం రోజుల ముందు నుంచే ఉత్సవానికి ఏర్పాట్లు చేస్తారు.

ఊళ్ళో వాళ్ళు, చిన్న పిల్లలు రేకు డబ్బాలకు ఆంజనేయ స్వామి బొమ్మ కాగితాలాంటివి, పైన బెల్ పెట్టి హుండీలు తయారు చేసి చిల్లర డబ్బులు గలగల మోగించుకుంటూ ఊరి బస్టాండులో తిరుగుతుంటారు.

'ఆంజనేయుల పుట్టింరోజు... చందా వెయ్యండి' అంటూ ప్రయాణీకుల వెంటపడుతుంటారు. ముందు నిర్లిప్తంగా ఊరుకున్నా సమయమొచ్చేసరికి కామందులందరూ కూడబలుక్కుని ఏర్పాట్లన్నీ చేయించేస్తారు. స్వామికి జరగవలసిన లాంఛనాలన్నీ చక్కగా అమరి పోతాయి.

మారుతి హడావుడి, ఆనందం ఇంతా అంతా కాదు. తెల్లవారుఝాము మూడింటికే లేచి తను తయారై - స్వామిని లేపేసి పుట్టినరోజు పెళ్ళికొడుకుని ముస్తాబు చేస్తాడు. తెల్లవారగానే ప్రథమ దర్శనం కోసం వచ్చే ఊరి పెద్దలంతా రెప్పవెయ్యటం మర్చిపోయి భక్తి పారవశ్యంతో అట్టే చూస్తూ నిలబడిపోతారు. అందరూ చూపులతో మారుతిని ప్రశంసిస్తారు.

ఆరోజు సీతయ్య గారి మనవడు రామచంద్రం మారుతికి సహాయకుడిగా నియమించబడతాడు. వాడికి మారుతిలా స్వామి సేవ చేసెయ్యాలని గొప్ప కోరిక. కానీ ఎప్పుడూ ఆ అవకాశం రాదు. మాములు రోజుల్లో మారుతికే చేతినిండా పని వుండదు. అదీ కాక స్వామీ సేవలన్నీ తనే స్వయంగా చెయ్యాలనుకుంటాడు మారుతి. ఎవరూ తనలా చెయ్యలేరని భయం. అయితే ఈ సందర్భం వేరు. ప్రత్యేక దర్శనమనీ, సాధారణ దర్శనమనీ రెండు క్యూలు ఏర్పాటు చేస్తారు. చుట్టూ ప్రక్కల పల్లెల్లోని జనాలందరూ వస్తారు. ఆకు పూజలనీ, అష్టోత్తరాలనీ తీసుకుంటూ వుంటారు ఒక్కరి వల్ల కాదు ఎంత పెద్దవాడైనా సరే-అనుభవజ్ఞుడైనా సరే ఆ వత్తిడి తట్టుకోవాలంటే ఇంకోరి సాయం అవసరం. అంతకు మునుపు అయిపుండడు కాని. జయంతి వస్తోందంటే... 'అన్న... అన్న...' అంటూ మారుతి వెంటబడతాడు రామచంద్రం.

మళ్ళీ జయంతి రావాలంటే ఆర్నెళ్ళు. ఆ ఒక్కరోజు వైభవం, ఆనందం గుండెల నిండా దాచుకుని మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకుంటూ గడుపుతాడు. అందుకే ఏడాది పొడుగునా ఒక్కో రోజు ఒక్కో దేవుడికి కేటాయిస్తారు. శివరాత్రని, వినాయక చవితిని, దిపావళి అనీ, దసరా అనీ తొమ్మిదేసి రోజులు జరుపుతారు. హనుమజ్జయంతి కూడ్బా ఆట్లాదేవీ నవరాత్రుల్లా జరపవచ్చు కదా అనుకుంటాడు.

చుట్టూ చీకటి మరీ చిక్కపడింది. అక్కడోటి అక్కడోటి దీపాలు వెలుగుతున్న ప్రవాహం స్పష్టంగా కనపడటం లేదు. శీతపొద్దు ఆరింటికే అర్ధరాత్రిలా దిగులోడుతుంది. ఈ రోజు మారుతి మనసు మనసులోలేదు. సాయంత్రం ఎప్పుడనగా ప్రారంభించాడో సుందరకాండ ఏదో అడ్డుకున్నట్టు వుండుండి నట్లు కొడుతూ ఆగిపోతుంది. ఏవేవో ఆలోచనలు మనసులో దూరి గందరగోళం రేకెత్తిస్తున్నాయి.

"అన్న... అన్న! శివన్న వచ్చాడు నిన్నింటికి రమ్మంటున్నారు" రానే వచ్చాడు రామచంద్రం. వాడైతే పట్నం నుంచి శివన్నవచ్చాడన్న వార్త సంబరంగానే చెప్పాడు కానీ... 'వచ్చాడు.. వీడు నన్ను వదలటం లేదు వీడికి తోడు అమ్మ, నాన్నమ్మ కూడాను. ఆంజనేయా, చూస్తున్నావుగా ... నన్నెల్లాగైనా నీ దగ్గర్నించి దూరం చెయ్యాలనే ఆ శివన్న పట్టుదల. ఏం చేస్తావో మరి! నీదే భారం... నువ్వు కూడా నేను నీకక్కరలేదనుకుంటే నీ ఇష్టం. నా ఇష్టం చెల్లుతుందా...స్వామి' పాదాలు కళ్ళ కద్దుకుని గట్టు దిగి క్రిందకు వచ్చాడు. తీరం మీంచి ఒడ్డు బయటకి వచ్చి రహదారి దాటి క్రింద పల్లంలోకి నడిచాడు.

ఊరంతా అక్కడే వుంది. పదినిమిషాలు నడచి ఇంటిముందు కొచ్చేశాడు. నలుగైదు తరాలు వెళ్ళి మారిన తాతల నాటి పెంకుటిలోగిలి. పెద్దదే! మూడు వాటాలు. ఒకప్పుడు వైభవంగానే వుండి వుండవచ్చు. వీలు దొరికితే చాలు ఆ గొప్పలన్నీ నానమ్మ కథలు కథలుగా చెప్తుంది. ఆవిడ గతంలోనే బతుకుతుంది. ఆ జ్ఞాపకాలతోనే ఈ గడ్డురోజుల్ని నిర్లిప్తంగా గడిపేస్తోంది.

కాలం పనిగట్టుకు కూలగొట్టినట్టుంది శల్యావశిష్టంగా, నామ మాత్రంగా మిగిలిన చూరు క్రింద కాలక్షేపం చేస్తున్నారు ముగ్గురూ. అటు ఇటు గదులు మట్టిమేటలయ్యాయి. వుండటానికి గది వుంచుకుని 4వ స్థలమంతా అమ్మేసి అవసరం గడుపుకోవచ్చనుకుంటే... కొనేవాళ్ళే లేరు. అందరూ అమ్ముకుని పట్నం వెళ్ళిపోవాలనుకునేవాళ్ళే. చాలా కుటుంబాలు ఇప్పటికే ఇల్లు వాకిలీ వదిలేసి పిల్లల చదువులకనీ -ఉద్యోగాలనీ పట్నం వలసకు వెళ్ళిపోయారు.

తన కోసమే ఎదురు చూస్తున్నట్టు వరండాలో తాతగారి నరసరావుపేట మడత కుర్చీలో కూర్చుని వున్నాడు శివన్న.

"వచ్చావా? ఇంతసేపేం చేస్తున్నావురా! చీకట్లో అక్కడ" అన్నాడు పెద్దరికంగా పెద్దనాన్న గారబ్బాయి.

వాళ్ళంత ఎప్పుడో పల్లె వదిలేశారు. పట్నంలో మంచి ఉద్యోగాల్లో వున్నారు. నాన్నమ్మ గడపలో కూర్చుని వుంది. అమ్మ లోపల వంట చేస్తోంది. మారుతి బావి దగ్గర కాళ్ళు చేతులు కడుక్కువచ్చాడు.

"నీ కోసమే వచ్చాను. రేపే మన ప్రయాణం. మీ అమ్మ కూడా సరేనంటోంది".

మారుతికి అతనితో మాట్లాడాలనిపించటంలేదు. తప్పక అన్నాడు.. "మరి నాన్నమ్మని?"

ఇంట్లో అమ్మ-నాన్నమ్మ. తనే మగదిక్కు! నాయినమ్మ పాపం... ప్రాణానికి సుఖం లేదు అమ్మ మాత్రం పరిస్థితుల వల్ల ఆవిడా



Sthanka_BW June.indd 26 30/05/11 5:41 PM

కృంగిపోయి వుంది. ఈ మధ్య శివ తరుచూ ఊళ్ళో ప్రత్యక్షమై మారుతిని తనతో పట్నం పంపిస్తే వాళ్ళ ఆర్థిక స్థితి మెరుగు పడుతుందని, అతని భవిష్యత్ బాగుంటుందని ఊరిస్తున్నాడు.

ఏ విధమైన అభివృద్ధి అవకాశాలు లేని ఈ పల్లెలో అతని జీవితం వ్యర్థమైపోతోందని, వయస్సు మీరి పోయాక ఎక్కడకి వెళ్ళినా ప్రయోజనం వుండదని భయపెడుతున్నాడు. ఇక్కడ ప్రాకృతిక సంపద, వనరులు, పంటలూ అన్నీ ఉన్నాయి. కాని పిల్లల భవిష్యత్ బాగుండాలని ఎన్నో కుటుంబాలు ఊరు వదిలి పట్నాలకు తరలిపోయారు. తమకే అవకాశం, ఆలోచనా లేకపోబట్టే వున్న దానితో సరి పెట్టుకుంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు.




మారుతి చిన్నవాడు. వాడి గురించి ఇప్పుడైనా ఆలోచించడు కదా. శివ చెప్తున్నట్లు 'గోదావరి గట్టున ఆ రహదారి దేవుడు పూజలు చేసుకుంటూ ఎంతకాలం గడుపుతాడు. పెళ్ళి చేసుకుని పిల్లా పాపలతో సుఖంగా గడప వలసినవాడు శివ చెప్పినట్లు వయసు దాటిపోతే అసలే అవకాశాలు రావు. పెద్దబావగారబ్బాయి శివ చిన్నప్పుడు ఉమ్మడి కుటుంబం కనుక కలసి ఇక్కడే వున్నారు. ఆ అభిమానం కొద్ది వీడికో దారి చూపాలని తాపత్రయ పడుతున్నాడు.

శివే కాదు ఊళ్ళో వాళ్ళ పిల్లలందరూ పట్నానికి పోయి మంచి చదువులు చదివి పెద్ద ఉద్యోగాలలో స్థిరపడ్డారు. వ్యాపారాలు చేసుకుంటున్నారు కొందరు. శివ ఏదో పురుగుల మందుల కంపెనీలో పనిచేస్తున్నాడు. 40 వేలు జీతం. ఆ పని మీద ఊళ్ళన్నీ తిరుగుతుంటాడు ఆర్డరు బుక్ చేస్తూ. 'ఇప్పటికైనా మించి పోయింది మా కంపెనీలోనే వేయిస్తాను. వచ్చేయి' అంటాడు.

మారుతి "ఎలా అన్న ... ఇది నా స్వగ్రామం.. అమ్మ, నాన్నమ్మ వున్నారు. వాళ్ళని వదలి ఎలా రాగలను? ఇక్కడ మాకు బాగానే వుంది".

స్వామిని విడిచి తనుండగలడా అయినా. అతని మనసు పట్టేస్తాడు శివ. 'హనుమాన్ చాలీసా రామరక్షస్తోత్రం వల్లేస్తే తీరిపోయేవా కష్టాలు! అసమర్థులు, చాతకానివాళ్ళు, బద్ధకస్తులు, ముసలాళ్ళు చెప్ప వలసిన మాటలు... ఈ వయస్సులో ఈ పల్లెటూర్లో ఆ కోతి దేవుడి పూజ చేసుకుంటూ ఎట్లా వుంటున్నావురా".

శివ వాడిన మాటకి మారుతి బాధపడ్డాడు. "తప్పు అలా అనకు. అయన శక్తి నీకు తెలియదు," అన్నాడు. తనకన్నా పెద్దవాడు, అన్న వరస వాడు కనుక బతికి పోయాడు శివ అప్పటికి. తను లేకపోతే వాళ్ళ ఆలనా, పాలనా చూసే దెవరు? ఊళ్ళో అంతా తమ వాళ్ళే. అందరి సహకారం ఒకరికొకరికి ఎప్పుడూ వుంటుంది. అయినా తను వెళ్ళిపోతే ఎలా అని ఆశ ఒక పక్క. ఏమో పట్నం వెడితే పరిస్థితి మెరుగవుతుందేమోనన్న ఆశ మరో వైపు. అమ్మ మౌనంగా వుందని తెలుసు. ఇప్పుడు తనకిక్కడ రెండు బంధాలు కదలనీకుండా కట్టి పడేశాయి. అవి కట్టి పడేయటంలేదు. తన కాళ్ళు -చేతులు తనే ఆ భావాలకి కట్టుబడిపోయాడు. ఒకటి అమ్మ, నాన్నమ్మ బంధం. రెండోది-నిజానికి మారుతికి ఇదే ప్రధానంగా ముఖ్యంగా వుంటుంది.

హనుమబంధం... తనలాటి వాళ్ళు ఆయనకు కోట్ల మంది వుండవచ్చు తనకు మాత్రం ఆయన ఒక్కడే ప్రాణం!

విని, విని నానమ్మ నోరు విప్పింది, 'అబ్బాయి శివయ్యా నీ ఆలోచన బాగానే వుంది. కానీ, ఇప్పుడు వీడ్ని నీతో ఎలా పంపగలం చెప్పు. పోయే వయస్సే కాని వచ్చేది కాదు. ఇద్దరం ఆడవాళ్ళం. వీడే దిక్కు. మాకు దూరభారం. నీతో వాడ్ని పంపితే రేపు ఎటుపోయి ఎటొచ్చినా మా పరిస్థితి ఏమిటో చెప్పు. మీ పిన్ని ఏదో ఉబలాటపడుతోంది కానీ, దూరపుకొండలు నునుపని! ఇక్కడ మాకేం కొదవ నాయనా! తలదాచుకోవడానికి ఇంత గూడుంది. తిండికి లోటులేదు. వున్నంతలో సుఖంగానే వున్నాం. కష్టానికి, సుఖానికి ఊరంతా పక్కన నిలబడుతుంది. ఎక్కడికో వెడితే ఏదో వచ్చిపడుతుందనే ఆరాటం కంటే, వున్న దాంతో తృప్తిగా గడపటం ముఖ్యం. అది లేకపోతే ఎన్ని కోట్లు సంపాదించినా రాదురా తండ్రీ! ఇంకా కొదవే. దేవుడు అన్ని బంధాలు తెంచేసి - మా ముగ్గుర్ని మిగిల్చాడు - ఒకరి కోసం ఒకర్ని! వాడికీ ఈ ఊరంటే ప్రాణం... స్వర్గం కూడా తక్కువే చెప్పాలంటే. ఒదిలెయ్ నాయనా! గడవక పోవటమంటూ వుండదు నారు పోసినవాడు నీరు పొయ్యడూ . . ."

"ఏరా మారుతీ అంతేనా... బాగా ఆలోచించు... వదులుకుంటే ఈ అవకాశం మళ్ళీరాదు సుమీ. ఏం పిన్నీ... నువ్వన్నా చెప్పు నాన్నమ్మకి..." శివన్న మరోసారి హెచ్చరించాడు.

"మంచి మార్గం చూపిస్తున్నావు... నిన్ను నొప్పించలేక కాదనలేక పోతున్నాం.. శివయ్య ఎవరి కెంత ప్రాప్తమో అంతే... వున్న వాస్తవం చెప్పకోవాలి. వాడు ఈ ఊరిని, హనుమాన్‌ని వీడి వుండలేడయ్యా" మృదువుగా చెప్పేసింది మారుతి తల్లి.

తేలిక పడిన హృదయంతో గోడకు వ్రేలాడుతున్న ఆంజనేయస్వామి పటం వంక చూసి మనసులోనే నమస్కరించుకున్నాడు. ఎల్లాగన్నా తన్ని శివన్నతో పంపించాలనుకున్న అమ్మ ఎలా అందీ మాటలు.. అబ్బుర పడుతున్న మారుతిని చూస్తూ ప్రసన్నంగా నవ్వుతున్నాడు స్వామి.

☆



Sthanka_BW June.indd 27 30/05/11 5:41 PM



# పేదల సాధికారతకు సాధనం

**ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్**

**‘అవగాహన లేకపోవడమే అన్ని భయాలకూ మూలం. అవగాహన లేకపోవడానికి తగినంత విషయ పరిజ్ఞానం లేకపోవడమే కారణం. విషయ పరిజ్ఞానం లేకపోవడానికి... మన ఆలోచనలను, ఆవేదనలను స్వేచ్ఛగా వ్యక్తం చేయకపోవడమే కారణం. మనం కలిసి కట్టుగా ఉండి ఇతరుతో స్వేచ్ఛగా మన అభిప్రాయాలు చెప్పడం లేదు. అంటే మనలోని వేర్పాటు ధోరణులే అన్ని అనర్థాలకు మూలం” అంటాడు అమెరికాలో నల్ల జాతీయుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ప్రాణాలు అర్పించిన మార్టిన్ లూథర్‌కింగ్.**

### ప్రారంభం

పేదరికం నుంచి పేద ప్రజలకు విముక్తి కలిగించడం ఆర్థిక వ్యవస్థ ప్రధాన లక్ష్యం. ఆర్థిక వ్యవస్థలో ఇందుకోసం చేపట్టే పథకాలు దుబారాకు చోటు లేకుండా, పరస్పర సహకారంతో అమలు చేయడంతో పాటు ప్రజలను భాగస్వాములను చేయడం అవసరం. అందుకు అత్యుత్తమమైన మార్గం వికేంద్రీకరణ.

ఈ అన్ని సద్గుణాలతో కూడిన ప్రయోగమే ఖాదీ (గ్రామోద్యోగ్) గ్రామీణ పరిశ్రమల కమిషన్ కార్యాచరణ పథకం.

సాధారణంగా ప్రభుత్వం చేపట్టే పథకాల ప్రయోజనాలు తమకు ‘ఇప్పుడు - ఇక్కడే’ లభించాలన్న (తక్షణ ప్రయోజనాలు) ఆకాంక్ష ప్రజలలో విస్తృతంగా ఉంటుంది.

1956లో రూపుదిద్దుకున్న 1987లో సవరించిన చట్టం (12) ప్రకారం ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ (Khadi, Village Industries Commission) ఏర్పడింది. ఇది 1957 నుంచే పల్లె ప్రజల జీవన గమనంపై ప్రభావం చూపిస్తోంది.

అతి తక్కువ పెట్టుబడితో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించడం దీని లక్ష్యం. స్థానికంగా లభించే వనరులతో, స్థానిక నిరక్షరాస్యులైన గ్రామీణ యువతకు, నిపుణులైన కుల వృత్తుల వారికి ఏడాది పొడవునా ఉపాధి చూపించడానికి ఈ కమిషన్ కృషి చేస్తోంది.

స్వాతంత్ర్యం రాకముందు మహాత్మాగాంధీ ప్రేరణతో ప్రజల స్వయం కృషి ఫలితంగా అక్కడక్కడ నెలకొల్పిన గ్రామీణ కుటీర పరిశ్రమలు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశ వ్యాప్తంగా ఉన్న స్థానిక కుల వృత్తుల వారికి తగిన శిక్షణ ఇచ్చి నికరమైన ఆదాయాన్ని సంపాదించే విధంగా, పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందే విధంగా అవకాశాలను అందిస్తూ వచ్చింది ఖాదీ కుటీర పరిశ్రమల కమిషన్ (కెవీఐసీ).

### ఎవరు అర్హులు?

18 ఏళ్ళు దాటిన స్త్రీ పురుషులందరూ వారంతా గ్రామీణ ప్రాంతాలలో నివసించే వారై ఉండాలి. స్వయంగా పరిశ్రమను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చే వారికి కేంద్ర వ్యవసాయ శాఖ అధీనంలో పనిచేసే కెవీఐసీ అన్ని విధాలా సహాయ సహకారాలను, శిక్షణ అవకాశాలను అందచేస్తుంది.

### కెవీఐసీ లక్ష్యాలు

సామాజికంగా - అందరికీ ఉపాధి కల్పన.

ఉత్పాదకత పరంగా - క్రయ విక్రయాలు లక్ష్యంగా, వినియోగ

దారుడికి నాణ్యమైన వస్తువులు, ఉత్పత్తిదారుకు గౌరవ ప్రదమైన ఆదాయం.

పల్లెసీమల్లో ప్రజల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడడం.

### కెవిఐసీ పరిధిలోకి వచ్చే పరిశ్రమలు

- పత్తి, పట్టు, నేసిన దారాలతో చేతి మగ్గాల సాయంతో వస్త్రాలను నేయడం.
- చేతి మగ్గాలను నడపడానికి విద్యుత్‌ను వినియోగించినా, వినియోగించకపోయినా తోడ్పాటు.
- గ్రామీణ ప్రాంతాలలో కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారికి ప్రోత్సాహం.
- తలసరి కార్మికుడి పెట్టుబడి లక్ష రూపాయలలోపు (యంత్రాలు భూ వసతి, భవన సదుపాయాలకు కలిపి) ఉన్న పరిశ్రమల ఏర్పాటుకు చేయూత.

### ఇవి కుటీర పరిశ్రమల పరిధిలోకి రావు

- మాంసం తయారీ, విక్రయం
- మాదక ద్రవ్యాల ఉత్పత్తి, విక్రయం.
- పంటలు, తోటల సాగు, పశుపోషణ, పందుల పెంపకం, కోళ్ళ పెంపకం, ఖాదీ, పోలి వస్త్రాల నేత.
- పర్యావరణ కాలుష్యానికి కారణమైన పరిశ్రమలు.
- ప్లాస్టిక్ రీసైక్లింగ్, 20 మైక్రాన్లన్నా తక్కువ మందం ఉన్న పాలిథీన్ కవర్ల తయారీ.
- ప్లాష్మిన్ ద్వారా ప్రాసెసింగ్. అటువంటి చేనేత ఉత్పత్తులు
- గ్రామీణ రవాణా సదుపాయాలు

ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పడేందుకు కొన్ని ప్రత్యేక విభాగాలున్నాయి.

### గ్రామీణ పరిశ్రమల సేవా కేంద్రం (RISC)
(Rural Industry Service Centre)

**ఖాదీ, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడానికి కొన్ని అనుబంధ విభాగాలు ఏర్పాటయ్యాయి. అవి.**

- గ్రామీణ పరిశ్రమల సేవా కేంద్రం (RISC)
- వస్తు అభివృద్ధి, నమూనా నిర్ధారణ, ప్యాకేజింగ్
- అంతర్గత వస్తు నాణ్యాత పరిశీలన విభాగం (ఇన్‌హౌస్ టెస్ట్ లాబరేటరీ) శాస్త్ర సాంకేతిక శాఖ పరిధిలో
- పరిశోధన, అభివృద్ధి (R&D)
- ఐఎస్ఓ 9001-2000
- ప్రధాని ఉపాధి కల్పన కార్యక్రమం.

### గ్రామీణ పరిశ్రమల సేవా కేంద్రం

సమష్టిగా మౌలిక సదుపాయాల సమీకరణకు తోడ్పడుతుంది. స్థానిక పారిశ్రామిక విభాగాలకు ఉత్పాదక స్థోమతను పెంపొందించు కోవడంలోను, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంలోను, మార్కెట్ వసతులను సమకూర్చు కోవడంలోను సహకరిస్తుంది.

### ఇందుకు సహకరించే ఇతర వ్యవస్థలు

- జాతీయ స్థాయి భారీ, కుటీర పరిశ్రమల సమాఖ్యలు
- కెవీఐసీ, కెవీఐబిలు వాటి అనుబంధ సంస్థలు
- గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్న స్వచ్ఛంద సంస్థలు (నిషేధించిన కార్యకలాపాల్లో మినహాయించి) ఈ సంస్థలు పల్లె ప్రాంతాల్లో కనీసం మూడు ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించి ఉండాలి.
- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, కాపార్ట్ (CAPART), నాబార్డ్ ఐక్యరాజ్య సమితి సంస్థలు.

### ఏ ప్రాజెక్టుకు ఎంత సాయం?

ఎ. భవన వసతి/మౌలిక వసతులు. ప్రాజెక్టు వ్యయంతో గరిష్ఠంగా 15 శాతం

బి. యంత్ర పరికరాలు, నాణ్యత నిర్ధారణ సౌకర్యాలు, ప్యాకేజింగ్ ప్రాజెక్టు వ్యయంలో కనీసం 50 శాతం

సి. ముడిపదార్థాలు, కొత్త డిజైన్‌ల రూపకల్పన, వస్త్రోత్పత్తిలో వికేంద్రీకరణ ప్రాజెక్టు వ్యయంలో గరిష్ఠంగా 25 శాతం.

డి. నైపుణ్యం పెంపు, శిక్షణ బాధ్యతలు, ఉత్పాదనల జాబితా ఖరారు. ప్రాజెక్టు వ్యయంలో గరిష్ఠంగా 10 శాతం.

### ఆర్ఐఎస్‌సి పరిధిలోకి వచ్చే ఖాదీ, కుటీర పరిశ్రమలు

- ఖాదీ, పోలి వస్త్ర రూపాలతో వస్త్రాలను నేయకముందు వాటికి అదనపు హంగులు సమకూర్చే సదుపాయాలు
- ఔషధ ఉత్పత్తులు, సౌందర్య సాధనాలు, ఔషధాలు
- వంట నూనెలు
- డిటెర్జంట్‌లు, సబ్బులు
- తేనె.
- చేతితో చేసిన కాగితం
- ఆహార పదార్థాల ప్రాసెసింగ్
- బయో ఫెర్టిలైజర్స్ / బయో పెస్టిసైడ్స్ / బయో మాన్యువల్
- కుండల తయారీ
- తోలు పరిశ్రమ
- కలప ఉత్పత్తులు
- నిషేధించినవి మినహా ఇతర గ్రామీణ పరిశ్రమలు

### ఆర్థిక వ్యయ పరిమితులు

- రూ. 5 లక్షల వరకు
- రూ. 25 లక్షల వరకు

### ఎవరి వాటా ఎంత?

- ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ - 75 శాతం
- సొంత వనరులు / బ్యాంకులు, ఇతర ఆర్థిక రుణ రూపంలో సంస్థల నుంచి 25 శాతం

వస్తు అభివృద్ధి, నమూనా నిర్ధారణ ప్యాకేజింగ్ విభాగం

## దీని పరిధిలోని కార్యకలాపాలు

- యార్క్, దారం వంటి ముడి పదార్థాల వాడకంలో కొత్త పద్ధతులు రూపొందించడం, అందుకు అవసరమైన ప్రయోగాలను చేపట్టడం, డైయింగ్ / ప్రింటింగ్‌లో ఆధునిక ప్రక్రియలు చేపట్టడం, టైలరింగ్ సంబంధిత అంశాలు, ప్యాకేజింగ్, రిటైల్ విక్రయ కేంద్రాలను అభివృద్ధి పరచడం, లే అవుట్ డిజైన్‌లు రూపొందించడం.
- మార్కెట్‌లో వస్తు ఉత్పత్తులకు గిరాకీ పెంచడానికి వీలుగా ఉత్పాదక వస్తువుల తయారీతో నూతనత్వ సాధనకు చేపట్టే ప్రాజెక్టులు
- ఇప్పుడున్న వస్తువులను మార్కెట్‌లో మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే ప్రాజెక్టులు.
- నాణ్యతా ప్రమాణాలను ధ్రువీకరించే డిజిఎస్ మరియు డి/ బిఐఎస్/ ప్రభుత్వం/ ఇతర ఇన్‌స్టిట్యూషనల్ ఆర్డర్ల ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పాదనలతో మార్పులు చేర్పులు చేసేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టులు
- జాతీయ వతాకాల్ని బిఐఎస్ ప్రమాణాలకు తగినట్లు రూపొందించడం, అందుకు అనువైన వస్త్రాల తయారీ సంస్థలను గుర్తించే ప్రాజెక్టులు.

## ఆర్ఐఎస్‌సి కింద ప్రాజెక్టులు

**ఇప్పటికే పూర్తి అయిన ప్రాజెక్టులు**

- వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టన్, వావిలాల - ఖాదీ
- నీలగిరి ఫౌండేషన్ - వెర్మికంపొస్టు పూర్తికానున్న ప్రాజెక్టులు
- కళాసృష్టి - శ్రీకాళహస్తి

## కలప కళా రీతులు

- గుంటూరు జిల్లా ఖాదీ గ్రామోద్యోగ సంస్థ, గుంటూరు - తేనె ఇన్‌హౌస్ టెస్ట్ లాబరేటరీ: ఉత్పాదన వస్తు, సామాగ్రి నాణ్యతా ప్రమాణాలను పరీక్షించి నిర్ధారించడానికి ఉద్దేశించారు.
- ఖాదీ, గ్రామీణ పరిశ్రమల్లో ముడి పదార్థాలు, ఉత్పత్తుల నాణ్యత పరీక్షలకు తగిన వసతులు చేకూర్చడం.
- ఖాదీ, గ్రామీణ పరిశ్రమలకు నిర్దిష్టమైన ప్రమాణాలను రూపొందించడం.

## ఎవరికి ప్రయోజనం

- కెవీఐసీ / రాష్ట్రస్థాయి కెవీఐబిలను అనుమతి పొందిన సంస్థలు / సహకార సంస్థలు, లాబరేటరీ ఖర్చులో 25 శాతం నిధులు సమకూర్చడానికి సిద్ధంగా ఉండాలి.
- పూర్తిగా మహిళలతో కూడిన సంస్థల విషయంలో ఆర్థిక సహాయం 90 శాతం అందిస్తారు.

## ప్రధాన ఉత్పత్తులు

**అన్ని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులు**

**తేనె:** రూ.2.20 లక్షలు లేదా, లేబరేటరీ ఖర్చులో 75 శాతం (ఏది తక్కువైతే ఆ మొత్తం) సహాయంగా లభిస్తుంది. ఈశాన్య భారతదేశంలో రూ.2.20 లక్షలు లేదా 90 శాతం ఏది తక్కువైతే అది. పూర్తిగా మహిళలతో ఏర్పాటు చేస్తున్న పక్షంలో రూ.2.20 లక్షలు లేదా 90 శాతం ఏది తక్కువైతే అది.

**సభ్బులు:** రూ.3 లక్షలు లేదా మొత్తం వ్యయంలో 75 శాతం ఏది తక్కువైతోంది. మహిళల ఆధ్వర్యంలోనైతే రూ.3 లక్షలు లేదా 90 శాతం వ్యయంలో వాటా ఏది తక్కువైతే అది.

## చేతితో తయారు చేసిన కాగితం

రూ.2.50 లక్షలు లేదా 75 శాతం, మహిళల ఆధ్వర్యంలో రూ.2.50 లక్షలు లేదా 90 శాతం ఏది తక్కువైతే అది.

**ఖాదీ:** రూ.2.980 లక్షలు లేదా 75 శాతం వ్యయంలో భాగం, ఈశాన్య భారత ప్రాంతంలోనైతే రూ. 2.980 లక్షలు లేదా 90 శాతం వరకు సాయం ఏది కనిష్ట మొత్తమైతే అది. మహిళల ఆధ్వర్యంలో ప్రతీ రూ.2.980 లక్షలు లేదా 90 శాతం ఏది తక్కువైతే అది.

**ఇతర ఉత్పత్తులు:** ప్రయోజనం పొందే వారు ప్రతిపాదించిన వ్యయం విషయం ప్రోగ్రామ్ డైరెక్టర్ సిఫార్సు ప్రకారం.

ఇక లేబరేటరీ నిర్వహణ, సిబ్బంది వేతనాల వ్యయంలో 50 శాతం వరకు గరిష్టంగా 30 వేలు మొదటి ఏడాది, రూ.20 వేలు రెండో ఏడాది, రూ.10 వేలు మూడో సంవత్సరం.

## శాస్త్ర, సాంకేతిక విభాగం - పరిశోధనలకు అభివృద్ధి ప్రాజెక్టులు, ఉద్దేశాలు

1. కార్మికులు, వృత్తికారులు తమ పరికరాలను, పనిముట్లను వినియోగించడంలో విసుగు కలగకుండా ఉంటే మార్పు చేర్పులు చేయడం.
2. కళాకారుల ఆదాయ మార్గాలను మెరుగుపరచడం.
3. ఇతర రంగాల్లో ఉత్పాదనలకన్నా నాణ్యమైన రీతిలో వస్తువుల ఉత్పత్తి చేసే వారి నైపుణ్యం పెంచడం.
4. ముడిపదార్థాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్ళవలసిన అవసరం లేకుండా స్థానికంగా లభించే వనరుల వాడకాన్ని ప్రోత్సహించడం.
5. ఉత్పాకద విభాగాల్లో కాని, పరికరాల్లో కాని, ప్రక్రియల్లో కాని మార్పు చేసిన సందర్భాలలో కార్మికుల నైపుణ్యం కాని, వ్యక్తిగత ప్రయోజనాలను కాని మార్చుకోవలసిన అవసరం లేకుండా జాగ్రత్తలు తీసుకోవడడం.
6. కొత్త సాంకేతిక ప్రక్రియిలను ప్రవేశ పెట్టిన పక్షంలో ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి, స్థానిక ముడిపదార్థాల వినియోగాన్ని ప్రోత్సహించడానికి వీలుగా రూపొందించడం.

## ఈ ప్రాజెక్టులను ఎవరు చేపట్టవచ్చు?

ఎ. కేవీఐసీ లేదా రాష్ట్ర స్థాయి కెవీఐబి జాబితాలోని అన్ని ఏజెన్సీలు, సంస్థలు/ సొసైటీలు.

బి. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల పరిశోధనలు చేపడుతున్న ఏ వ్యక్తి అయినా, సంస్థ అయినా సరే - వ్యక్తులకిచ్చే సబ్సిడీ పరిమితి రూ.50 వేలకు, సంస్థలకైతే రూ.5 లక్షలకు మించకూడదు.

## పరిశోధన, అభివృద్ధి పరిధిలోని అంశాలు

1. నమూనాల రూపకల్పన కేంద్రాల ద్వారా (Prototype Development Centre) కార్మికుల నైపుణ్యం పెంచే విధంగా పరికరాలు,

యంత్రాలను వికేంద్రీకరణ పద్ధతిలో ప్రాంతీయ సామర్థ్యాన్ని పెంపొందించడం.

2. ఉత్పత్తుల ప్రదర్శనకు వీలుగా టెక్నాలజీ పార్క్, విజ్ఞాన్ కేంద్రం వంటివి ఏర్పాటు చేయడం, ఇలాటి వాటి వల్ల సాంకేతిక ప్రయోజాలు, ఆధునిక పరికరాల ఉపయోగాలు అవసరమైన వారికి అర్థమవుతాయి.
3. నాణ్యతా పరీక్షలతో పాటు ఇతర లేబరెటరీలతో అనుసంధానం. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తుల నాణ్యతను కాపాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని ఇతర లేబరేటరీల సహకారాన్ని సమకూర్చడం..
4. సాంకేతిక, ఇతర ప్రక్రియలను పరికరాలను మెరుగుపరచి ఉత్పాదకతను, వాటి నాణ్యతను కాపాడడం.
5. ప్రయోగాలు ప్రక్రియల నిర్ధారణ కేంద్రాల ఏర్పాటు.
6. అధ్యయనం, అంచనాలు: పరిశోధనల్లోను, అభివృద్ధి కార్యక్రమాలలోను గుర్తించలేని వివరాలు, సమాచార సేకరణ అత్యవసరం. వాటిని సేకరించడం అధ్యయనం చేయడం, వాటి ప్రయోజనాలను అంచనా వేయడం, లక్ష్యాలను నిర్దేశించడం.

### ప్రతిపాదనల రూపకల్పన విధి విధానం

- నిర్దేశించిన దరఖాస్తు ద్వారా సైన్స్, టెక్నాలజీ ప్రాజెక్టు కింద గుర్తించిన రంగాలలో ప్రతిపాదనలను కమిషనర్ పరిశీలనకు సమర్పించవచ్చు.
- ప్రతిపాదించిన పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల ఖాదీ, గ్రామీణ పరిశ్రమలకు ఏ విధంగా ఉపయోగకరమో స్పష్టంగా వివరించాలి.
- సైన్స్, టెక్నాలజీకి సంబంధించిన అన్ని ప్రతిపాదనలలో పథకం వివరాలను, నిర్ణయించిన గడువును స్పష్టం చేస్తూ రాష్ట్ర స్థాయి/ డివిజనల్ డైరెక్టర్‌కు నివేదించాలి.

### ఐఎస్ఓ - 9001-2000
### ప్రయోజనం పొందే వర్గాలు, ఆర్థిక వ్యయ వివరాలు

- కెవీఐసీ/రాష్ట్ర కెవిఐబీలు, ఆర్ఇజెపి కింద పనిచేసే సంస్థలు, సహకార సంఘాలు, వ్యక్తులు.
- సంస్థలు, సహకార సంఘాలకు సంబంధించి ధ్రువీకరించే సంస్థలకు చెల్లించవలసిన ఫీజులో 90 శాతం.
- వ్యక్తుల విషయంలోను, ఆర్ఇజిపి పరిధిలోని సంస్థలకు ఖాదీ గ్రామీణ పరిశ్రమల వ్యయంతో గరిష్టంగా రూ.50 వేలు లోపు ఉండాలి.
- మహిళల ఆధ్వర్యంలో ఉండే పక్షంలో మొత్తం ఫీజులో 95 శాతం వరకు, వ్యక్తిగతంగా ఒక మహిళ చేపట్టే పక్షంలో 95 శాతం లేదా రూ.50 వేల వరకు, ఏది తక్కువైతే అది.

### షెడ్యూల్ పీజు ఎంత చెల్లించాలి?

1. దరఖాస్తు ఫీజు (తిరిగి చెల్లించని షరతుపై) రూ.15,000 / రూ.10.000 (చిన్నతరహా పరిశ్రమకు)
2. అంచనా ఫీజు (ఒకరోజు ఆడిటర్ విధులకు) రూ. 3,000
3. లైసెన్స్ ఫీజు (మూడేళ్ళ వరకు) రూ.60,000/ రూ.40,000
4. నిఘా ఆడిటింగ్ (ఒక రోజు విధులకు) రూ.3,000

ఇవి ప్రస్తుతం అమలులో ఉన్నవి. ఒకవేళ బిఐఎస్ సవరించిన పక్షంలో అవే వర్తిస్తాయి.

### అమలు చేసే సంస్థ బాధ్యత

ఐఎస్ఒ 9001-2000 గుర్తింపు కోసం నిర్దేశించిన నమూనాలో బిఐఎస్ ప్రాంతీయ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలి.

- బిఐఎస్ ప్రాంతీయ అధికారి ఆమోదం పొందాలి.
- అవరసమైన ఫీజుల వివరాలు తెలుసుకుని చెల్లించాలి
- ఆర్థిక సహాయం కోసం నిర్దేశించిన రీతిలో రాష్ట్ర డివిజనల్ డైరెక్టర్‌కు దరఖాస్తు అందించాలి.

### అనుమతించే ప్రాజెక్టులు

- ముడి సరుకులు, యార్క్, ఫ్యాబ్రిక్‌ల సద్వినియోగం, ప్రయోగాలను చేపట్టడం, డెయింగ్, ప్రింటింగ్‌లలో ప్రక్రియలను మెరుగుపరచడం, టైలరింగ్, ప్యాకేజింగ్‌లలో ఆధునిక పోకడలను ప్రోత్సహించడం, రిటైల్ విక్రయ కేంద్రాలను, లే అవుట్ డిజైన్‌లను రూపొందించడం.
- గిరాకీ పెంపునకు తోడ్పడేవిధంగా ఉత్పాదనల వికేంద్రీకరణ
- మార్కెట్ అవసరాలకు తగినట్లు సిద్ధంగా ఉన్న ఉత్పాదకలకు అదనపు హంగులు సమకూర్చడం.
- ఖాదీ, గ్రామీణ పరిశ్రమ ఉత్పత్తులను డిజిఎస్ అండ్ సి / బిఐఎస్, ప్రభుత్వ ఇతర సంస్థాగత ప్రమాదాలకు అనుగుణంగా అభివృద్ధి పరచడం.
- జాతీయ పతాకాన్ని బిఐఎన్ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించడం, అందుకు అనువైన వస్త్ర తయారీ సంస్థలను గుర్తించడం.

### నిషేధించిన కార్యకలాపాలు

- సాధారణ భవన నిర్మాణాల ప్రతిపాదనలు
- రిటైల్ అవుట్‌లెట్‌ల ద్వారా ఇంటీరియల్ డెకరేషన్ చేపట్టడం, సంబంధిత నిర్మాణ ప్రతిపాదనలు
- ఈ ప్రాజెక్టు పేరుతో ఫర్నిచర్, లేదా ఇతర శాశ్వత సదుపాయాలను రూ.40 వేలకు మించి కొనుగోలు చేయడం.
- రూ.40 వేలకు మించి క్యాపిటల్ యంత్ర పరికరాల కొనుగోలు.
- డిజైన్ లేదా అవుట్ లేట్ అప్ గ్రెడేషన్ పేరుతో తప్ప ఇతర ప్రయోజనాల కోసం యంత్ర పరికరాలు తదితర క్యాపిటల్ వస్తువు కొనుగోలు.

(అయితే నిర్దేశించిన పరిమితులకు లోబడి అవుట్‌లేట్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం. ప్రదర్శనకు అనువైన డిస్‌ప్లే బోర్డులు, హ్యాంగర్లు, ఇతర చిన్న చిన్న పరికరాల కొనుగోలుకు అభ్యంతరం ఉండదు)

### ఆర్థిక సహాయానికి అర్హమైన సంస్థలు

1. ఏడాదికి రూ.50 లక్షల వరకు ఉత్పాదక సామర్థ్యం ఉన్న ఎ కేటగిరీకి చెందిన ఖాదీ, పోలి వస్త్ర సంస్థలు (అవి కెవీఐసీ, రాష్ట్ర



కేవీబీల పరిధిలో ఉంటే).

2. ఏడాదికి రూ.75 లక్షల వరకు ఉత్పాదన సామర్థ్యం ఉన్న ఖాదీ, పోలీ వస్త్ర సంస్థలు బి కేటగిరీకి చెందినవి (కేవీఐసీ మరియు రాష్ట్ర కేవీబీల పరిధిలోనివి).
3. ఏడాదికి రూ.100 లక్షల ఉత్పాదకత ఉన్న సి కేటగిరీకి చెందిన ఖాదీ, పోలీ వస్త్ర సంస్థలు (కేవీఐసీ, రాష్ట్ర కేవీబీల పరిధిలోనివి).
4. ఆర్ఇజిపి ఆర్థిక సాయం అందుకున్న పరిశ్రమలకు అధికారుల నుంచి తగిన ధ్రువీకరణ పత్రం పొంది, వాటి ఉత్పాదనలకు తగిన రూపంలో, సైజ్‌లో, ప్యాకేజింగ్ రూపొందించేవి అయి ఉంటే అవి.
5. కేవీఐసీ, రాష్ట్ర కేవీఐబీలకు చెందిన వివిధ శాఖల పరిధిలో ఉండి ఏడాదికి రూ. 20 లక్షల వరకు ఉత్పాదక సామర్థ్యం ఉన్న సంస్థలు.
6. కేవీఐసీ, కెవిఐబీల పరిధిలో ఉండి ఏడాదికి రూ.50 లక్షల వరకు టర్నోవర్ ఉన్న వివిధ శాఖల అనుబంధ సంస్థలు.
7. ఏడాదికి రూ. 50 లక్షల వరకు వార్షిక విక్రయాల టర్నోవర్ ఉన్న ఎ, బి, సి కేటగిరీలకు చెందిన మార్కెటింగ్ సంస్థలు.
8. ఖాదీ, కుటీర పరిశ్రమలకు వాణిజ్య ఉత్పత్తులు చేపట్టడంలో తోడ్పడేందుకు సిద్ధంగా ఉన్న అన్ని సాంకేతిక సంస్థలు, కళాశాలలు, పరిశోధనా సంస్థలు.

### ఉత్పత్తుల అభివృద్ధి, డిజైన్‌ల రూపకల్పన, ప్యాకేజీ సహకారం.

1. **సంస్థలు:** అర్హమై / వాటికి రూ. 2 లక్షల వరకు లేదా మొత్తం వ్యయంలో 75 శాతం ఏది తక్కువ అయితే అది.
2. **వ్యక్తులు:** వ్యక్తుల అధీనంలోని సంస్థలకు లక్ష రూపాయల వరకు లేదా వ్యయంలో 75 శాతం ఏది తక్కువ అయితే అది.

(రూ. 2 లక్షల వరకు ఖర్చుకాగల పథకాలకు సంబంధించి కూడా కేవీఐసీ నుంచి లభించే సహాయాన్ని పరిమితం చేయడానికి మాత్రమే ఈ విధంగా రూ.1 లక్ష మరియు రూ.2 లక్షల పరిమితి నిర్ణయించడమైనది)

ఈ విభాగానికి వాటికి రూపొందించిన డిజైనర్ లేదా ఎల్ఆర్ఐ, కెవీఐసిలు మూడింటికి కూడా ఆ డిజైన్‌లపై సమానంగా హక్కులుంటాయి. నమూనా రిజిస్ట్రేషన్ ఖర్చును ప్రాజెక్టు వ్యయంలో భాగంగా పరిగణిస్తారు. దాన్ని కేవీఐసీ రిజిస్టర్ చేసుకుంటుంది.

ప్రాజెక్టును పూర్తి చేసి సమర్పించిన తరువాత అది కేవీఐసీ లేదా సంస్థ ఆస్తిగా పరిగణించబడుతుంది.

ఇలా కేవీఐసీ రిజిస్టర్ చేసిన డిజైన్‌లపై డిజైనర్ లేదా ఎల్ఆర్ఐకి వాటి విక్రయం ఆధారంగా రాయల్టీ లభిస్తుంది.

**డిజైనర్ ఫీజు:** దీన్ని సంస్థ లేదా వ్యక్తి రెండు దశల్లో చెల్లించవలసి ఉంటుంది.

1. ప్రాజెక్టు ప్రారంభంలో 50 శాతం
2. ప్రాజెక్టు పూర్తి అయిన తరువాత స్థానిక లేదా రాష్ట్ర స్థాయి, డివిజన్ స్థాయి డిజైనర్‌లకు సమర్పించిన 30 రోజులలో మిగిలిన మొత్తం.

### ప్రాజెక్టు గడువు

సాధారణంగా నాలుగు నుంచి ఆరె నెలలు. అయితే ఫ్యాబ్రిక్ డిజైన్, గార్మెంట్ డిజైన్, రూపకల్పనకు సందర్భాన్ని బట్టి సాధికార కమిటీ గడువును పొడిగించవచ్చు. అయితే అది తొమ్మిది నెలలు మించకూడదు.

### ప్రధాని ఉపాధి కల్పన కార్యక్రమం

ప్రధాని రోజ్‌గార్ యోజన (పిఎంఆర్‌వై) భారత ప్రభుత్వ వ్యవసాయ పరిశ్రమల శాఖ అధీనంలో స్వయం ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువతకు అందుబాటులోకి తేవడానికి అమలవుతున్న పథకం. బ్యాంకుల రుణ సదుపాయంతో పాటు, నగదు రాయితీలనిచ్చి సూక్ష్మ సంస్థలను ప్రోత్సహించడం దీని ఉద్దేశం. ఎంపిక చేసిన లబ్దిదారులకు అవసరమైన శిక్షణ సదుపాయాలు, నిర్వహణ సామర్థ్యంలో శిక్షణ అవకాశం కల్పిస్తారు.

ఇందుకోసమే భారత ప్రభుత్వం ప్రధాని ఉపాధి కల్పనా పథకం చేపట్టింది.

### ఉద్దేశాలు

### ఈ పథకం కింద కెవిఐసీ అప్పగించిన హద్దులు.

1. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించడం.
2. సంప్రదాయ వృత్తులోని వారిని, ప్రత్యేక నైపుణ్యం ఉన్న కార్మికులను, చెల్లా చెదురుగా ఉన్న వాళ్ళందరినీ ఒక గొడుగు కిందకు తీసుకు వచ్చి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులకు స్వయం ఉపాధి వైపు మళ్ళించడం, వారందరిని వారి స్వస్థలాల నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్ళడాన్ని నిరోధించడం, గ్రామీణ పారిశ్రామికీకరణను ప్రోత్సహించడం.
3. సంప్రదాయక, నైపుణ్యం కల వృత్తి కళాకారులకు ఇతరులకు ఉపాధి కల్పించడం.
4. వృత్తులపై ఆధారపడిన వారికి తగిన ఆదాయ మార్గాలను చూపించడం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఉపాధికి మార్గంగా తీర్చిదిద్దడం.

### అనుమతించిన కార్యకలాపాలు

కొబ్బరి పీచు ఆధార ప్రాజెక్టులతో పాటు (నిషేధించినవి మినహా) గ్రామీణ పరిశ్రమలన్నీ ఆమోదయోగ్యం,. అవి తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పడి ఉండాలి. విద్యుత్‌ను వినియోగించినా, వినియోగించకపోయినా ఒక్క సంప్రదాయ వృత్తులు చేపట్టే, కార్మికుల

తలసరి పెట్టుబడి లక్ష రూపాయలకు మించకుండా ఉండాలి.

### ఆర్థిక సహాయ సంస్థలు

1. 27 ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ బ్యాంకుల అనుబంధ బ్యాంకులు
2. ప్రైవేటురంగ బ్యాంకులు - రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని కెవీఐ బోర్డులు
3. రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల కెవీఐ బోర్డులు అనుమతించిన సహకార బ్యాంకులు

### ఆర్థిక సహాయం పరిమితులు, కేటగిరీలు, ప్రాజెక్టు వ్యయంతో లబ్ధిదారు వాటా

- పట్టణ ప్రాంతం 10 శాతం
- గ్రామీణ ప్రాంతం 15 శాతం
- జనరల్ కేటగిరీ 25 శాతం

### స్పెషల్ సబ్సిడీ రేటు

- పట్టణ ప్రాంతం 5 శాతం
- గ్రామీణ ప్రాంతం 25 శాతం
- జనరల్ కేటగిరీ 35 శాతం

(ఎస్‌సి/ ఎస్‌టీ/ ఓబీసి/ వికలాంగులు/ మాజీ సైనికులు, మైనారిటీలు, మహిళలు, ఈశాన్య ప్రాంతం, కొండ ప్రాంతాలు, సరిహద్దుల ప్రాంతంలో వారికి)

### ప్రాజెక్టు వ్యయం

1. ఉత్పత్తి రంగంలో గరిష్టంగా రూ.25 లక్షలు
2. సేవారంగంలో ఒక ప్రాజెక్టు లేదా యూనిట్‌కు రూ.10లక్షలు

### అర్హమైన ప్రాజెక్టులు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గ్రామీణ పరిశ్రమలన్నిటికీ వర్తిస్తుంది. అయితే విస్తరణ, పునరుద్ధరణ ప్రాజెక్టులు అనుమతించబడవు.

### గ్రామీణ ప్రాంతాలు అంటే

జనాభాతో సంబంధం లేకుండా రాష్ట్ర రెవెన్యూ రికార్డులలో గ్రామంగా పేరు నమోదైన ప్రాంతం.

- పట్టణ ప్రాంతంగా నమోదైనప్పటికీ (1991 జనాభా లెక్కల ప్రకారం) జనాభా సంఖ్య 20 వేలకు మించకుండా ఉండాలి.

### అర్హులైన రుణ గ్రహీతలు

- 18 ఏళ్ళు దాటిన ప్రతి ఒక్కరు
- సహకార సొసైటీలు, ట్రస్టులు, ఇతర రిజిస్టర్డ్ సంస్థలు
- స్వయం సహాయక బృందాలు

(భాగస్వామ్య సంస్థలు, ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు, జాయింట్ వెంచర్లు, సంయుక్త రుణ గ్రహీతలు అర్హులు కారు)

### విద్యార్హతలు

ఉత్పత్తిరంగంలో రూ.10లక్షల లోపు ప్రాజెక్టు వ్యయం ఉన్న సంస్థల ఏర్పాటుకు 8వ తరగతి. సేవారంగంలో రూ.5లక్షల ప్రాజెక్టు వ్యయం ఉన్న ప్రాజెక్టులకు కూడా 8వ తరగతే విద్యార్హత

### సొంత వనరులు

జనరల్ కేటగిరీలో ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం, ఎస్‌సీ/ఎస్టీ/ ఒబిసి/ మహిళల/ వికలాంగులు/ మాజీ సైనికులు/ మైనారిటీలు/ హెచ్‌బిటి ఏరియా/ ఈశాన్య ప్రాంతాలు/ సిమో/ అండమాన్ నికోబర్, లక్షద్వీప ప్రాంతాల్లో 5 శాతం.

### బ్యాంకు రుణం

- జనరల్ కేటగిరీ కింద 90 శాతం వరకు బలహీనవర్గాల వారికి 95 శాతం వరకు బ్యాంకులు ప్రాజెక్టు వ్యయంలో మంజూరు చేస్తాయి. భూమి ఖరీదును ప్రాజెక్టు వ్యయంలో భాగంగా చూపించకూడదు.
- బ్యాంకు సహాయంలో మొదటి విడత విడుదల చేసిన తరువాత - కెవీఐసీ ముందుగానే ఏక మొత్తంగా జమ చేసిన మార్జిన్ మనీ నుంచి తన వాటా కోసం ఆ బ్యాంకు నుంచి నిర్దేశించిన దరఖాస్తు దాఖలు చేస్తుంది.
- అదే రీజనల్ గ్రామీణ బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం సమకూర్చినపుడు మార్జిన్ మనీ కోసం అవి వాటి కేంద్ర కార్యాలయాలను సంప్రదించవలసి ఉంటుంది. అక్కడి నుంచి అందుకోసం ప్రత్యేకించిన నోడల్ బ్యాంకుకు దరఖాస్తు చేరుతుంది.

### మార్జిన్ మనీ విడుదల

స్థానిక బ్యాంకు బ్రాంచి రుణ సదుపాయం మంజూరు చేసిన తరువాత ఆయా కేటగిరీలకు అవసరమైన మొత్తాన్ని ఆయా రుణ గ్రహీతలపేరు మీద బ్యాంకులో మూడేళ్ళ కాలానికి జమ చేయడం జరుగుతుంది. మొదటి రుణ విడత విడుదలైన మూడేళ్ళ తరువాత వారి ఖాతాల్లో నుంచి తిరిగి వసూలు చేయడం జరుగుతుంది.

భాతర ప్రభుత్వ వ్యవసాయ, గ్రామీణ పరిశ్రమల మంత్రిత్వశాఖ పేదల సాధికారతకు సాధనంగా నిలబడుతుంది.

క్లిష్ట సమయంలో కూడా వ్యవసాయదారులను సంఘటిత శక్తిగా పటిష్టం చేయడానికి మూడు అంచెల పద్ధతి రూపుదిద్దుకుంది. సంఘటిత శక్తిగా ఏకం కావడానికి ప్రోత్సాహం అందించడం. మార్కెట్ అవకాశాలను మెరుగుపచడంతో పాటు వారి సామర్థ్యాన్ని పెంపొందించడం, అవసరమైన కనీస మద్దతు అందించడం.

సమష్టి కృషి ఫలితాన్ని సంఘటిత శక్తి సాధించగలదని గుర్తించాలి. అదే ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్/రాష్ట్ర బోర్డుల విశిష్ట లక్ష్యం. సభ్యుల సాధికారతకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, సాంకేతికంగా ఇది ఒక సాధనం.

**- కోట పురుషోత్తమ్**
**(అనువాదం: ఆర్. శేషు)**

**1986వ సంవత్సరం కేంద్ర గ్రామీణ పారిశుద్ధ్య పథకం పారంభించ బడిన సంవత్సరం. ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా బహిరంగ మల విసర్జనను రూపుమాపడం, మరుగుదొడ్ల వాడకాన్ని ప్రోత్సహించడం. తద్వారా మల అవశేషాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా నీటిలో మల కాలుష్యాన్ని నివారించి వ్యక్తిగత ఆరోగ్యాన్ని పెంపొందించాలి అన్నది ముఖ్యాంశం.**

దీనితో దేశ వ్యాప్తంగా మరుగుదొడ్ల నిర్మాణం ఒక ఉద్యమంలా నడిచింది. సుమారు మన ఆంధ్రప్రదేశ్‌లోనే 20 లక్షల మరుగుదొడ్లు నిర్మించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అలా నిర్మించిన మరుగుదొడ్లు ఉపయోగం ఎలా ఉందంటే -

* మరుగు దొడ్లను స్నానాల గదిగా మార్చుకోవడం
* మరుగు దొడ్డిని పూజా మందిరంగా వాడడం
* సరుకులు నిల్వచేసుకోనే కొట్టంలా వాడడం
* సామాగ్రిని తిరిగి విక్రయించడం
* నిర్మాణం జరుగకనే, నిర్మాణం పూర్తయినట్లుగా చూపించడం

ఇదీ మనం నిర్మించుకొన్న మరుగుదొడ్ల సమగ్ర స్వరూపం.

బహిరంగ మలవిసర్జన అనంతరం మలం / మల అవశేషాలు భూమి పైన నిల్వ ఉండడం ద్వారా మల అవశేషాలు నీటిలో కలవడం, పొలాలకు విస్తరించడం, ఈగలు వంటి కీటకాల ద్వారా వ్యాప్తి చెందడం, మానవుల కాళ్ల ద్వారా, చేతుల ద్వారా ఆహారం లోనికి ప్రవేశించటం, తద్వారా ప్రతి మనిషి మలాన్ని భుజిస్తున్నాడు అన్నమాట.

మనం నిత్యం తీసుకొనే ఆహారంలో ఒక చాక్లెట్ పరిమాణం మలం కలసి ఉందంటే అతిశయోక్తి కాదు. మనకు సంక్రమించే వ్యాధులతో 80% వ్యాధులకు ఇది కారణమంటే దీని తీవ్రత అర్థమౌతుంది. అందుకే మరుగుదొడ్డి వాడాలి.

మీరు ఎప్పుడైన పిల్లిని గమనించారా. పిల్లి మల విసర్జన చేసిన తరువాత వెంటనే తన కాళ్ళతో మట్టిని/ గింజలను అందుబాటులో ఉన్న దానితో కప్పేస్తుంది. తన మలం బహిరంగంగా వదలి వేయడం క్షేమం కాదు అని పిల్లి కూడా అర్థం చేసుకుంది. మరి మనుషులమైన మనం మలాన్ని కప్పివేయవలసిన అవసరం ఉందా? లేదా? ఈ ప్రశ్నకు ఒకే ఒక్క సమాధానం ఉంది. మరి పిల్లి వలే చేయడమా లేక కొంత ఆధునిక పద్ధతిని ఉపయోగిద్దామా... అంటే మరుగుదొడ్డి వాడవలసిన అవసరం. ఇప్పుడు అర్థం అయింది కదా? మరుగుదొడ్డి ఉపయోగించడం మనకి మాత్రమే కాదు మన తోటి వారికీ క్షేమకరం.

# రండి ! నిర్మల గ్రామాలుగా అవతరిద్దాం !!

## సంపూర్ణ పారిశుద్ధ్య సాధనా దిశగా....

### అసలు మరుగుదొడ్లు ఎందుకు వాడాలి?

ప్రాచీన కాలం నుండి మనుషులు తమ రోజు వారీ కార్యక్రమాలలో భాగంగా మల విసర్జనకు ఊరి బయట మరుగుగా ఉండే ప్రదేశాన్ని ఎంచుకునే వారు. ఇది నివాస ప్రాంతాలకు దూరంగా ఉండేది. ఉదయం/వేకువ జామునే కాలకృత్యాలు తీర్చుకోటానికి నివాస ప్రాంతాలకు దూరంగా వెళ్ళడం ఒక అలవాటుగా వచ్చింది.

క్రమేపీ జనాభా పెరుగుదల కారణంగా నివాస ప్రాంతాలు విస్తరించడం, నీటి వినియోగం పెరగడం, బంజరు భూములను పంట భూములుగా మార్చడం జరుగుతూ వచ్చింది. నేటి పరిస్థితి గమనిస్తే, వర్షాకాలంలో ప్రతీ గ్రామంలో అతిసార, టైపాయిడ్, కలరా, పచ్చకామెర్లు వంటి నీటి కాలుష్య వ్యాధులు ప్రబలి అనేకమంది ఆసుపత్రి పాలవుతున్నారు.

ఓ ప్రక్క ఆసుపత్రి ఖర్చులు. దీనికి తోడు పనికి వెళ్ళకపోవడం వలన ఆదాయం కోల్పోయి అప్పుల పాలవుతున్నారు. తదుపరి వారి పరిస్థితి దుర్భర మవుతుంది. సరైన ఆహారం తీసుకోక, శారీరకంగా బలహీన పడుతున్నారు.

ఈ పరిస్థితికి కారణం ఏమిటని నిశితంగా గమనిస్తే, ప్రధాన కారణం మల విస్తృతిగా తేలినది. ఈ మల విస్తృతి అంటే ఏమిటి?

### 1999, సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమం

కేంద్ర ప్రభుత్వం 1986లో ప్రవేశ పెట్టిన పథకాన్ని ప్రజల నిర్వహణలో చేపట్టాలనే సదుద్దేశ్యంతో 1999లో సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించిన గ్రామ పంచాయితీలకు / మండల ప్రజా పరిషత్‌లకు/ జిల్లా ప్రజాపరిషత్‌లకు ప్రోత్సాహకాన్ని అందించాలనే లక్ష్యంతో 'నిర్మల' పురస్కారాన్ని ప్రవేశ పెట్టింది.

### 'నిర్మల' పురస్కారం ఎవరికి లభిస్తుంది?

ఒక గ్రామం/మండలం/ జిల్లా/ రాష్ట్రం పూర్తి స్థాయిలో అంటే..

* 100% గృహస్తులు మరుగుదొడ్ల వాడకాన్ని పాటిస్తున్నప్పుడు
* 100% పాఠశాలలు మరుగుదొడ్ల వాడకాన్ని పాటిస్తున్నప్పుడు

* పరిసర ప్రాంతాలలో బహిరంగ మల అవశేషాలు జాడ కన్పించినపుడు ఈ పరిస్థితులు ఉంటే అప్పుడు నిర్మల పురస్కారం వరిస్తుంది.

ఇప్పుడు మన మెదడును తొలిచే ప్రశ్న... నిర్మల గ్రామం విన్నాం కానీ ఈ నిర్మల మండలం, నిర్మల జిల్లా, నిర్మల రాష్ట్రం ఏమిటి? ఇదెలా సాధ్యం? ఇదంతా చెప్పుకోవడానికేలే? జరిగేవా పెట్టేవా అనుకుంటున్నారు కదూ? ఇవన్నీ జరిగినవే.



Sthanka_BW June.indd 23 30/05/11 5:41 PM

మన భారతదేశంలో హిమాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాలు నిర్మల రాష్ట్రాలు. నమ్ముతారా. కేరళ 99% సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని సాధించి నిర్మల పురస్కారానికి చేరువలో ఉంది. మెజారిటీ జిల్లాలు నిర్మల జిల్లాలుగా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని మిడ్నాపూర్ జిల్లా 2000 సంవత్సరానికి ముందే నిర్మల జిల్లాగా అవతరించింది.

మహారాష్ట్రలోని అనేక జిల్లాలు నిర్మల జిల్లాలు / మండలాలుగా అవతరించాయి. గుజరాత్‌లోని పంచమహల్‌ను నిర్మల పురస్కారం వరించింది.

మరి మన ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే నిర్మల గ్రామాలతో సరి పెట్టుకోవలసి వస్తుంది. అదే చాలా కష్టం అయింది. ఎందుకు ఈ పరిస్థితి...

* విధాన పరమైన లోపమా
* అవగాహనా లోపమా
* నిధులు లేవా
* నాయకత్వ లోపమా లేక
* చేత కాని తనమా,

ఇలా ఆలోచిస్తుంటే బాధగా ఉంది కదూ?

'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అనే సామెత అక్షర సత్యంలా ప్రతిబింబిస్తుంది. అక్షర క్రమంలో ముందున్న ఆంధ్రప్రదేశ్ పారిశుద్ధ్య పరంగా చాలా వెనుకబాటులో ఉంది.

*'ఏ దేశ మేగినా ఎందు కాలిడినా*
*పొగడరా నీ జాతి తల్లి భారతిని*
*నిలుపరా నీ జాతి నిండు గౌరవము'*

అన్న గురజాడ వారి సూక్తిని నిజం చేయాలని ఉంది కదూ. అందుకు కొన్నీ సోదాహరణలు పరిశీలిద్దాం.

## పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని మిడ్నాపూర్ జిల్లా

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని మిడ్నాపూర్ జిల్లా భారతదేశంలోనే తొలి 'నిర్మల జిల్లా'. కేవలం 4% మరుగుదొడ్ల వాడకాన్ని 100% వాడకంగా ఎలా తీసుకురాగలిగారు. వారు అనుసరించిన విధి విధానం ఏమిటి? అంటే...

* ప్రతి 1000 జనాభాకు ఒక శిక్షణా కార్యకర్తను ఏర్పాటు చేయడం
* శిక్షణా కార్యకర్తలు గ్రామస్తులకు మరుగుదొడ్ల ఆవశ్యకతను తెలియ చేసి, మరుగుదొడ్లు నిర్మించుకొనేందుకు, వాడేందుకు వారిని ఒప్పించడం చేయాలి.
* అలా చేయగలిగిన ఒక్కో ఇంటికిగాను, శిక్షణా కార్యకర్తకు ప్రోత్సాహకంగా 20 రూపాయలు లభిస్తుంది.
* 375 రూపాయల నుండి 4500 రూపాయల వరకు ఖర్చు కాగల పది రకాల మరుగుదొడ్ల నిర్మాణాల నమూనాలను రూపొందించి, ప్రదర్శించడం.
* గ్రామాలలో ఎన్.జి.వో.ల సహకారంతో శానిటరీ మార్పులను (పారి శుద్ధ్య పరికరాలు అంగడి) ఏర్పాటు చేయడం.
* సామాగ్రి చేరవేతకు స్థానికంగా ఉండే అవకాశాలను వినియోగి ంచడం.

ఉదా : ఎద్దుల బండి, లాగుడుబండి లాంటివి.

* అర్హతగల లబ్ధిదారులకు 200 రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ అందించడం
* తరచుగా అధికారుల, ప్రజా ప్రతినిధుల క్షేత్ర సందర్శన
* ప్రతీ సోమవారం గ్రామపంచాయితీ స్థాయిలో, మంగళవారం బ్లాక్ స్థాయిలో, అంటే మండల స్థాయిలో, ప్రతి బుధవారం జిల్లా స్థాయిలో ప్రగతి సమీక్షలు నిర్వహించడం.
* స్వయం సహాయక బృందాలలోని సభ్యులకు మరుగుదొడ్ల నిర్మాణం, వాడకంపై ముందుగా అవగాహన కల్పించి వారిని సాధన దిశలో ముందుకు నడిపించడం.
* నీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం మూడు ఒక దానితో ఒకటి పరస్పర సంబంధం కలిగిన అంశాలుగా నొక్కి వక్కాణించడం.
* పారిశుధ్యాన్ని ఒక అలవాటుగా మలచడం.

ఇదండీ, మిడ్నాపూర్ విజయ రహస్యం. చాలా సులభంగా ప్రగతి సాధించారు కదా. ఇది మనకి అసాధ్యమేమీ కాదు కదా.

మరో ఉదాహరణ చూద్దాం.

## గుజరాత్‌లోని పంచమహల్ జిల్లా

గుజరాత్ రాష్ట్రంలోని 'పంచమహల్'లో వినూత్న విధానాన్ని అనుసరించడం ద్వారా సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించారు. ఇందులో పాఠశాల పారిశుద్ధ్యం పై ప్రధానంగా దృష్టి సారించి పిల్లలు వారధులుగా పని చేశారు. వారి విధి విధానం...

* పాఠశాల పారిశుద్ధ్యంపై దృష్టి
* విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల వాడకం, నీటి వినియోగం, పరిసరాల పరిశుభ్రతపై తర్ఫీదు నిచ్చారు.
* విద్యార్థులతో పారిశుద్ధ్య సాధనకు కమిటీలు రూపొందించారు. ఉదా: ఆరోగ్య కమిటీ, పారిశుద్ధ్య కమిటీ మొదలైనవి.
* ఆయా కమిటీలలోని విద్యార్థులు వారి పరిధిలోని అంశాలను పరిశీలించాలి. ఉదా: గోళ్ళు కత్తిరించుకొని పాఠశాలకు వస్తున్నారా, లేదా, వారంలో ఒక రోజు అసెంబ్లీలోనే పర్యవేక్షించడం లాంటివి.
* కమిటీ తన నివేదికను 'బాల అదాలత్'కు సమర్పించాలి. 'బాల అదాలత్' అనగా బాలల న్యాయస్థానం.
* బాల అదాలత్ కమిటీ నివేదికలను సమీక్షించి అభియోగం మోపబడిన వారిని విచారిస్తుంది. వారు తమ నేరం ఒప్పుకున్నట్లైతే ప్రథమ తప్పిదానికి హెచ్చరించడం, రెండవసారి తప్పుకు పారిశుద్ధ్య నినాదాలను '10' సార్లు ఇంపోజిషన్ వ్రాయించడం, మూడవసారి తప్పిదానికి పాఠశాల పరిసరాలను శుభ్రం చేయించడం లాంటివి చేస్తుంది.
* అభియోగం మోపబడిన వారు నేరాన్ని ఒప్పుకోని పక్షంలో విచారణ జరిపి, విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించి తీర్పునివ్వడం జరుగుతుంది.
* పాఠశాల పారిశుద్ధ్యం సాధించారంటే విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల వాడకం ఒక అలవాటుగా మారుతుంది. కనుక ఇంట్లో మరుగుదొడ్ల వాడకానికి / అవగాహన కల్పించడం ద్వారా ఇండ్లలో పారిశుద్ధ్య సాధనకు సులభమార్గం ఏర్పడింది.
* తదుపరి కమ్యూనిటీపై దృష్టి సారించారు.
* ప్రజల ఆరోగ్యం - ప్రజల చేతులలోనే అనేది వారు నమ్మిన సిద్ధాంతం.


Sthanka_BW June.indd 24 30/05/11 5:41 PM

## కేరళ రాష్ట్రం

కేరళ పేరు వినగానే మనకు వెంటనే స్ఫురించేది అక్షరాస్యత. 'ఎక్కడ చదువుల తల్లి నిలయం ఉంటుందో అక్కడ లక్ష్మీదేవి తాండవిస్తుంది' అని పెద్దలు అంటూ ఉంటారు. అది నిత్యసత్యం. అందుకే కేరళ అన్నింటిలోనూ ముందే ఉంటుంది. దానిని బట్టి మనకు అర్థం అయిపోతుంది - కేరళ సంపూర్ణ పారిశుధ్యం సాధించి ఉంటుందని. అయితే ఆశ్చర్యకరమైన విషయమేమంటే, గత 3, 4 సంవత్సరాలుగా 99% పారిశుధ్యం సాధించినా, 1% సాధించడంలో విఫలమైనది. దానికి ప్రధాన కారణాలు

1. వాటర్ లాగ్‌డ్ ఏరియాలు.
2. మరుగుదొడ్ల నిర్వహణా సమస్య.

వీటిని అధిగమించడానికి కేరళ రాష్ట్రం వినూత్న రీతిలో ఇ-మరుగుదొడ్లకు తెరతీసింది. కొచ్చిలో ఎలక్ట్రానిక్ మరుగుదొడ్లను ప్రారంభించనున్నారు. కాయిన్ (నాణెం) వేయడం ద్వారా మరుగుదొడ్లను వాడుకోవడం శుభ్రపరిచిన తర్వాత అనగా ఫ్లష్ నొక్కిన తర్వాత తలుపు తెరుచుకుంటుంది. తద్వారా మరుగుదొడ్ల నిర్వహణా సమస్యను అధిగమించాలనేది లక్ష్యం. రెండవది ఎకో-శానిటేషన్ మరుగుదొడ్ల నిర్మాణం.

'కుల్లం' ప్రాంతం వాటర్ లాగ్‌డ్ ఏరియా. కనుక ఎకో శానిటేషన్ మరుగుదొడ్లు అనుకూలం కనుక వాటి నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్నారు. వీటి ఉపయోగానికి బూడిద అవసరం కనుక బూడిదను నిల్వచేసుకోవడం ట్రాన్స్‌పోర్టేషన్, వాడకం వీటిపై అక్కడి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

2011లో కేరళ సంపూర్ణ పారిశుద్ధ్య రాష్ట్రంగా ఆవిర్భవించాలని ఆశిద్దాం.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం - హాజీపల్లి గ్రామపంచాయితీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పారిశుద్ధ్య పురస్కారం నిర్మల గ్రామం స్థాయిని దాటి రావడం లేదు. ఒక హాజిపల్లి, ఓ గంగదేవపురం, ఓ రామచంద్రాపురం . . . ఇలా వేళ్ళ మీద లెక్క పెట్టగలం. 11 మండలాలు, 23 జిల్లాలు, సుమారు 21,700 గ్రామ పంచాయితీలలో సంపూర్ణ పారిశుద్ధ్య సాధన ఎలా? ఇది సమాధానం లభించని ప్రశ్న. హాజిపల్లి గ్రామ పంచాయితీని సందర్శించినపుడు, వారితో ముచ్చటించినప్పుడు కొన్ని ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. ఈ అంశాలు మన గ్రామ పారిశుద్ధ్య సాధనలో తప్పకుండా దోహద పడతాయనిపిస్తుంది. అవి....

* గ్రామ సర్పంచ్ శ్రీమతి జంగమ్మ, మాజీ సర్పంచ్ శ్రీ సింగారం శ్రీనివాస్‌లు చక్కటి సమన్వయంతో పని చేస్తున్నారు.
* గ్రామ సర్పంచ్ శ్రీమతి జంగమ్మతో చర్చిస్తుంటే ఆమెలో ఏమైనా సాధించగలం అన్ని ఆత్మ విశ్వాసం కన్పించింది.
* సర్పంచ్, వార్డు మెంబర్లు, స్వయం సహాయక బృందనాయకులు, గ్రామంలోని పెద్దలు అందరూ కలసి పని చేస్తున్నారు.
* 'గ్రామసభ'ను గ్రామ పారిశుద్ధ్య కట్టుబాట్ల రూపకల్పనకు, వాటి అమలు పర్యవేక్షణకు వారధిగా మలచుకొన్నారు.
* గ్రామ కట్టుబాటును గ్రామ ప్రజలందరూ పాటిస్తున్నారు.
* గ్రామ కట్టుబాటును ఎవరైనా గ్రామస్తులు ధిక్కరించినా/ అధిగమించినా 500 రూపాయలు అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు.
* జిల్లా కేంద్రం/ మండల కేంద్రం నుండి అతిథులు వచ్చినపుడు వారి సౌకర్యార్థం గ్రామ పంచాయితీ ఆవరణలో మరుగుదొడ్డి నిర్మించారు.
* జిల్లా / మండల కేంద్రం నుండి వచ్చిన అధికారులైనా సరే వీరి కట్టుబాటును పాటించవలసిందే. లేదంటే 500 రూపాయలు జరిమానా సమర్పించుకోవాలి.
* జిల్లా కలెక్టరును సంప్రదించి గ్రామంలో అంతర్గత డ్రైనేజ నిర్మాణానికి నిధులను సమకూర్చుకోగలిగారు.
* వేరే పంచాయితీలను సందర్శించినపుడు అక్కడ వారిని ఆకర్షించిన అంశాలను తమ గ్రామంలో అమలు చేయడానికి కృత కృత్యులయ్యారు.

ఉదా: అంతర్గత డ్రైనేజీకి ప్రేరణ మెదక్ జిల్లాలోని ఉస్మాన్‌పూర్ గ్రామ పంచాయితీ సందర్శన.

* గ్రామంలో ఉత్పన్నమయ్యే చెత్తా, చెదారాన్ని డస్ట్‌బిన్‌లు పంపిణీ చేయడం ద్వారా వీధులలోని చెత్తకుండీలలో వేసేలా కట్టుబాటు రూపొందించుకున్నారు. రెండు రోజులకొకసారి వీధులలోని చెత్త కుండీల నుండి ట్రాక్టరు ద్వారా ఊరికి దూరంగా మళ్ళిస్తున్నారు.
* పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడమేకాక, విద్యార్థులు పాఠశాలలోని మల, మూత్రశాలలను ఉపయోగిస్తున్నారు.
* గ్రామ ప్రధాన ఆదాయ వనరు ఇంటి పన్నుల రూపేణా సుమారు సంవత్సరానికి 35000 రూపాయలు వసూలు చేస్తున్నారు.
* గ్రామ ప్రజలు నీటి వినియోగ రుసుం క్రింద ప్రతినెలా 10 రూలు చొప్పున గ్రామ పంచాయితీకి చెల్లిస్తున్నారు. గ్రామ పంచాయితీ పంపు ఆపరేటర్‌ను నియమించుకుంది.
* ప్రజలందరికీ ఆరోగ్యకర అలవాట్ల పట్ల మంచి అవగాహన ఉంది.
* ఈ గ్రామ నాయకులు ఇతర గ్రామాలకు అతిథులుగా వెళ్ళి ఆ గ్రామంలో తమ అనుభవాలను పంచుకొంటున్నారు.

పై అంశాలతో ఆ గ్రామం రాష్ట్ర ప్రభుత్వం నుండి శుభ్రం అవార్డు పొందడమే కాక, 2008 సంవత్సరానికి నిర్మల పురస్కారం పొందింది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య అంశమేమంటే, ఈ రోజుకీ పారిశుద్ధ్య ప్రగతిలో సుస్థిరత కలిగి ఉండడం.

కొన్ని గ్రామ పంచాయితీలు నిర్మల గ్రామం సాధించిన తర్వాత మరలా వెనుకటి స్థితికి వెళ్ళడం కూడా అక్కడక్కడా మనకి కన్పిస్తూనే ఉంది. ఈ విషయంలో హాజీపల్లి గ్రామ పంచాయితీ నాయకులను, ప్రజలను నిజంగా అభినందించ వలసిందే.

ఇప్పుడు చెప్పండి. ఇవన్నీ మనం చేయలేమా? తప్పకుండా చేయగలం. కావలసినదల్లా దృఢ సంకల్పం. మన గ్రామ పంచాయితీని / మండలాన్ని/ జిల్లాను సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా అమలు జరపాలి. అందుకు ఎవరితో నైనా కలిసి పనిచేద్దాం. అందరినీ కలుపుకుపోదాం. గ్రామ కట్టుబాట్లు రూపొందించుకుందాం. వాటి అమలులో తర తమ భేదాలు చూపవద్దు. మన లక్ష్యం ఒక్కటే - 'నిర్మల గ్రామం / మండలం/ జిల్లా'గా అవతరించడం.

*- మాధురి, ఫాకల్టీ, అపార్డ్*



Sthanka_BW June.indd 25 30/05/11 5:41 PM

# మహనీయుల చతురోక్తులు

– పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

## కొత్త ఓటింగ్ పద్ధతికి శ్రీశ్రీకారం

**తన మీదా తను నమ్మిన ఆదర్శాలమీదా సిద్ధాంతాలమీదా జోక్ వెయ్యాలంటే, ఆ వ్యక్తిలో ఎంతో ఔన్నత్యం, మరెంతో ఆత్మవిశ్వాసం వుండాలి. శ్రీశ్రీ కి కమ్యూనిజం, రష్యా, చైనా ప్రభుత్వవిధానాలు, వీటిపై అచంచలమైన నమ్మకం గౌరవమూను.**

ఓ మారు కాకినాడలో జరిగిన ఒక సాహితీసభలో ఆయన పాల్గొన్నారు. మీటింగ్ అయిపోయింది. రూమ్‌కి వచ్చాక ఆయన చుట్టూ కాలేజీ విద్యార్థులు చేరారు. కబుర్లూ నవ్వులూ కోలాహలంగా సాగుతున్నాయి.

మధ్యలో ఓ విద్యార్థి "శ్రీశ్రీ గారూ! మీ కమ్యూనిస్టు ప్రభుత్వం వస్తే, దేశంలో ఎన్నికలు వుంచుతారా, ఎత్తేస్తారా?" అనడిగాడు.

శ్రీశ్రీ వెంటనే "ఎన్నికలు ఎందుకు ఎత్తేస్తాం? మా కమ్యూనిస్టు ప్రభుత్వంలో కూడా ఎన్నికలుంటాయి. అయితే కొన్ని మార్పులతో వుంటాయి" అన్నారు.

"అంటే?"

"అందరూ ఓటు వెయ్యొచ్చు ఇప్పటిలాగే. అయితే మేం ఇచ్చే బేలెట్ పేపర్లు ఇప్పటిలాగా ఓపెన్‌గా ఉండవు. సీల్డుకవర్లలో వుంటాయి. ఓటరే సీల్డుకవరు తీసి కెళ్ళడం, బేలెట్ పెట్టెలో వెయ్యడం సింపుల్."

"మరి... ఆ సీల్డు కవరు విప్పడం.... తన ఓటు ఎవరికి వెయ్యాలో నిర్ణయించుకోవడం.."

"నో...నో..నో.. ఏ ఓటరూ, సీల్డు కవరు ఓపెన్ చేసి లోపల ఏం వుందో చూడకూడదు. అప్పుడు రహస్య ఓటింగ్ అనే మాటకి అర్థం ఎక్కడుంటుంది? అందువల్ల..."

అందరి నవ్వులతోనూ, శ్రీశ్రీ చిరునవ్వు కలిపారు.

## ఊరికే అంటే ఊరుకొనేది లేదు

**మ**హాప్రస్థానం వంటి మహాకావ్యాన్ని వ్రాసి, 'ఈ యుగం నాది' అని నిబ్బరంగా చెప్పగలిగిన యుగకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ). ఆయన ఎక్కువ కాలం గడిపిందీ, నాలుగు రూపాయలు సంపాదించిందీ సినిమా రంగంలోనే. శ్రీశ్రీని సినిమా వారందరూ ఎంతో గౌరవంగా చూసేవారు. ఆ రోజుల్లో మళ్ళీ అంతటి గౌరవం పొందిన సినీ రచయితలు ఆత్రేయ, సముద్రాల, పింగళి నాగేంద్రరావు, బలిజేపల్లి, మల్లాది రామకృష్ణశాస్త్రి, సదాశివ బ్రహ్మం వంటి ఏ కొద్దిమందో. సదాశివబ్రహ్మంగారిని కథాశివ బ్రహ్మం అని కూడా పిల్చేవారు. అవును మరి, ఆయన రాసినకథ పట్టువల్లే, ఆ సినిమా వందేసి రోజులు ఆడేది.

ఓమారు శ్రీశ్రీ మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో ప్లాట్‌ఫారంమీద ఇటూ అటూ తచ్చాడుతున్నాడు. సిగరెట్టు కాలుస్తూ పట్టాలమీద కలకత్తా వెళ్ళే రైలు బయలు దేరడానికి సిద్ధంగా ఉంది.

మిత్రులెవర్నో దిగబెట్టడానికి స్టేషన్‌కి సదాశివ బ్రహ్మంగారు, శ్రీశ్రీని చూశారు. "శ్రీశ్రీ ఊరు వెళ్తున్నాడా? మరయితే పెట్టే బెడ్డింగూ కనిపించవేం? లేకపోతే ఊరికే వచ్చాడా స్టేషనుకి?" ఎందుకేనా మంచిదని రెండర్థాలూ వచ్చేలా "హలో శ్రీశ్రీ! ఊరికేనా?" అన్నారు.

శ్రీశ్రీ యేనా తక్కువ తిన్నది?

"ఊరికే!"

కాస్సేపయ్యాక, ఒకరి మాట ఒకరికి అర్థం అయి, ఇద్దరూ నవ్వుకున్నారు.

## కవిగారి కాంప్లిమెంట్!

**మా**ట పట్టుదల కోసం, మామూలు కాలేజీ డే కోసం అయినా, సి. నారాయణరెడ్డిని హైదరాబాదు నుంచి విమానంలో తీసుకువచ్చాం. నేనూ, స్టూడెంట్ సెక్రటరీ, గన్నవరం విమానాశ్రయానికి వెళ్ళి, కారులో బాపట్ల తీసుకువస్తున్నాం ఆయన్ని.

ఎండ తీవ్రంగా వుంది. గుంటూరులో కొబ్బరినీళ్ళు, తీసుకుని, వెనుకసీట్లో సి.నా.రె సీటుకి జేర్లబడి కళ్ళు మూసుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన పక్కన కూర్చుని నేను అద్దాల డోర్‌లోంచి, అటూ ఇటూ వెనక్కిపోతూన్నట్లు కనిపిస్తూన్న చెట్లని చూస్తూ పరధ్యానంగా వున్నాను. ముందు సీట్లో మా విద్యార్థి సెక్రటరీ డ్రైవర్‌తో ఏదో మాట్లాడుతున్నాడు. కారు వేగంగా పొన్నూరు దాటి బాపట్లవైపు నిశ్శబ్దంగా దూసుకుపోతోంది.

హఠాత్తుగా సి.నా.రె. కళ్ళు తెరిచి సహజమైన ధోరణిలో "ఈ తేరు, ఏ తీరునబడి పోవుచున్నది?" అన్నారు.

మా విద్యార్థి మిత్రుడు వెంటనే "ఈ తేరు, ఈతేరున బడి పోవుచున్నది" అన్నాడు.

సి.నా.రె. తెల్లబోయారు.

అప్పుడే రోడ్డు ప్రక్కని తప్పుకుంటూన్న "ఈతేరు" అనే గ్రామం వ్రాసి వున్న బోర్డు చూపించాను.

"నేను అనుకుంటే, నా కంటే భాషా చమత్కృతి చూపించావే! శభాష్! నీ పేరు?" అనడిగారు. సి.నా.రె

"హఫీజ్" అన్నాడు అతను. నారాయణరెడ్డి మరింత ఆశ్చర్యంతో ఆనందించి, తన జేబులో పెన్ను, అతని జేబులో పెట్టారు అభినందన సూచకంగా.

## మూర్ఖం మార్కు మార్కులు

**ఆంధ్ర సాహితీ మూర్తులలో పింగళి, కాటూరి, విశ్వనాథ, జాషువా వంటి మహామహులెందరో ప్రసిద్ధ సాహితీవేత్తలుగా గుర్తింపబడి, జనబాహుళ్యానికి తెలిసినా, కొంచెం ఇంచుమించు అంతటి సామర్థ్యాన్ని కలిగి వుండి కూడా ప్రచారం లేక, తెరమరుగున వుండిపోయి జనబాహుళ్యానికి తెలియని మహాపండితులూ, విద్వాంసులూ, కవులూ కూడా కొందరున్నారు. అలాంటి వారిలో దాదాపు మూడు దశాబ్దాలు భీమవరం కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా పనిజేసి దివంగతులైన శ్రీ దిగుమర్తి సీతారామస్వామిగారు ఒకరు.**

ఆయన అత్యంత ప్రతిభావంతులు. రసహృదయులు. చక్కని కవి. కవితా స్వారస్యం తెలిసిన విమర్శక శిఖామణి. అన్నింటికంటే చమత్కారంగా మాట్లాడ్డంలోనూ, మాటల్తో మొండిగా వాదించే ఎదుటి వ్యక్తి నోరు మూయించడంలోనూ ఒహునేర్పరి.

ఓ మారు నలుగురైదుగురు లెక్చరర్ల మధ్య వాదన పడింది. "లెక్కలు, సైన్సు వంటి సబ్జెక్ట్సులో నూటికి నూరు మార్కులు వెయ్యొచ్చు కాని, ఎంత గొప్పగా రాసినా తెలుగు, ఇంగ్లీషు వంటి సబ్జెక్ట్సులో నూటికి ఎనభై. ఎనభై అయిదు కంటే వెయ్యకూడదు. ఎందువల్లనంటే, వాటికి పరాకాష్ఠ అంటూ లేదు కనుకా, ఎంత బాగా వ్రాసినా ఇంకా బాగా వ్రాయవచ్చు కనుకాను" అని. కాని ఒక లెక్చరర్‌గారు మొండిగా మూర్ఖంగా అడ్డం తిరిగి "అదేంకాదు. తెలుగులో కూడా నూటికి నూరు వెయ్యొచ్చు. నేను వేశాను" అంటూ వాదించసాగారు. ఎవరు ఎంతగా నచ్చచెప్పినా వినడం లేదు.

ఆ సమయంలో సీతారామస్వామిగారు డిపార్టుమెంటు రూమ్‌లోకి వచ్చారు. వాదించుకుంటున్న వాళ్ళల్లో ఒకాయన పూర్వాపరాలు చెప్పకుండా "అయ్యా! తెలుగులో నూటికి నూరు వెయ్యొచ్చా?" అనడిగారు. వెంటనే దిగుమర్తివారు "ఆ... వేస్తే వెయ్యొచ్చు. అయితే అది ఆ పేపరు దిద్దేవాడి అజ్ఞానం మీద ఆధారపడి వుంటుంది" అన్నారు. దాంతో, మొండి వాదన చేస్తూన్న లెక్చరర్ నోరు మూతపడింది.

★



Sthanka_BW June.indd 18 30/05/11 5:41 PM

**ము**ఖ్యమంత్రి శ్రీ ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన మే 24న సమావేశమైన రాష్ట్రమంత్రి వర్గం కొన్ని కీలకమైన నిర్ణయాలు తీసుకుంది.

# క్యాబినెట్ నిర్ణయాలు

### రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 5.136 శాతం కరువుభత్యం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 5.136 శాతం కరువుభత్యం పెంచాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి నుంచి ఈ పెరుగుదల అమలు చేస్తారు. పెంచిన డిఎ బకాయిలను జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఉద్యోగుల జి.పి. ఎఫ్ ఖాతాల్లో జమచేస్తారు. మే నెల డిఎను వేతనంతో కలిపి చెల్లిస్తారు. ఈ నిర్ణయం వల్ల, ప్రభుత్వంపై ఏటా రూ. 1194 కోట్ల భారం పడుతుంది. ప్రభుత్వ పెన్షనర్లకు కూడా ఈ పెంపుదల వర్తిస్తుంది. గ్రామ సేవకులు, తాత్కాలిక సహాయకులకు కూడా కరువుభత్యం పెరుగుతుంది.

### అక్రమార్జన కేసుల్లో ఆస్తుల జప్తు

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల అక్రమార్జన కేసుల్లో ఆస్తుల జప్తునకు మంత్రివర్గం ఆమోదం ఉద్యోగులపై దాఖలయ్యే అక్రమార్జన కేసుల్లో ప్రాధమిక నివేదికతో పాటు పేర్కొనే ఆస్తుల వివరాల ఆధారంగా ఆస్తుల జప్తునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలుత ఈ విధానం అమల్లో ఉన్నప్పటికి, ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం దానికి స్వస్తి చెప్పింది. అయితే, ఈ విషయాలలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

### బిసి రిజర్వేషన్లు మరో పదేళ్ల పాటు పొడిగింపు

రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులకు ఉద్యోగ నియామకాలతో పాటు, విద్యాసంస్థలలో రిజర్వేషన్లను మరో 10 సంవత్సరాలు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పొడిగింపుతో పాటు వయో పరిమితిలో 5 సంవత్సరాల సడలింపును కూడా ఇవ్వటం జరిగింది. ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్ల కాలపరిమితి మే నెలాఖరుకు ముగుస్తున్న దృష్ట్యా, ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వెనుకబడిన తరగతుల్లోని అన్ని కేటగిరీలు- ఎ,బి,సి,డి,ఇలకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. అయితే, గ్రూపు -ఇ రిజర్వేషన్‌లకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నందు వల్ల, తుది తీర్పుకు లోబడి నిర్ణయాన్ని అమలు చేస్తారు.

### ఇందిరమ్మ ఇళ్లకు నిర్మాణ వ్యయం పెంపు

☆ ఇందిరమ్మ ఇళ్లకు నిర్మాణ వ్యయం పెంచాలని వచ్చిన విజ్ఞప్తుల దృష్ట్యా, గ్రామీణ ప్రాంతాల్లో యూనిట్ ధరను రూ. 31,200 నుంచి 45,000 లకు, పట్టణ ప్రాంతాల్లో రూ.43,000 నుంచి రూ.55,000లకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2009 ఎన్నికల నాటికి నిర్మాణంలో ఉన్న 4,70,571 ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయాయి. నిర్మాణ వ్యయం చాలకపోవటం వల్లే, ఇవి పూర్తిచేయలేకపోయినట్లు ప్రభుత్వం దృష్టికి రావటం వల్ల నిర్మాణ వ్యయం పెంచాలని నిర్ణయించటం జరిగింది.

☆ గ్రామీణ ప్రాంతాల్లో రూ.13,800 వరకు పట్టణ ప్రాంతాల్లో రూ.12,000 వరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ వ్యయం పెంచటానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం వల్ల, లక్షలాది మందికి లబ్ధి చేకూరుతుంది. ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి ఇదివరకెన్నడూ పెరగలేదు.

☆ అంతేకాక, అదనంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌సి/ఎస్‌టి కుటుంబాలకు రూ.20,000 వరకు, పట్టణ ప్రాంతాల్లోని ఎస్‌సి/ఎస్‌టి కుటుంబాలకు రూ.30,000 వరకు రుణం లభిస్తుంది. దీనివల్ల, గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్‌సి/ఎస్‌టి కుటుంబాలు రూ.65,000లను, పట్టణ ప్రాంతాల్లోని ఎస్‌సి/ఎస్‌టి కుటుంబాలు రూ.85,000లను ఇళ్ల నిర్మాణం కింద పొందే అవకాశం ఏర్పడింది.

☆ అదనంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత మరుగుదొడ్డి కింద ఒక్కొక్కదానికి రూ. 3050 లను కూడా మంజూరు చేస్తారు.

☆ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 2010-11 సంవత్సర బడ్జెట్‌లో కేటాయించిన మొత్తానికి రూ.500 కోట్లను పెంచడం ద్వారా 2011-12 నాటికి, కనీసం 5 లక్షల ఇళ్లను పూర్తిచేయటం జరుగుతుంది.

☆ ఈ నిర్ణయాల ఫలితంగా, వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణంలో ఉన్న లబ్ధిదారులు 13.83 లక్షల మంది ప్రయోజనం పొందనున్నారు. ఇళ్ల స్థలాల పట్టాలు పొందుతున్న అనేకమంది లబ్ధిదారులు కూడా ప్రయోజనం పొందుతారు. మొత్తం 15 లక్షల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి.

### ఇందిర జలప్రభ

ఇందిర జలప్రభ కింద జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పరిధిలో 10 లక్షల ఎకరాల భూములకు నీటి సదుపాయానికి ప్రభుత్వం కృషి చేయనున్నది. ఈ పథకంలో ఎస్‌సి/ఎస్‌టి భూములకు, ఇతర అసైన్డ్ భూములకు ప్రాధాన్యం ఇస్తారు. 10 ఎకరాల భూమిలో ప్రతి ఎకరంపై సగటున రూ. 16,000 వ్యయం చేస్తారు. ఈ భూములలో మైక్రో ఇరిగేషన్ విధానాలు చేపట్టి, అందుకు తగిన పంటల ప్రణాళికను అనుసరించాలని, తద్వారా ఏడాదికి రూ.25,000 వరకు ఆదాయాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండు దశల్లో నిర్వహించే ఈ ప్రాజెక్టుకు రూ.1600 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేయనున్నది.

### ధాన్యం కొనుగోళ్లు

ధాన్యం ఉత్పత్తి, ఈ ఏడాది రికార్డు స్థాయిలో జరిగినందువల్ల, సేకరణ, నిల్వ సమస్యలు ఏర్పడకుండా తీసుకుంటున్న చర్యలకు, ధాన్యం కొనుగోళ్లకు రిజర్వుబ్యాంకు నుంచి రూ. 500 కోట్లను రుణంగా పొందేందుకు, కొత్తగా 1.66 కోట్ల గోనె సంచుల కొనుగోళ్లు జరపడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

### తిరుపతి విమానాశ్రయం విస్తరణ

తిరుపతి విమానాశ్రయ విస్తరణకు 701 ఎకరాల భూమిని జాతీయ విమానాశ్రయాల అథారిటీకి అప్పగించేందుకు మంత్రివర్గ ఆమోదం. చిత్తూరు జిల్లాలోని రేణిగుంట, యేర్పేడు మండలాల్లో ఈ భూమి ఉంది. భూసేకరణ కోసం రూ.100 కోట్లు కేటాయిస్తారు.



Sthanka_BW June.indd 19 30/05/11 5:41 PM

## న్యాయవాదుల సంక్షేమనిధి

న్యాయవాదుల సంక్షేమ నిధికి చలాన్ల రూపంలో కాకుండా స్టాంపుల ద్వారా జమ చేసేందుకు అవసరమైన చట్టసవరణ తేవడానికి ఆర్డినెన్స్ జారీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

## వృత్తి పన్ను చట్టానికి సవరణలు

1987 నాటి వృత్తి పన్ను చట్టానికి సవరణలు తేవాలని మంత్రివర్గం నిర్ణయించింది. నిర్వచనాల మార్పుతో పాటు, ఎటిఎంల ద్వారా జరిగే వాణిజ్య కార్యకలాపాలను చట్టం పరిధిలోకి తెస్తారు.

## ప్రభుత్వ ఆసుపత్రులు

నల్గొండ జిల్లా ఆసుపత్రిలో పడకల సంఖ్య 250 నుంచి 400కు, శ్రీకాకుళం జిల్లా రాజాం ప్రభుత్వ ఆసుపత్రిలో 60 నుంచి 100కు పెంచడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

## భూమి కేటాయింపులు

☆ విశాఖ జిల్లా పరవాడ మండలం చీపురు పల్లిలో డిఆర్‌జివోకు 283.75 ఎకరాల కేటాయింపునకు మంత్రివర్గ ఆమోదం. ఎకరానికి రూ.12 లక్షల వంతున మార్కెట్ ధరను ఖరారు చేశారు.

☆ నిజామాబాద్ జిల్లా బోధన్‌లో నిజాం చక్కెర కర్మాగారానికి చెందిన 500 ఎకరాల భూమిని రూ. 2.03 కోట్లకు ఎస్‌సి/ ఎస్‌టిలకు ఇతర వర్గాలకు, బోధన్ మున్సిపాలిటీకి విక్రయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

☆ చిత్తూరు జిల్లా పూతలపట్టు వద్ద పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ఎపిఐఐసికి 14.70 ఎకరాలను, ఎకరానికి లక్షరూపాయల వంతున కేటాయించడానికి మంత్రివర్గం అంగీకారం తెలిపింది.

## పోస్టుల భర్తీ

☆ శ్రీకాకుళం జిల్లాలో డిప్యూటీ సర్వేయర్ కేటగిరీలో 69 సూపర్ న్యూమరీ పోస్టులు ఏర్పాటు చేసే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం.

☆ 1994లో ఖాళీలు లేనప్పటికీ, మంజూరైన సంఖ్యకు మించి 80 మంది డిప్యూటీ సర్వేయర్లను నియమించటం జరిగింది. ఈ నియామకాలను న్యాయవిరుద్ధమైనవిగా భావించిన ప్రభుత్వం వారిని ఉద్యోగాలనుంచి తొలగించటం జరిగింది.

## ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయంలో పోస్టుల భర్తీ

☆ విజయవాడలోని ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయంలో 66 అదనపు పోస్టులతో పాటు తాత్కాలిక ప్రాతిపదికన 64 పోస్టుల భర్తీకి మంత్రివర్గ ఆమోదం.

☆ ఈ పోస్టులలో ఒక జాయింట్ రిజిస్ట్రార్, ఒక కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, ఒక చీఫ్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్, మూడు డిప్యూటీ రిజిస్ట్రార్లు తదితర పోస్టులున్నాయి.

☆ ఉద్యోగాలు కోల్పోయిన డిప్యూటీ సర్వేయర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## పాలిటెక్నిక్ కళాశాలల్లో పోస్టుల నియామకం

☆ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 563 పోస్టుల భర్తీకి మంత్రివర్గ ఆమోదం.

☆ వీటిలో అముదాలవలస, మచిలీపట్నం, కావలి, కందుకూరు, అద్దంకి, మడకశిర, ఉరవకొండ, కల్యాణ్‌దుర్గ్, రాయ్‌చోటి, గద్వాల్, పరకాల, సంగారెడ్డి, నారాయణ్‌ఖేడ్, ఆదోని, కలికిరి, క్రోసూరు, పార్వతీపురం, అనకాపల్లి, జంగారెడ్డి గూడెం, తాడేపల్లి గూడెం, గన్నవరం, కలిదిండి, పొన్నూరు, రాయదుర్గ్, ధర్మవరం, కదిరి, తాడిపత్రి, పిల్లారిపట్లు, చంద్రగిరి, సత్యవేడు, జమ్మలమడుగు, రాజంపేట, వేంపల్లి, సింహాద్రిపురం, కమలాపురం, ఓబులవారిపల్లె, ఆలూరు, నిర్మల్, కాటారరి, కోరుట్ల, స్టేషన్ ఘన్‌పూర్, నందిపేట, కోటగిరి, తిరుమలగిరి, యాదగిరి గుట్ట, సిద్దిపేట, నర్సాపూర్, వికారాబాద్, మధిరలలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ పోస్టుల భర్తీని చేపడతారు.

ఈ 563 పోస్టులలో విభాగాధిపతుల పోస్టులు 48, సీనియర్ లెక్చరర్లు 178, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు 48, సూపరింటెండెంట్లు 16, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు 208, సీనియర్ అసిస్టెంట్లు 65 ఉన్నాయి.

## రోడ్లు, భవనాల శాఖలో పోస్టుల భర్తీ

రోడ్లు, భవనాల శాఖలో ఒక చీఫ్ ఇంజనీరు, ఒక చీఫ్ టెక్నికల్ ఎగ్జామినర్ పోస్టుల భర్తీతో పాటు, ప్రస్తుతమున్న స్టేట్ ఆర్కిటెక్ట్ పోస్టును చీఫ్ ఇంజనీర్ పోస్టుకు అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

## గిరిజన సంక్షేమ శాఖలో అదనపు పోస్టులు

గిరిజన సంక్షేమ శాఖపై పెరిగిన పనిభారాన్ని దృష్టిలో పెట్టుకుని అదనంగా 4 పోస్టుల భర్తీకి ఆమోదం. వీటిలో హైదరాబాద్‌లో ఒక సూపరింటెండెంట్ ఇంజనీర్, కెఆర్‌పురం, సీతంపేట, నెల్లూరులలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పోస్టుల భర్తీకి ఆమోదం.

## మహిళా శిశు సంక్షేమ శాఖలో పోస్టుల భర్తీ

మహిళా శిశు సంక్షేమ శాఖలో ప్రస్తుతమున్న 23 అసిస్టెంట్ డైరెక్టర్ పదవులను రద్దు చేస్తూ, 9 జాయింట్ డైరెక్టర్లు, 14 డిప్యూటీ డైరెక్టర్ పోస్టుల ఏర్పాటుకు మంత్రివర్గ ఆమోదం.

## విద్యుత్ శాఖలో పోస్టుల భర్తీ

వినియోగదారుల సమస్యలు పరిష్కరించే లక్ష్యంతో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఎపిసిపిడిసిఎల్) నిర్ణయించింది.

దీనికి అవసరమైన 3 చీఫ్ జనరల్ మేనేజర్ పోస్టులను భర్తీ చేయడానికి మంత్రివర్గ ఆమోదం.

## మునిసిపాలిటీల్లో పోస్టుల నియామకం

హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ కార్పోరేషన్లు మినహా, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో 4,048 పోస్టుల భర్తీకి ప్రభుత్వ ఆమోదం.

వీటిలో కమిషనర్లతో పాటు, ఇంజనీర్లు, అకౌంట్స్ అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, పబ్లిక్ హెల్త్ అధికారులు పోస్టులు ఉన్నాయి.

ఈ మొత్తం పోస్టులను 2014 వరకు 3 దశలలో భర్తీ చేస్తారు. దీనివల్ల ప్రభుత్వంపై 86.99 కోట్ల రూపాయల అదనపు భారం పడుతుంది.

*– జి. సుజాత*



Sthanka_BW June.indd 20 30/05/11 5:41 PM

# 'లీపు' వీరుడు మొరార్జీ దేశాయ్

**భారతదేశాన్ని పాలించిన ప్రధానమంత్రులలో మొరార్జీదేశాయ్ ఒక విలక్షణమైన వ్యక్తిగా పెద్దలు అభివర్ణిస్తారు. ఆ విలక్షణత ఆయన జన్మించిన తేదీలో కూడా స్వతసిద్ధంగా వచ్చినదే అనిపిస్తుంది. 1896 ఫిబ్రవరి 29న ఆయన జన్మించడం. ఆ కారణంగా అందరిలాగే మొరార్జీ పుట్టిన రోజు పండుగ ఏటేటా జరుపుకునే వీలులేకుండా పోవడం, లీపు సంవత్సరంలో జన్మించిన కారణంగా నాలుగేళ్లకో పర్యాయం జరుపుకోవడం చిత్రంగానే అనిపిస్తుంది.**

ఆయన తండ్రి రంచోడ్జీ దేశాయ్ ఒక చిన్న బడిపంతులు. అంటే ఆ రోజుల్లో బడిపంతులు ఉద్యోగమంటే చిన్నచూపు. 'బతకలేక బడిపంతులు' అనే సామెత కూడా అప్పట్లో జన వ్యవహారంలో పాతుకుపోయింది. ఈనాడు మాస్టర్ (పంతులు) ఉద్యోగమంటే జనానికి ఇష్టమైన కొలువు. బోలెడన్ని సెలవులు, ఐదు అంకెల జీతం. రాయితీలు, బంద్‌ల పేరుతో క్లాసులు కేన్సిల్ కావడం వంటివి ఎన్నో యెన్నెన్నో. ఈనాటి ప్రభుత్వాలకు భావి భారత పౌరుల్ని తీర్చి దిద్దడం పట్ల అపారమైన గౌరవం ఏర్పడింది. అందుకే పంతుళ్ల బతుకులు మెరుగ్గానే ఉన్నాయి.

రంచోడ్జీ దేశాయ్‌కి ఏడుగురు సంతానం. పైగా అవి ఫ్యామిలీ ప్లానింగ్ అంతగా అమలు కాని రోజులని ప్రత్యేకంగా చెప్పేపనిలేదు. మొరార్జీదేశాయ్ తండ్రి గంపెడు సంసారాన్ని పోషించలేక ఆత్మహత్య చేసుకున్న వైనం చాలామందికి తెలియని విషయం. బాల్యంలో మొరార్జీ కటిక దారిద్ర్యాన్ని అనుభవించారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి, అవమానాలను అధిగమించి, తిరస్కారాలను అతి సహనంతో భరించి, స్వయంకృషితో అభివృద్ధిలోకి వచ్చిన ప్రతిభావంతుడు. ఇక్కడ ఆయన వ్యక్తిత్వం గురించి మనం కొంతైనా చెప్పుకోవాల్సి ఉంది.



ఆనాటి తెల్లదొరతనం భారతదేశ ప్రజల్ని నిరంకుశంగా అణిచి పాలిస్తున్నది. దేశం పరాయిపాలనలో మగ్గిపోతున్న రోజులవి. బొంబాయి ప్రభుత్వ రెవెన్యూ శాఖలో మొరార్జీ దేశాయ్ డిప్యూటీ కలెక్టర్‌గా జీవితం ప్రారంభించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలనలోనూ ఆయన ఖద్దరు ధరించి ఉద్యోగం చేయసాగారు. అనంతరం ఆయన పి.ఎ.గా పనిచేస్తున్న జిల్లా కలెక్టర్‌తో అభిప్రాయబేధం వచ్చింది. వెంటనే మొరార్జీ ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. అదే ఆయన రాజకీయ అరంగేట్రానికి నాంది అయ్యింది. గాంధీ మహాత్ముని దర్శనం చేసుకుని దేశాయ్ నేనింక ప్రభుత్వోద్యోగంలో ఇమడలేనని చెప్పడం జరిగింది.

ఆనాటి ఉండీ ఆయన దేశసేవ చేసేటందుకుగాను నడుం బిగించారని మనం అర్థం చేసుకోవచ్చు. దేశ రాజకీయాలలో దేశాయ్‌కి చిన్నతనం నుండీ ఆత్మగౌరవం పాలు ఎక్కువే. అంతకు మించిన 'హెడ్‌స్ట్రాంగ్' గుణం కూడా తక్కువేమి కాదు. ఇంకా శైశవ దశ నుండీ కూడా ఆయన ఆశావాది. మిన్ను విరిగి మీద పడ్డా చలించని వ్యక్తిత్వం ఆయనది. అదే ఆయన భావి జీవితానికి రాచబాట వేసినదని భావించవచ్చు.

భావనగర్ మహారాజా కాలేజీ వారు దేశాయ్ తెలివితేటల్ని గుర్తించి పది రూపాయల విద్యార్థి వేతనం ఇస్తూ ప్రోత్సహించారు. చదువుతో బాటు కొంత గృహావసరాలకూ ఆ సొమ్ము వాడుకునే పరిస్థితి ఉండేది. కాలేజీలో బి.ఎ. చదివేటప్పుడు ఆంగ్లేయుల పాలనలో దేశం మగ్గుతున్నందున ఆయనకి క్లాసులో విధిగా బైబిల్ బోధ ఎవరో ఒకరు చేస్తూ ఉండటం జరిగేది. ఆ సమయంలో మొరార్జీ క్లాసులో ఉండేవారు కాదు. అలా చేస్తున్నందుకు అది కాస్తా ప్రిన్సిపాల్ నోటీసులోకి వెళ్లింది. ఆయనని పిల్చి మందలించడమూ జరిగింది. ఆనాటి నుండీ మొరార్జీదేశాయ్ ప్రిన్సిపాల్‌కి నమస్కరించడం మానుకున్నారు.

డిగ్రీ ఫస్టు క్లాసులో పాసైన తర్వాత ప్రభుత్వోద్యోగానికి దేశాయ్ దరఖాస్తు చేసుకున్నారు. అప్పుడు ప్రిన్సిపాల్ దరఖాస్తుతో పాటు, రికమండేషన్ లెటరు ఇస్తానన్నాడట. అభిమానధనుడైన మొరార్జీ "నాకెవరి సిఫార్సు అక్కర్లేదు" అని నిర్మొహమాటంగా చెప్పారట. నా సర్టిఫికెట్ నాకిస్తే చాలు అని చెప్పి దానినే తీసుకున్న స్వాభిమాని.

మొరార్జీదేశాయ్ చాలా నిబద్ధతతో వ్యవహరిస్తూ, మిక్కిలి క్రమశిక్షణతో నడుచుకునేవారు.

కాంగ్రెస్ పార్టీ ఒకసారి ఒక నిర్ణయం తీసుకుంటే దానిని అంతా బద్ధులై పాటించాలనే ఉద్దేశం కలిగి ఉండే వ్యక్తి దేశాయ్. అందుకే ఆ పార్టీ నాయకుడు ఒక మాట చెబితే దాన్ని కార్యకర్తలెవ్వరూ ధిక్కరించకూడదన్నదే ఆయన లక్ష్యం. బొంబాయిలో ఆయన రెవెన్యూ మంత్రిగా 1938లో పనిచేసినప్పుడు తన పట్ల దురుసుగా ప్రవర్తించిన ఆంగ్లేయ ఐ.సి.ఎస్. అధికారికి ఫుల్‌గా క్లాసు పీకారు.

ఆ ఐ.సి.ఎస్. ఆఫీసరు మంత్రిగా వున్న మొరార్జీదేశాయ్ దగ్గరకు పైపు కాలుస్తూ చక్కా వచ్చాడు. మంత్రి పట్ల అది చులకన భావంగా గ్రహించిన మొరార్జీ అతనితో మాట్లాడకుండా మౌనంగా కూర్చుని ఉండిపోయారు. అతనికి బుద్ధి రావాలని మీ దేశపు వ్యక్తియైన గవర్నర్ దగ్గరకు మీరు వెళ్తే ఈ విధంగానే వెడతారా అంటూ నిలదీసిన ఘనుడు ఆయన.

"మీకు మీ దేశం వాళ్ల కన్నా మా భారతదేశపు మంత్రులే తక్కువ వారా? వారే తేలిగ్గా కనిపిస్తున్నారా?" అంటూ ఖంగు తినిపించిన మొండి మనిషి కూడా మొరార్జీ! నిర్మొహమాటంగా మాట్లాడటం, ముక్కుసూటిగా పోవడం, మంకు పట్టుదల ఆయనలో గల వ్యక్తిత్వ లక్షణాలు. అయితే ఇటువంటి వాటి వల్ల కూడా ఒక్కొక్కసారి ఆయన అపోహలకు, అపార్థాలకు గురి కావలసిన సందర్భాలూ లేకపోలేదు.



Sthanka_BW June.indd 21 30/05/11 5:41 PM

మొరార్జీదేశాయ్‌కి మద్యపాన నిషేధం విషయంలో తాను ప్రభుత్వంలో ఉన్నా, లేకున్నా దానిని కచ్చితంగా అమలు పరచాలనే పట్టుదల గట్టిగా ఉండేది. కేవలం తన స్వంత రాష్ట్రానికే అది పరిమితం కాకుండా మొత్తం దేశం యావత్తూ అది అమలు జరగాలనే కృతనిశ్చయం ఉండేది. అందుకు ప్రధానమైన కారణం ఆయన ప్రబలమైన గాంధేయవాది అయినందువల్ల దేశ ప్రధానిగా తను పదవిలో ఉండగా కూడా మొరార్జీ విదేశీ వస్త్ర ధారణ చేసిన దాఖలాలు అగుపించవు. పైగా తాను రాట్నం మీద నూలు వడకడం అలవాటు చేసుకున్నారు. నీతినిజాయితీల విషయంలో ఆయనకు ఆయనే సాటి అని అనిపించుకున్నారు.

కొన్ని బలమైన నమ్మకాలు మొరార్జీదేశాయ్‌కి ఉండేవి. అవేమంటే టీకాలు వేయించుకోవడమంటే ఆయనకు ససేమిరా మొదట్నుంచీ ఇష్టముండేది కాదు. ఆయన అమెరికా, బ్రిటన్ వగైరా దేశాలు దర్శించడానికి వెళ్లినప్పుడు కూడా వాటిని వేయించుకోకుండా, ఆయా దేశాలు వెళ్లడానికి అక్కడ ప్రభుత్వం నుంచి ప్రత్యేక మినహాయింపు పొందిన ఖచ్చిత భావాలు కల వ్యక్తి. 1952లో దేశాయ్ బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు.

ఆ ఎన్నిక కావడం కూడా చాలా చిత్రాతిచిత్రంగానే జరిగిందని చెప్పుకోవచ్చు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొరార్జీ తన అన్నగారి కుమారుడు అమూల్ దేశాయ్‌పై 19 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. నిజానికి ఓడిపోయిన అభ్యర్థి ఏ పార్టీ (ఆఖరికి అధికార పార్టీ) యైనా అదే రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నియమించబడటం అదివరలో జరిగిన దాఖలాల్లేవు. కాని మొరార్జీకి వున్న ప్రాబల్యానికి, పలుకుబడికి రాజకీయాలలో, అందునా బొంబాయి రాష్ట్రంలో ఆయనదే పైచేయి అయినందున ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు.

1956 దేశాయ్ ప్రతిభాపాటవాల్ని గమనించిన హైకమాండ్ (కేంద్రం) జవహర్‌లాల్ నెహ్రూ కేంద్ర మంత్రిగా మొరార్జీని ఆహ్వానించి వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రిగా నియమించడం జరిగింది. క్రమేణా దేశాయ్‌గారి సామర్థ్యం ఇనుమడించడంతో 1958లో చాచా నెహ్రూ ఆర్థిక మంత్రిగా ప్రమోట్ చేశారు. ముఖ్యంగా ఆ శాఖకు మొరార్జీ మంత్రిగా దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం గావించారని పేరు పొందారు. అదీగాక దేశరక్షణ వ్యయాన్ని పెంచడంతో బాటు, దేశాయ్ అనవసర ప్రభుత్వ ఖర్చుల్ని నియంత్రించడంతో మరింత పబ్లిక్ ఫిగర్‌గా వెలుగులోకొచ్చారు.

ఇదిలా ఉండగా ఆనాటి కాంగ్రెస్ ప్రధాన నాయకుడైన కామరాజ్ నాడార్ 'కామరాజ్ పథకం' అంటూ ఓ పథకాన్ని ప్రవేశపెట్టారు. అదేమంటే ప్రభుత్వ పదవుల్లో పదేళ్ళు పనిచేసిన వారు పదవుల్ని విడిచిపెట్టాలి. పార్టీ కార్యక్రమాల్లో నిమగ్నులు కావాలన్నది దాని పిండితార్థం. ఆ కారణాన మొరార్జీ దేశాయ్ తాను 1963లో తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయనతో బాటు మరికొందరు కాంగ్రెస్ పెద్దలు జగజ్జీవన్‌రామ్, డా॥ కె.ఎల్. శ్రీమాలి, బెజవాడ గోపాలరెడ్డి లాంటివారు చేస్తున్న పదవులకు రాజీనామాల పేరుతో పదవీ త్యాగం చేయాల్సి వచ్చింది.

ఈ సందర్భంగా ఆయనకు సంబంధించిన ఒక ముచ్చట ఇక్కడ చెప్పుకోవాల్సి ఉన్నది. దేశాయ్ గార్కి ఎల్లుండి వివాహం అనగా ఆయన తండ్రి రాంచోడ్జీ దేశాయ్ చనిపోయారు. అయినా మొరార్జీ వివాహ కార్యక్రమం ఆపలేదు. యధావిధిగా తండ్రి గతించిన మూడోనాడే మిగిలిన కార్యక్రమాలు జరిపాం అని ఆయనే చెప్పడాన్ని బట్టి దేశాయ్‌లో గల ప్రత్యేకత ఎవరికైనా అర్థం కాక మానదు.

1964వ సంవత్సరంలో ఊహించని మలుపు భారతదేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ పరంగా జరిగింది. అందుకు ముఖ్య కారణం జవహర్‌లాల్ నెహ్రూ చనిపోవడం. అప్పుడు ప్రధాని పదవి ఎవరు చేపట్టాలి అనే మీమాంస బయల్దేరింది. కామరాజ్‌నాడార్ ఏకాభిప్రాయ సాధన పేరుతో పార్టీకి సంబంధించిన ఎక్కువ మంది పెద్దలతో ఆలోచన చేసి లాల్ బహదూర్ శాస్త్రిని ప్రధానిగా నియమిస్తూ ప్రకటన చేశారు. క్రమశిక్షణకు మారుపేరైన మొరార్జీదేశాయ్ వారి నిర్ణయాన్ని ఆనందంగా స్వీకరించారు.

కేవలం రెండేళ్లలో అంటే, 1966లో లాల్ బహదూర్ శాస్త్రి ఆకస్మికంగా మరణించారు. అప్పుడు నెహ్రూ కుమార్తె ఇందిరాగాంధీ, మొరార్జీదేశాయ్ ప్రధానమంత్రి రేస్‌లో పోటీపడిన సంగతి ఆనాటి పెద్దలకు గుర్తులో ఉన్న విషయమే. ఎట్టకేలకు ఇందిరా ప్రియదర్శినిని ప్రధానిగా చేయడం జరిగింది. అనవసరంగా ఏ పదవీ లేకుండా మొరార్జీ దేశాయ్‌ని ఖాళీగా ఉంచడం దేనికని ఆనాటి కాంగ్రెస్ పెద్దలైన కామరాజ్ వంటివారు ఉపప్రధాని పదవిని సృష్టించి ఆర్థిక శాఖ చూసుకొమ్మని దాని భారం మొరార్జీపై పెట్టారు.

దేశ మహిళా ప్రధానియైన ఇందిర హయాంలో మొరార్జీ ఆర్థిక శాఖ మంత్రిగా బ్యాంకులను జాతీయం చేయడం, మాజీ సంస్థానాధీశుల భరణం రద్దు చేయడం నిర్ణయం విషయంలో ఆయనను ఆమె ఆర్థిక శాఖ నుండి తప్పించారు. అందుకు కోపగించిన దేశాయ్ తన ఉప ప్రధాని పదవికి వెంటనే రాజీనామా చేసి, ప్రభుత్వం నుండి తప్పుకున్నారు.

1975లో భారతదేశంలో ఎమర్జెన్సీ విధించింది పాలక పక్షం. ప్రతిపక్ష నాయకులందర్నీ అరెస్టు చేయించి జైల్లో పెట్టించారు. వారితో బాటు మొరార్జీదేశాయ్‌నీ జైలుపాలు చేశారు. ఆనాడు జైలు పాలైన పెద్దలు కొందరు అనగా లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్, ఆచార్య కృపలానీ ప్రభుతులతో బాటు దేశాయ్ కూడా మంతనాలు సాగించారు.

తక్షణం కాంగ్రెసేతర శక్తులను సమీకరించి జనతా పార్టీ ఆవిర్భావానికి నాంది పలికారు. ఈ జనతాపార్టీలో పాత కాంగ్రెస్, జనసంఘ్ పార్టీవారు, స్వతంత్రపార్టీ, సోషలిస్ట్ పార్టీ, ప్రజాస్వామ్య కాంగ్రెస్ భాగస్వామ్య పక్షాలుగా చేరాయి.

నాటినుండీ ఇందిరా కాంగ్రెస్ అని మరొకటి తయారయ్యిందని మనం గ్రహించాల్సి ఉంది. 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో జనతాపార్టీ అఖండ విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రభుత్వం కుప్పకూలింది. అన్ని పార్టీలు కలిసిన 'పంచకూళ కషాయం' లాంటి జనతాపార్టీ ప్రభుత్వం కూడా ఎక్కువకాలం అధికారం నిలబెట్టుకోలేకపోయింది. అందుకు కారణం బహునాయకత్వం.

1979 నాటికే అది పతనమైపోయింది. దేశాయ్ ప్రధాని పదవిలో ఉండగా, అది అలా జరగడం దురదృష్టమే ! దేశాయ్‌తో ఇందిరకు వైషమ్యాలు నానాటికీ పెరిగాయే గాని తరగలేదు. తిరిగి ఇందిర ప్రధాని పదవి దక్కించుకున్నా మధ్యలోనే ఆమె హత్యకు గురయ్యారు. తర్వాత జరిగిన పరిణామాలు చాలానే ఉన్నాయి.

1995 ఏప్రిల్ 10న మొరార్జీ దేశాయ్ చనిపోయారు. పెద్ద వింత, కొసమెరుపు ఏమిటంటే, మనకు పొరుగు దేశం, శత్రుదేశమైన పాకిస్థాన్ దేశాయ్‌కి 'నిషాన్-ఎ-పాకిస్థాన్' అనే ఆ దేశపు అత్యున్నత అవార్డు ఇచ్చి సత్కరించడం.

*– డా॥ మంతెన సూర్యనారాయణ రాజు*



Sthanka_BW June.indd 22 30/05/11 5:41 PM

"**మా**కు ఆటలాడే అదృష్టం లేదు - కనీసం వర్షాకాలంలో తరగతి గదికి వెళ్ళే 'దారి' దొరకడం లేదు  ఎలా అని మొన్నటి దాకా అనుకున్న మా బడికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన 'పాఠశాలల మైదానం అభివృద్ధి' పనుల వల్ల ఈ రోజు మేము మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడాంశాలలో పాల్గొని, బహుమతులు పొందే స్థాయికి ఎదిగాం."

ఇదంతా 'ఉపాధి హామీ' మహత్యం అంటున్నారు, మన్నెంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు బోయిని అనూష, అన్నాడి రేణుక, అక్కపల్లి వినిత, పైడిపాల సంజయ్, సుదగోని సదయ్య మొదలైనవారు. వీరు ఈ రోజు మండల, జిల్లా స్థాయి 'పైకా''తదితర పోటీలలో, కొందరు 'చపక్‌తప్రా' రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటున్నారు.

చాలా కాలం క్రింద నిర్మించిన పాఠశాల భవనంలో సరియైన వసతులు లేకపోవడం వల్ల, సుమారు 13 లక్షల అంచనాతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులలో 3 సంవత్సరాల నుండి విద్యా బోధన చేస్తున్నారు. కాని సుమారు 2.75 మీటర్ల లోతులో 900 చ.మీ. వైశాల్యంలో ఉన్న పెద్దబొంద వల్ల ఈ గదుల లోనికి వెళ్ళి రావడానికి, వర్షాకాలంలో మరీ కష్టంగా వెళ్ళలేక వెళ్ళడం జరుగుతుంది.

# కల నిజమైంది- గ్రౌండ్ దొరికింది

'ఉపాధి హామీ పథకంలో' ఇలాంటి సంస్థల (మైదానం) అభివృద్ధి పనులు చేపట్టాలనే ఆదేశాలకు అనుగుణంగా  స్థానిక శాసన సభ్యులు శ్రీ ఆరెపెల్లి మోహన్ చొరవతో జిల్లాలో మొట్టమొదటి సారిగా ఈ పనిని ప్రతిపాదించి మంజూరు పొందడం జరిగింది. తిమ్మాపూర్ మండల అధ్యక్షులు శ్రీమతి సుధగోని శారద  సూచనల మేరకు డిసెంబర్ 2, 2009 స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే మొట్టమొదటి సారి ప్రారంభించడం జరిగింది. దీనివల్ల 255 మంది కూలీలకు 2923 పనిదినాలు కల్పించారు.

ఉపాధిహామీలో ఈ పనిని ఇంత బాగా చేయవచ్చు అని అందరు మెచ్చుకునేలా చేసిన విద్యార్థులు,ఉపాధ్యాయులు, గ్రామస్థులను మండల ప్రజలే కాదు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా ప్రశంసించారు.

స్థానిక మానకొండూర్ శాసనసభ్యులు శ్రీ ఆరెపెల్లి మోహన్, పథక సంచాలకులు, జిల్లా నీటి నిర్వహణ సంస్థ, శ్రీ బి. నవీన్‌కుమార్, కరీంనగర్., శ్రీమతి సుధగోని శారద, అధ్యక్షులు, మండల ప్రజాపరిషత్, తిమ్మాపూర్, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులు. తిమ్మాపూర్, స్థానిక సర్పంచ్ శ్రీమతి శానగొండ కొమురమ్మ, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు ఈ ప్రారంభ కార్యక్రమాలలో పాల్గొన్నారు.







కొద్ది కాలంలో పనులు పూర్తయిన తర్వాత శాసనసభ్యులు, జిల్లా అధికారులు ఈ పనిని సందర్శించి అభినందనలు తెలియచేస్తూ జిల్లాలో మిగతా ప్రాంతాలలో కూడా ఇలాంటి పనులు చేపట్టాలని సూచించారు.

దీనిలో రేణికుండ, పోరండ్ల, రామక్రిష్ణకాలనీ, జూగూండ్ల, లక్ష్మిదేవిపల్లి తదితర గ్రామాలలో కూడా ప్రభుత్వ సంస్థల అభివృద్ధి పనులు అనుబంధంలో ప్రకారం చేపట్టారు.

*- సి. హెచ్.శోభారాణి, అదనపు ప్రోగ్రాం అధికారి*

*- కె.కిషన్ స్వామి, ప్రోగ్రాం అధికారి /మండల పరిషత్ అధికారి*

*తిమ్మాపూర్, కరీంనగర్ జిల్లా*



Sthanka_Junecolo.indd 24 31/05/11 2:23 PM

**కో**నసీమలోని ఓ అందమైన పల్లెటూరు. ఆ పల్లెటూర్లో బుచ్చిబాబు ఏకైక 'లేడీస్ టైలర్'. తన దుకాణం ముందు 'బుచ్చిబాబు-లేడీస్ టైలర్' అనే కాక 'ఒకేఒక్కడు' అన్న పదం కూడా ట్యాగ్‌లైన్‌లా రాయించుకున్నాడు, ఊళ్ళో తనొక్కడే కాబట్టి.

ఐదోతరగతితోనే చదువాపేసిన బుచ్చిబాబుకి ఇరవై ఆరేళ్ళు. అతనికి సిగరెట్టు తాగడం, మందు కొట్టడం లాంటి దురలవాట్లేం లేవు గానీ ఒకే ఒక్క బలహీనత ఉంది. అదేంటో ఓ సన్నివేశంలో చూద్దాం.

# సీతాకోక చిలుక

గుమ్మడి రవీంద్రనాథ్




తన కుట్టుమిషన్ మీద తనే స్వయంగా రూపకల్పన చేసిన ఓ ప్రత్యేక వస్త్రాన్ని భార్య నీలమ్మకిచ్చి "ఏసుకోయే" అన్నాడు బుచ్చిబాబు ఓ రాత్రి పదిగంటలప్పుడు.

నీలమ్మ ఆ కొత్తవస్త్రం వంక తేరిపార చూసి, "ఏంటిది? ఇట్టా ఉంది?" అంది.

"ఇదొక ప్యాసన్ లేవే. ముందేసుకోసెబ్తా. దీన్లో నువ్వెంత అందంగా ఉంటావో సూడాలి" అన్నాడు బుచ్చిబాబు ఆత్రంగా.

అటు పరికిణీలానూ, ఇటు నైటీలానూ లేని ఆ కొత్తరకం వస్త్రాన్ని బెరుకు బెరుకుగానే ధరించింది నీలమ్మ. అది చూడగానే బుచ్చి కళ్ళు చిచ్చుబుడ్లలా వెలిగాయి. "అహా, అదిరిపోయిందే నీలమ్మా నీకిది. ఈ రోయిన్లా ఉన్నావ్" అంటూ ఉద్వేగభరితంగా అరిచాడు బుచ్చిబాబు.

భర్త ఉద్వేగభరిత అరుపుల మీద అంతగా నమ్మకం లేని నీలమ్మ అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంది. అంతే! దెయ్యాల సినిమాలో బీభత్స దృశ్యాన్ని చూసినదానిలా 'కెవ్వ'న అరిచింది. అటు పిమ్మట, 'ఛీ' అని కూడా అదే పిచ్‌లో అరిచింది. 'కెవ్వ' భయంతానూ, 'ఛీ' సిగ్గుతానూ అని బుచ్చికి అవగతమవ్వలేదు రెండు నిమిషాల్లో, ఆ విచిత్ర వస్త్రాన్ని విప్పేసి, చీర చుట్టుకుంది నీలమ్మ.

"ఏంటి మావా అట్టా కుట్టావ్ దాన్ని అసయ్యంగా?" అంది భర్తతో.

"మొన్నా మధ్య పట్నంలో సూసిన సినిమాలో ఈరోయిన్ ఇలాంటిదే ఏసుకుందే. రెండ్రోజులు కష్టపడి కుట్టా దీన్ని మన మిసను మీద. నువ్వు రెండు నిమిసాలు కూడా ఏసుకోలేదు" దిగులుపడిపోతూ, నిరుత్సాహంగా చెప్పాడు బుచ్చిబాబు

"పుల్ని సూసి నక్కవాత లేసుకున్నట్టు ఏంటి మావా ఇది. ఇలాంటి అసయ్యమైన డ్రెస్సు నేనెలాగేసుకుంటాననుకున్నావ్?"

"అందరి ముందూ అక్కర్లేదే నా కోసమే, ఇట్టా మనిద్దరమున్నప్పుడే కదా?"

"ఛీ..ఛీ..! నీకీ సిన్మాపిచ్చెపుడు వొదుల్తుందో ఏమో" తలకొట్టుకుంది నీలమ్మ.

అవును. బుచ్చిబాబుకి సినిమాలంటే మహాపిచ్చి. పిచ్చంటే సినిమాలు ఎక్కువగా చూడ్డమే కాదు. సినిమాల్లోలా చేసెయ్యాలనుకుంటాడు. అదీ అతని బలహీనత. హీరో వీరోచితంగా పోరాడే సన్నివేశాలు చూస్తే, తనకూ అలా ఎవర్నైనా డిష్యుం.. డిష్యుం అంటూ తన్నేయ బుద్ధిస్తుంది. అలరించే డాన్సులూ, స్టెప్పులూ చూస్తే తనకూ అలా డాన్సులు చేయాలనిపిస్తుంది. సినిమాలు అతని మనసు మీద చాలా ప్రభావం చూపెట్టాయి. ఒక్కటి మాత్రం వాస్తవం. బుచ్చిబాబు డాన్సులు బాగానే చేస్తాడు. పాటల్లో స్టెప్పులు ఒక్కసారి చూస్తే అది అచ్చుగుద్దినట్టు అలాగే తను చేసేయగలడు! హీరోల కదలికల్ని, హావభావాల్ని బాగా అనుకరిస్తాడు కూడా!

* * * * *

**ద్వితీయ బహుమతి పొందిన హాస్య కథ**

**ఒ**కరోజు బుచ్చిబాబు స్నేహితుడు కామేశ్వర్రావు 'రేయ్, బుచ్చీ, నీలాగా సిన్మా హీర్నోల్ని అనుకరిస్తూ డాన్సులేసే వాళ్ళ



Sthanka_Junecolo.indd 26 31/05/11 2:24 PM

కోసం టీవీలో ఒక రియాల్టీ షో వస్తోందిరా. నువ్ ట్రై చెయ్యచ్చు గదరా. బాగానే చేస్తావ్‌గా?" అని చెప్పాడు.

"నేనా? టీవీలోనా? నన్నెవడు సూత్తాడ్రా" అన్నాడు బుచ్చిబాబు

"నీకేంట్రా, నువ్వు బాగానే సేస్తావ్‌గా. ఒకసారి ట్రై చేస్తే ఏమవుద్ది?"

అప్పుడు బుచ్చిబాబు కాస్త ఆలోచనలో పడ్డాడు. "సరేరా? దానికి సంబంధించిన ఇవరాలు కనుక్కో! సూద్దాం" అన్నాడు బుచ్చిబాబు.

కామేశ్వరావు చెబ్తున్న ఆ టీవీ కార్యక్రమం పేరు 'డూపర్‌హీరోస్'!

* * * * *

ఒక శుభోదయాన, తను కూడబెట్టుకున్న డబ్బూ, మరొకొంత అప్పు చేసి హైదరాబాద్ మహానగరాని కొచ్చాడు బుచ్చిబాబు. ఎక్కువ కష్టపడకుండానే, డూపర్ హీరోస్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించింది అతనికి.

కొత్తగా వచ్చిన ఒక పెద్దహీరో సినిమాలోని హిట్‌సాంగ్‌కి వేదికమీద డాన్సు చేశాడు బుచ్చిబాబు. మొదటిసారి అంతమంది ముందూ, టీవీ కెమెరాల సాక్షిగా! బుచ్చిబాబు నృత్యం చేయడం అవ్వగానే కరతాళధ్వనులు హోరు. ఆ కార్యక్రమానికి యాంకర్‌గా చేస్తున్న లిపి అనే యువతి, వేదిక మీదికి వచ్చి, "బుచ్చిబాబ్‌గారూ! వన్డ్రఫుల్! మీ పెర్‌ఫార్మెన్స్ అద్దిరింధి. ఆద్భుత్తమ్..." అంటూ ఆగకుండా ఐదునిమిషాలు మెచ్చేసుకుంది, విచిత్ర ఉచ్చారణతో, అక్కర్లేని చోట ఒత్తులూ, అనవసరమైన చోట దీర్ఘాలూ ఇస్తూ - 'లిపి' అన్న పేరు పెట్టుకున్నందుకైనా పదాలను సరిగా పలికితే బావుండును కదా' అనిపించేలా!

ఆ అమ్మాయి వాడిన ఆంగ్లపదాలకు అర్థాలు తెలియకున్నా, అవి పొగడ్తలే అని గ్రహించిన బుచ్చిబాబు తెగ సిగ్గుపడిపోయాడు.

"ఇప్పుడు మన జడ్జెస్‌ని అడుగుదాం ఎలా ఉందో?" అంటూ న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్న ముగ్గుర్లో ఒకరిని అడిగింది. సదరు న్యాయనిర్ణేతగారు కూడా ఒకప్పటి సినిమా నటుడే. కాకపోతే ఆయన డాన్స్ చేస్తే, ప్రేక్షకులు హాయిగా రిలాక్స్ ఐపోయేవారు - థియేటర్ బయటకెళ్ళి, ఏ సిగరెట్టో కూల్‌డ్రింకో తాగుతూ, అంత చూడముచ్చటగా ఉండేది మరి ఆయన నృత్యం. అయినా కూడా, ఇక్కడ ఈ షోకి న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తూ తన అమోఘమైన నృత్యానుభవాన్ని పోటీదారులతో పంచుకుంటున్నాడు.

"బుచ్చిబాబుగారూ, అదరగొట్టారండీ.." అంటూ మెచ్చుకున్నాడాయన.

"తేంక్యూసార్" వినయంగా చెప్పాడు బుచ్చిబాబు

"చాలా బావుంది. ఫెంటాస్టిక్! మూవ్‌మెంట్లూ ఫోజులూ అన్నీ ఒరిజన్ హీరోలానే ఉన్నాయి. నాకు చాలా నచ్చింది. బాగా ఎంజాయ్ చేశాను. గ్రేట్! మీలో హీరో కళ ఉట్టిపడ్తోంది. మీరూ ఏదో ఒకరోజు హీరో అయిపోతారల్లే ఉంది. సినిమాల్లో ప్రయత్నించండి" అన్నాడు.

"వేరే ప్రయత్నం ఎందుకు సార్, మన ఈ ప్రోగ్రామ్ చూసిన ఏ దర్శకుడో, ఇప్పటికే బుచ్చిబాబుగారి కోసం అన్వేషణ ప్రారంభించే ఉంటారు" మధ్యలో గబుక్కున యాంకరమ్మ అందుకుంది. యధావిధిగా ఒత్తుల విషయంలో తగు జాగ్రత్త తీసుకుంటూ.

దానికా న్యాయనిర్ణేత గట్టిగా నవ్వేస్తూ, "నిజమే లిపీ! యు ఆర్ రైట్!" అన్నాడు. ఆఖరికి ఆమె విశృంఖలంగా వాడిపారేసిన ఒత్తుల్ని కూడా 'రైటే' అన్నట్టు! ఖర్చేమీలేదనో ఏమో, పాపమాయన చాలా ఉదారంగా పొగడ్తల వర్షం కురిపించేశాడు, మన బుచ్చిబాబు మీద!

పాపం బుచ్చిబాబు ఆ మాటలన్నింటినీ యధాతథంగా స్వీకరించేస్తూ పొంగిపోయాడు. అప్పుడు గనుక ఎవరైనా వెళ్ళి టేపుతో అతని ఛాతీ కొలిస్తే, ఖచ్చితంగా ఓ ఇరవై ముప్పై అంగుళాలు ఎక్కువ కనపడేది కొలత!

మిగతా ఇద్దరు న్యాయనిర్ణేతలకు కూడా మాంచి 'పోటీతత్వం' ఉంది, నువ్వేనా పొగిడేది మేమూ ఒక పట్టుపడ్తాం అన్నట్టు, "బుచ్చిబాబూ! హేట్సాఫ్! అ.స్స.లు. మాటల్లేవ్ మరీ ఎక్కువ చెబ్తే పొగిడినట్టుంటుంది. సింప్లీ సూపర్బ్! ఫ్యాబ్యులస్! మైండ్ బ్లోయింగ్" అంటూ చెడామడా పొగిడి పడేసారు.

ఆ కొత్తకొత్త పదాల శబ్దానికి ఝడుసుకున్నాడు బుచ్చిబాబు. కానీ వాటిలోని 'పొగడ్త' మాత్రం నరాల్లోకి ఎక్కేసింది. ఈసారి కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే మనవాడి కాళ్ళు స్టేజిమీద ఆనకుండా, గాలిలో లేచినట్టు స్పష్టంగా చూడొచ్చు! "గాల్లో తేలినట్టుందే.." అన్న ఓ హీరో హిట్‌సాంగు అక్కడ నిరూపణౌతోంది, గురుత్వాకర్షణశక్తి సూత్రాల్ని చీల్చి చెండాడ్తూ!!

* * * * *

'పొగడ్తల్ని చప్పరించి ఊసేయాలే తప్ప, నమిలి మింగేయకూడదన్న లోకోక్తి పాపం మన పల్లెటూరి లేడీస్‌టైలర్‌కి తెలీదు. కాబట్టి, మాదకద్రవ్యాల్ని మించి, ఆ పొగడ్తల మత్తు తలకెక్కేసింది. తను నిజంగా సినిమా నటుడైపోయినట్టు కలలు.

కలలు కనడానికైతే కళ్ళు మూసుకోవాలి - ఆ కలల్ని సాకారం చేసుకోడానికి మాత్రం కళ్ళు తెరవాలి అన్న టైపులో వెన్వెంటనే కార్యోన్ముఖుడయ్యాడు. గ్రామంలో తన పేరనున్న అరెకరం పొలాన్ని బేరం పెట్టేశాడు! ఆ డబ్బుతో మళ్ళీ హైదరాబాద్ వచ్చాడు.

సినిమా అవకాశాలు కోసం పిచ్చిగా ప్రయత్నాలు మొదలుపెట్టాడు. బుచ్చిబాబుకి ఇంగ్లీషులో మాట్లాడ్డం రాదు. సరైన భాషా లేదు. పల్లెలో పుట్టిపెరిగిన అమాయకత్వమే తప్ప లౌక్యమూ తెలీదు. అందుకే బుచ్చిబాబు అమాయకత్వాన్ని చూసి నవ్వుకున్నారు అందరూ.

"టీవీ రియాల్టీషోల్లో పొగడ్తల్నే ఆధారంగా చేసుకుని ఎవ్వరూ అవకాశివ్వరు బాబూ" అంటూ రమణమూర్తి అనే అతను మొదటిసారి, బుచ్చిబాబుకి వాస్తవాన్ని చెప్పాడు. బుచ్చిబాబులానే సినిమా పిచ్చితో, నగరానికొచ్చి ఉన్నదంతా ఊడ్చిపెట్టుకున్నా తర్వాత పూర్తిగా మారిపోయిన మాజీ సినిమా పిచ్చోడు - ఆ రమణమూర్తి.

"ఊర్లో పొలం అమ్మితెచ్చిన డబ్బంతా అయ్యిందా ఇంకేమన్నా మిగిలిందా?" అడిగాడు రమణమూర్తి.

"రెండొందలున్నాయ్" చెప్పాడు బుచ్చిబాబు.

"వాటితో, రైలు ఎక్కి మీ ఊరెళ్ళిపోయి, సుబ్బరంగా టైలరింగ్ చూసుకో. మీ ఆవిడతో సర్దాగా కబుర్లు చెప్పుకో. ఆనందంగా జీవించు. ఇక్కడిదంతా ఓ మాయ"



Sthanka_Junecolo.indd 27 31/05/11 2:24 PM

"నాకింక సినిమా ఛాన్సులు రావంటారా ఐతే"

"ఇదెలాంటిదంటే, స్కూటర్ అద్దం మీదా, 'ఇందులో కనిపించే వస్తువులు, కనిపిస్తున్న దానికంటే ఇంకా దగ్గరగా ఉండును' అని రాసుంటుంది. ఇక్కడి పరిస్థితి - అందుకు విరుద్ధం. సినిమా అవకాశాలన్నవి- మనకు కనిపిస్తున్న దాని కంటే చాలా దూరంగా ఉంటాయి. అసలొక్కొక్కసారి కనిపిస్తున్నట్టు భ్రమింప చేస్తాయి కూడా" గీతాబోధ చేస్తున్న కృష్ణుడిలా చెప్పాడు రమణమూర్తి.

"అలాగని మనమసలు ట్రైసెయ్యకపోతే ఎట్టాగండీ?" అడిగాడు బుచ్చి.

"ప్రయత్నం చెయ్యాలి నిజమే. కానీ దానికి ఓ పరిమితి ఉండాలి. ఆలోచన ఉండాలి. తెరమీద కనపడాలన్న వెర్రితో విచక్షణ కోల్పోకూడదు. సాధ్యాసాధ్యాలు చూడాలి. నిండా మునిగేవరకూ ప్రయత్నం కొనసాగకూడదు"

"అట్టాగంటారా?"

"నిజంగా మనకు యోగ్యత ఉంటే, ఆ దేవుని కృప ఉంటే అవకాశాలు అవే మన చెంతకు వస్తాయి. మనం ఎంత ఆరాటపడినా లాభం లేదు!"

ఈ మాటలు బాగా ఎక్కాయి బుచ్చిబాబు బుర్రలోకి.

"తవరింకా ప్రయత్నాలు సేత్తున్నారా మానేసారా?" అడిగాడు బుచ్చిబాబు.

"నీలా, నాలా పిచ్చి వ్యామోహంతో, జీవితాలు పాడుచేసుకనే వాళ్ళకు కౌన్సిలింగ్ చేసే ప్రయత్నం చేస్తున్నాను"

"సైక్లింగా? అంటే ఏంటి సారూ?"

"సైక్లింగ్ కాదయ్యా, కౌన్సిలింగ్! అంటే ఏదో నాలుగు మంచి మాటలు చెప్పి వాళ్ళను సరైన దార్లోపెడ్తాను"

బుచ్చిబాబు ఆలోచనలో పడ్డాడు.

"చూడు బుచ్చిబాబూ! సీతాకోకచిలుకను పట్టుకోవాలని దాని వెంటపడి పరిగెడ్తే ఎంతకూ దొరకదు. కానీ చిత్రంగా, ఒక్కోసారి, మనం నిశ్చలంగా ఓ చోట నిల్చుని ఉంటే, అదే వచ్చి మన మీద వాలుతుందా!" అన్నాడు రమణమూర్తి.

ఈసారి పాఠం పనిచేసింది. బుచ్చిబాబు నగరం వదిలి పల్లెకు వచ్చేశాడు. తిరిగి తన టైలరింగ్ వృత్తిలో పడిపోయాడు!!

* * * * *

పతాక సన్నివేశం.

ఒకరోజు -

గోదావరి అందాల్నీ, పల్లెల పచ్చదనాల్నీ తన సినిమాల్లో ఎంతో అందంగా చూపించే వంశీకృష్ణ అనే ఒక దర్శకుడు ఆ ఊర్లో షూటింగ్ చేయడానికొచ్చారు చిత్ర యూనిట్ బృందంతో.

ఊరు ఊరంతా షూటింగ్ జరిగే చోటుకు తరలివెళ్ళింది. మన బుచ్చిబాబు మాత్రం తన మిషన్ మీద జాకెట్టుగుడ్డకు హుక్కులు కుడుతూ తన పనిలో తనున్నాడు.

హీరోయిన్ ధరించవలసిన దుస్తుల కొక చిన్ని మార్పు చేయవలసి వచ్చింది అని వంశీకృష్ణ దృష్టికి తీసుకువచ్చాడు కో డైరెక్టర్.

"ఇక్కడెవరైనా టైలరున్నాడేమో కనుక్కో చిన్న పనేగా?" అన్నాడు వంశీకృష్ణ.

"కనుకున్నాను సార్ 'ఒకే ఒక్కడున్నా'డటండీ. లేడీస్ టైలర్. పేరు బుచ్చిబాబు"

"ఇక్కడికొచ్చిన ఈ జనంలో ఉన్నాడా?"

"లేదు సార్. రాడట కూడా"

వంశీకృష్ణ ఆశ్చర్యపోతూ చూస్తుంటే, ఆ ఊరికుర్రాడొకరు బుచ్చిబాబు ఫ్లాష్‌బ్యాక్ వివరించి చెప్పాడు, నిర్మాతకి కథను వినిపించే రచయిత లెవల్లో. అంతా విన్న వంశీకృష్ణకెందుకే బుచ్చిబాబుని చూడాల నిపించింది!!

* * * * *

అలా ఆ సందర్భంలో, వంశీకృష్ణ దృష్టిలో పడ్డాడు బుచ్చిబాబు. బుచ్చిబాబును చూడగానే, ఒక ఆలోచన వచ్చేసింది స్వతహాగా రచయిత కూడా అయిన ఆ డైరెక్టరుకి. అప్పటికప్పుడు ఒక పాత్రను సృష్టించి కథలో చొప్పించాడు. బుచ్చిబాబు సొంత అనుభవాల్ని ఆధారంగా చేసుకుని చిన్ని ట్రాక్ అల్లేసి స్క్రిప్ట్‌లో కలిపేశాడు. బుచ్చిబాబుకి చెప్పి, "ఈ పాత్ర నువ్వే చేస్తున్నావ్?" అని చెప్పాడు వంశీకృష్ణ. బుచ్చిబాబు నమ్మలేదు.

'. . . సినిమా అవకాశాలన్నవి మనకు కనిపిస్తున్న దానికంటే చాలా దూరంగా ఉంటాయి. అసలొక్కొక్కసారి కనిపిస్తున్నట్టు భ్రమింప చేస్తాయి' రమణమూర్తి మాటలు మర్చిపోలేదు బుచ్చిబాబు.

"నిజమేనా సారూ?" అనడిగాడు అనుమానంగానే.

"నిజం బుచ్చిబాబూ, మీరు నా సినిమాలో వేషం వేస్తున్నారు" మళ్ళొకసారి నొక్కి చెప్పాడు వంశీకృష్ణ.

"నిజంగా నిజమేనంటారా సార్. నమ్మమంటారా?"

"ఇదిగో ఈ కెమెరామీదొట్టు. స్క్రిప్ట్‌లో నేను చేసిన మార్పుల మీదొట్టు" అనేసరికి అప్పటికిగానీ నమ్మలేదు బుచ్చిబాబు.

పెద్దగా మేకప్ కూడా ఏమీ వేయకుండా నిజజీవితంలో ఎలా ఉంటాడో అలానే నటింపచేశాడు డైరెక్టర్ వంశీకృష్ణ - బుచ్చిబాబుతో. ఆ వేషాన్ని బుచ్చిబాబు బాగా పోషించాడు. సినిమా విడుదలైంది.

బుచ్చిబాబు పాత్రకు మంచి ప్రశంసలందాయి. తెలుగు తెరకు కొత్త హాస్య నటుడు దొరికాడని పత్రికల్లో రాసారు.

'సీతాకోకచిలుకను పట్టుకోవాలని దాని వెంటపడి పరిగెడ్తే ఎంతకూ దొరకదా. కానీ చిత్రంగా, ఒక్కోసారి మనం నిశ్చలంగా ఓ చోట నిల్చుని ఉంటే అదే వచ్చి మన మీద వాలుతుంది'

రమణమూర్తి, 'సైక్లింగ్'లో చెప్పిన మాటలవి! ఛ.. ఛ.. సైక్లింగ్ కాదు.. కౌన్సిలింగ్...

ఆ తర్వాత అనుకోకుండానే మరికొన్ని సీతాకోకచిలుకలు బుచ్చిబాబుపై వాలాయి!! ☆



Sthanka_Junecolo.indd 28 31/05/11 2:24 PM

# మన ఆరోగ్యంలో ఖనిజ లవణాల పాత్ర

**మన శరీరంలో అధిక సంఖ్యలో స్థూల సూక్ష్మ ఖనిజ పోషకాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా శరీరంలోని ద్రవాలు, కణాలలో ఉండే కార్బన్ సంబంధం కాని మూలకాలు. సోడియం, పొటాషియం, కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం, సల్ఫర్ శరీరానికి కావలసిన ముఖ్యమైన స్థూల ఖనిజాలు. ఇక ఇనుము, జింక్, రాగి, సెలీనియం, మెలబ్డినం, ఫ్లోరైడ్, కోబాల్ట్, క్రోమియం, అయోడిన్‌లు సూక్ష్మ ఖనిజ పోషక పదార్థాలు.**

కొన్ని ఖనిజ లవణాలు శరీర నిర్మాణంలో భాగం కాగా, మరికొన్ని కెటలిటిక్ ఎండెంట్లు లేదా ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి. ఎముకలు, అస్థిపంజరం వంటి ముఖ్యమైన అవయవాల తయారీలో కాల్షియం, మెగ్నిషియం, ఫాస్ఫరస్‌లు పాలు పంచుకుంటాయి. రక్తం తయారీలో ఇనుము ప్రముఖ పాత్ర వహిస్తుంది. జింక్, మెగ్నీషియం, కాపర్, మాంగనీస్ వంటి ఖనిజాలు శరీర నిర్మాణంలోను లేదా ఎంజైమ్‌లను ప్రేరేపితం చేసి అరుగుదల ప్రక్రియలో సహకారాన్ని అందిస్తాయి. అయోడిన్ హార్మోన్ థైరాక్సిన్‌లో ఒక భాగం. సోడియం, పొటాషియం వంటి ముఖ్యమైన మూలకాలు, శరీరంలోని కణాల లోపల బయట ఉన్న ద్రవాల ఆమ్ల క్షార సంతులనాన్ని కాపాడుతుంది. తద్వారా కణాలరూపాన్ని అంటే వాటి పరిమాణము, ఆకారాన్ని యధాతథంగా ఉంచుతుంది. మనిషి సగటున 20-30 గ్రాముల ఖనిజ లవణాలను కలిగిన సాడియం, పొటాషియం, మాంగనీస్, కాల్షియం, క్లోరైడ్, సల్ఫేట్ మరియు పాస్ఫరేట్‌లను విసర్జించడం ద్వారా కోల్పోతాడు. కాబట్టి వీటిని భర్తీ చేయడానికి సరిపడినంత సమతుల్యంతో కూడిన ఖనిజ లవణాలు కలిగిన ఆహారాన్ని స్వీకరించాలి. ఎదిగే శిశువులకు, పిల్లలకు కండరాల పెరుగుదలకు ఈ ఖనిజ పోషక పదార్థాలు చాలా అవసరం.



## కాల్షియం

బలమైన ఎముకల నిర్మాణానికి, దంతాల ధృడత్వానికి కాల్షియం దోహదం చేస్తుంది. అస్థిపంజరం నిర్మాణానికి, హృదయ కండరాలు పనిచేయడానికి, రక్తం గడ్డకట్టడానికి, ఇతర కార్యకలాపాలకు కాల్షియం అవసరం. కాల్షియం అత్యధికంగా ఉండే ఆహార పదార్థాలు పాలు, పాల విరుగు, పెరుగు వంటి పాల ఉత్పత్తులలో, పుదీనా, తోటకూర, ముల్లంగిఆకులు వంటి ఆకుకూరలతో, రాగులు, సజ్జలు వంటి చిరుధాన్యాలు, జామ, పియర్స్, సీతాఫలం వంటి పండ్లలో కాల్షియం ఉంటుంది.

బాల్య, కౌమార దశలలో గల పిల్లలకు కాల్షియం ప్రతి రోజు క్రమం తప్పకుండా తగినంతగా అందిస్తే ఎదుగుదలలో లోపం, ఎముకల బలహీనత లేకుండా చేయవచ్చు. ఒక వ్యక్తి పదిహేడేళ్ళు నిండే సరికి తన శరీరంలోని ఎముకలు తాను వయస్కుడైనప్పుడు కావలసిన పూర్తి కాల్షియం పరిమాణంలోని 91 శాతాన్ని సమకూర్చుకుంటాడు. 35 ఏళ్ళ వయస్సులో స్త్రీ, పురుషులిద్దరిలో ఎముకలు పూర్తిస్థాయి కాల్షియం సాంద్రతను కల్గి ఉంటాయి. 40 ఏళ్ల వచ్చేటప్పటికి ఎముకలలో గల కాల్షియం పరిమాణం తగ్గే ప్రమాదం ఉంది. దీనిని నివారించుకునేందుకు శరీరంలో కాల్షియం సాంద్రతను పెంచుకోవడం అవసరం, వరి, గోధుమ వంటి ప్రధాన ఆహార ధాన్యాలలో, ఆకుకూరలలో పైటేట్లు, ఆగ్జలేట్లు ఉండి కాల్షియంను బంధించడం వల్ల శోషణ ప్రక్రియలో అవరోధం ఏర్పడుతుంది. కాల్షియం లోపం వలన ఎముకలు గుల్లబడతాయి.

ఒక సంవత్సరం లోపల పిల్లలకు కాల్షియం 500 మిల్లీగ్రాములు, 10 సంవత్సరంలోపు పిల్లలకు 400 మిల్లీగ్రామలు. 10 నుండి 15 సంవత్సరం అబ్బాయిలకు, అమ్మాయిలకు 600 మిల్లీగ్రాములు, పెద్దలకు 400 మిల్లీగ్రాములు, గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు 1000మిల్లీ గ్రాములు కావాలి.

## భాస్వరం లేదా ఫాస్పరస్

శరీరంలో కాల్షియం తరువాత ముఖ్యమైనది ఫాస్ఫరస్. శరీరములోని కాల్షియం చాలా వరకు ఎముకలు, పళ్ళలో



StanikapalanaAditionJune2011_36to39and61to64Color_FSr.pmd 31/05/2011, 02:54 PM

కాల్షియం ఫాస్ఫేటుగా జమ అవుతుంది. కేంద్ర ఆమ్లాలలో న్యూక్లిక్ ఆసిడ్ అంశంగా, ఇతర పోషక పదార్థాలైనటువంటి పిండి పదార్థాలు, క్రొవ్వులు మొదలగుగాగల కణ నిర్మాణ జీవక్రియలో ఇతర ఎంజైముల ప్రక్రియ విధానంలో భాగంగా ఫాస్ఫరస్ ముఖ్యపాత్ర వహిస్తుంది. కాల్షియం వినియోగంలో ఫాస్ఫరస్‌కు దగ్గర అనుబంధం ఉంది. ఫాస్ఫరస్ లభించే ముఖ్యమైన వనరులు పాలు, ఆకుకూరలు, తృణధాన్యాలు, పప్పులు, గ్రుడ్లు, నూనె గింజలు.

**ఇనుము**

శరీరంలోని రక్తానికి ఎర్ర రంగునిచ్చే హీమోగ్లోబిన్ తయారు కావడానికి ఇనుము అవసరం. ఊపిరితిత్తుల నుండి శరీరంలోని వివిధ అవయవాలకు, కణాలకు ప్రాణవాయువును సరఫరా చేయడానికి హిమోగ్లోబిన్ అవసరం. చాలా వరకు శరీరం ఇనుమును పునర్వినియోగించుకుంటుంది. శరీరంలో ఉండే కొంత ఇనుము కాలేయం. ప్లీహములలో నిల్వ ఉంటుంది. శరీరాన్ని క్రమబద్ధీకరించే ప్రక్రియలో భాగంగా డ్యూయోడినమ్ జుజునమ్ పై భాగము లేదా చిన్న ప్రేవునందు శోషణమవుతుంది. ఇనుము లోపం ఏర్పడినపుడు శరీరం ఎక్కువ ఇనుమును శోషణం చేస్తుంది. అయినప్పటికినీ ఇనుమును తక్కువ మోతాదులో తీసుకున్న వ్యక్తికి రక్తహీనత ఏర్పడుతుంది.

మనం రోజు తీసుకునే తృణ ధాన్యాలలో 2-5 శాతం; చేపలు, మాంసంలో 10-20 శాతం ఇనుము శరీరానికి అందుతుంది లేదా అరుగుతోంది. దీనికి కారణం తృణ ధాన్యాలతో ఇమిడి ఉండే ఫైటేట్లు, పీచుపదార్థాలు, పోలిఫినాల్స్, కాల్షియం, ఫాస్ఫరస్‌లో గల అగ్జాలిక్ ఆమ్లం మొదలైనవి.

స్త్రీ,పురుష బేదాన్ని బట్టి, శరీరధార్మిక స్థితిని బట్టి ఆయా వ్యక్తులకు 1-3 మిల్లీ గ్రాముల ఇనుము అవసరమవుతుంది. కాని శరీర శోషణ పరిమితంగా ఉండడం వలన 10-25 పాళ్ళు ఎక్కువ ఇనుము తీసుకోవలసి వస్తుంది.

అయితే ఇనుము శోషణను ఎక్కువ చేయడానికి విటమిన్ సి లేదా అస్కార్బిక్ ఆమ్లం, లాక్టిక్ ఆమ్లం, సిట్రిక్ ఆమ్లం, టార్టారిక్ ఆమ్లం మరియు ఆల్కహాల్ దోహదపడతాయి.

**అయోడిన్**

పెరుగుదలకు అయోడిన్ ఎంతో ముఖ్యం. దీనివల్ల థైరాక్సిన్ అనే హార్మోన్ మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ప్రతి రోజు 100 - 150 మైక్రోగ్రాముల అయోడిన్ కావలసి ఉంటుంది. అయోడిన్ లోపం వల్ల థైరాక్సిన్ హార్మోను పనితనం దెబ్బ తింటుంది. ఫలితంగా మెదడు పనితీరు మందగించి మానసిక వైకల్యానికి కూడా దారి తీస్తుంది. ఐ.క్యూ తక్కువ కావడం, నేర్చుకోవడం పట్ల శ్రద్ధ లేకపోవడం లేదా నేర్చుకోవడంలో వెనుకబడి ఉండడం,శక్తిహీనంగా ఉండడం, పెరుగుదల ఆగిపోవడం, మూగతనం, చెవిటితనం, కొన్ని శరీరభాగాలు మొద్దుబారిపోయి పనిచేయకపోవడం, థైరాయిడ్ గ్రంధి పెరిగి గొంతువాపు వ్యాధికి దారి తీయడం. దీనినే గాయిటర్ అని కూడా అంటారు. ఇవన్నీ అయోడిన్ లోపం వల్ల కలిగే దుష్పరిణామాలు. జీవిత కాలం మొత్తానికి ఒక టీస్పూన్ అంత అయోడిన్ చాలు అన్న విషయం మనలో చాలా మందికి తెలియదు. కానీ అదే కొరవడి ఎందరో చిన్నప్పటి నుండి అనారోగ్యం పాలవుతున్నారు.

గర్భిణీ స్త్రీలలో అయోడిన్ లోపం ఉంటే పిండం పెరుగుదల, మానసికాభివృద్ధి పైన ప్రభావం చూపుతుంది. అంతేకాదు గర్భస్రావం కూడా కలుగవచ్చు. ఒకవేళ ప్రసవం అయినా మానసిక వైకల్యం గల శిశువు జన్మించవచ్చు.. శిశువు పూర్వదశలో అయోడిన్ లోపం ఉంటే శిశువు తరువాత దశలో మానసిక వైకల్యంకు గురికావచ్చు.

మనం తీసుకునే ఆవ జాతికి సంబంధించిన ఆహార పదార్థాలైనటు వంటి క్యాబేజి, కాలిఫ్లవర్ లాంటి వాటిలో ఉన్న గాయిట్రోజన్స్ అయోడిన్ వినియోగపడకుండా అడ్డుకుంటాయి, తద్వారా అయోడిన్ లోప సంబంధిత వ్యాధులకు గురికావచ్చు.

ఆహారం, నీటి ద్వారా 60-75 శాతం అయోడిన్ లభిస్తుంది. అయోడిన్ తగిన మోతాదులో తీసుకోవాలంటే ఇదిగో ఇది తీసుకోవాలి అని చెప్పడం కష్టం. నీళ్ళు, సముద్రంలో ఉండే "లీడ్స్"లో తప్ప దీన్ని మరోచోట ఉన్నట్లు చెప్పడం కూడా కష్టం. ఏ ఆహార ధాన్యమైనా అది పండిన నేల స్వభావాన్ననుసరించే దానిలో అయోడిన్ శాతం ఉంటుంది. అయోడిన్ లోపాన్ని గుర్తిస్తే, అయోడిన్ ఉన్న ఆహార పదార్థాలు తీసుకుంటే లోపాన్ని భర్తీ చేయవచ్చు. పచ్చి ఆహార పదార్థాలు, దినుసుల్లో ఉన్న అయోడిన్ సైతం వేడికి గురైనప్పుడు లేదా ఉడకబెట్టేటపుడు తన స్వభావాన్ని కోల్పోతుంది. సాధారణంగా 170-300 మైక్రోగ్రాముల అయోడిన్‌లో 30 నుంచి 70శాతం ఉడికేటపుడు ఆవిరైపోవడం వల్ల ఆహార పదార్థాల ద్వారా 100-160 మైక్రోగ్రాముల అయోడిన్ మాత్రమే శరీరానికి అందుతోంది. సగటున ఒక మనిషి పది గ్రాముల ఉప్పు తీసుకుంటే, అయోడైజ్డ్ ఉప్పు వల్ల అదనంగా మరో 70 మైక్రో గ్రాముల అయోడిన్ శరీరంలోకి చేరుతుంది. మొత్తం మీద శరీరానికి అందుతోన్న అయోడిన్ మాత్రం స్వల్పంగానే ఉంటోంది. కాబట్టి మామూలు ఉప్పు బదులు అయోడైజ్డ్ ఉప్పు వాడడం వల్ల అయోడిన్ లోపాల వల్ల వచ్చే అంగవైకల్యాలను నివారించవచ్చు.

**సూక్ష్మపోషక ఖనిజాలు**

శరీరానికి సోడియమ్, పొటాషియం, మెగ్నిషియం అనేవి ఎలక్ట్రోలైటిక్ బ్యాలెన్స్ నిర్వహించడానికి కావాలి. ఇవేకాక జింక్, కాపర్, క్రోమియమ్, మాంగనీస్, సెలీనియమ్‌లు కణాలు పనిచేయటానికి కావాలి. ఎముకలు, దంతాలు ధృడంగా ఉండడానికి ఫ్లోరైడ్ అవసరం. అయితే మనం తీసుకునే వివిధ ఆహార పదార్థాల ద్వారా ఇవి అందడం వల్ల వీటి లోపాలు కొన్ని తప్ప మరీ ఎక్కువగా మనకు కనబడవు.

**సోడియం**

సోడియం, పొటాషియం ద్వయం కణాల లోపల, బయట ఉన్న ద్రవ పదార్థాల ఆమ్ల మరియు క్షార సమతుల్యతను కాపాడతాయి. అంతేకాదు ఇవి కణాల ఆస్మాటిక్ బ్యాలెన్స్‌ను మెయింటెయిన్ చేయడం వల్ల, అవి వాటి రూపును, పరిమాణాన్ని కోల్పోవు.



StanikapalanaAditionJune2011_36to39and61to64Color_FSr.pmd 31/05/2011, 02:54 PM

గ్లూకోజ్, గిలక్టోజ్ మరియు అమైనో ఆమ్లాలను ప్రేవులు శోషణ చేసుకోవడంలో సోడియం ప్రమేయం ఉంది. గుండె కొట్టుకోవడం ప్రారంభానికి, నిర్వహించడానికి దీని ఆవశ్యకత ఉంది. వృక్ష సంబంధ ఆహార పదార్థాలన్నింటిలో పొటాషియం, సోడియం కూడా కావలసిన పాళ్ళలో లభిస్తుంది.

సాధారణ వ్యక్తులు సోడియం రోజుకి 5110 గ్రాములు తీసుకోవాలి. కుటుంబ చరిత్రను బట్టి అధిక రక్త పీడనం గలవారై ఉంటే వారు సోడియం పరిమాణాన్ని 5 గ్రాముల కంటే ఎక్కువ తీసుకోకూడదు. మనం రోజు తీసుకునే కూరగాయల ద్వారా ఈ పరిమాణాన్ని పొందవచ్చు. అందుచేత వీరు ఉప్పును చాలా తగ్గించి లేదా అసలు తీసుకోకపోవడం చాలా అవసరం. 6 గ్రాముల సోడియం క్లోరైడ్ అంటే సాధారణ ఉప్పులో 2.4 గ్రాముల సోడియం ఉంటుంది.

సోడియం లోపం ఉంటే, సీరమ్ సోడియం స్థాయి సాధారణ స్థాయి కన్నా తక్కువగా పడిపోతుంది. ఈ స్థితిని హైపోవేట్రేమియా అంటారు. అతిసారం లేదా డయోరియా మరియు వాంతులు, దీర్ఘకాల మూత్రనాళ సంభంధిత రోగాలు సోడియం లోపానికి దారి తీస్తాయి. సోడియం లోపం వలన రక్తపీడనం తగ్గడం, ప్రసరణ వ్యవస్థ దెబ్బతినడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. అలాంటప్పుడు ఉప్పునీటిని తీసుకుంటే శరీరము తేరుకుంటుంది. రక్తపీడనం లేదా బిపి పెరగడం, శరీరంలో నీరు చేరడం వంటి లక్షణాలు హైపర్ నెప్రిమియాలో కనిపిస్తాయి. కొంతవరకు మూత్రపిండాల సమస్యలు కూడా ఏర్పడతాయి. గర్భవతులకు అధిక రక్తపీడనం కలిగే అవకాశం ఉంటుంది. కొన్ని హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది.

## పొటాషియం

పొటాషియం మన శరీర కండర నాడీ వ్యవస్థలు సక్రమంగా పని చేసేటట్లు చూస్తుంది. ఇది మన దేహంలో నీటి సమతుల్యతను నిర్వహించడంలో తోడ్పడుతుంది. హృదయ కండర చురుకుదనంపై ప్రభావం కలిగి ఉంటుంది. పెద్దలకు కావలసిన పొటాషియం రోజుకి 3250-3750 మైక్రోగ్రాములు. పిల్లలకు కావలసిన పొటాషియం రోజుకి 1100-5000 మైక్రోగ్రాములు. పొటాషియం సమృద్ధిగా గల ఆహార పదార్థాలు - అరటి పళ్ళు, టమోటాలు, తొక్క తీయని బంగాళదుంపలు, తోటకూర వంటి ఆకుకూరలు, ఆకు పచ్చని కూరగాయలు, నారింజ వంటి నిమ్మజాతి పండ్లు, ఎండిన పళ్ళు, చిక్కుళ్ళు మొదలైనవి. గుర్తించుకోండి! కొబ్బరి నీళ్ళలో సుమారు లీటరుకు 250 మిల్లీ గ్రాముల పొటాషియం ఉంటుంది.

పొటాషియం లోపం ఉంటే సీరమ్ పొటాషియం స్థాయి తగ్గిపోయే స్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితిని హైపోకెలీమియా అంటారు. దీని వల్ల దీర్ఘకాల అతిసారం, వాంతులతో బాధపడతారు. కండరాల బలహీనత, నాడీ స్పందనలు పెరగడం, గుండె పరిమాణం పెరగడం, హఠాత్తుగా గుండె ఆగిపోవడం వంటి పరిస్థితులకు దారి తీస్తుంది. పొటాషియం సమృద్ధిగా గల అరటి పళ్ళు, బత్తాయి లేదా కొబ్బరి నీళ్ళు వంటి వాటిని తీసుకోవడం ద్వారా పొటాషియమ్‌ను పొందవచ్చు. కొన్ని సందర్భాలలో నరాల ద్వారా లవణ ద్రవాలను ఎక్కించడం ద్వారా పొటాషియం అందించి చికిత్స చేయవచ్చు.

ఒకవేళ పొటాషియం అధికంగా తీసుకుంటే శరీరంలో పొటాషియం గాఢత పెరుగుతుంది. దీనిని హైపర్ కెలీమియా అంటారు. దీని వలన మూత్రపిండాలు దెబ్బతినడం, డయాబెటిక్ కోమా, శరీరంలో తీవ్రమైన నిర్జలీకరణ స్థితి ఏర్పడుతుంది. మానసిక చాంచల్యం, స్పర్శజ్ఞానం లేకపోవడం, గుండె కొట్టుకునే వేగం తగ్గడం మరియు చివరికి గుండె ఆగిపోవడం వంటి లక్షణాలు కన్పిస్తాయి.

## జింక్

జింక్ శరీరంలో చాలా ఎంజైమ్‌లలో ప్రధానమైన సహా మూలకంగా కలిసి ఉంటుంది. అలాగే ఈ ఖనిజ పోషక పదార్థం రోగనిరోధక వ్యవస్థకు తోడ్పడి అనారోగ్యాలను, అంటు వ్యాధులను ఎదుర్కొంటుంది - కణ విభజనకు, కణాల పెరుగుదలకు తోడ్పడుతుంది. గాయం తగిలినపుడు గాయాలను మాన్పడానికి సహకరిస్తుంది. ఇది ఒక మంచి యాంటీ ఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. మన కంటి రెటీనా పొరలో గల రాడ్ కణాలలో గల విటమిన్ 'ఎ' సక్రమంగా పని చేయడానికి ఇది అవసరం. దీని వలన రాత్రి సమయంలో దృష్టి బాగుంటుంది.

జింక్ లోపం వల్ల శరీర పెరుగుదల లోపించి మరుగుజ్జుదనానికి దారి తీస్తుంది, గోనడల్ పనులకు అంతరాయం కలుగచేస్తుంది. దీనినే హైపోగొనడిసమ్ అంటారు. ఇరాన్ మరియు ఈజిప్ట్ దేశాలలో జింక్ లోపం కారణంగా చాలా మంది మరుగుజ్జుతనం లేదా డ్వాఫిజమ్ మరియు హైపోగోనడిసమ్‌తో బాధపడుతున్నారు. అయితే మన దేశంలో ప్రజలలో సబ్ - క్లినికల్ లెవెల్‌లో లోపాన్ని కనుగొన్నా, వాటి ప్రభావం ప్రజలలో కనబడడంలేదు.

చిక్కుళ్ళు, బఠాణీలు, మాసూరు పప్పు లేదా లెంటిల్స్, వేరు శెనగలు, ప్రొద్దు తిరుగుడు విత్తనాలు, గుమ్మడి విత్తనాలు వంటి గింజలు, గోధుమ వంటి ధాన్యాలు, మాంసం, పుదీన, బెండ, క్యారెట్లు వంటి అనేక రకాల కూరగాయలను జింకు ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలుగా చెప్పవచ్చు.

## రాగి

రక్తములోని హిమోగ్లోబిన్ సాధారణ స్థాయిలో నిర్వహించడానికి రాగి అవసరమవుతుంది. చాలా ఎంజైమ్ వ్యవస్థలో ఇది భాగమవుతుంది. మనం భుజించే ఆహారంలో రోజుకి 2 మిల్లీగ్రాముల రాగి తప్పనిసరిగా ఉండాలని సూచించడం జరిగింది. సముద్ర సంబంధిత ఆహార పదార్థాలలో గుల్ల చేపలు, పీతలు / వంటి మాంస సంబంధిత ఆహార పదార్థాలు, గింజ ధాన్యాలు, బాదం పప్పులు, నువ్వులు, ప్రొద్దు తిరుగుడు పువ్వు విత్తనాలు, సోయా గింజలలో రాగి కావలసిన పాళ్ళల్లో లభిస్తుంది. రాగి లోపం వలన



StanikapalanaAditionJune2011_36to39and61to64Color_FSr.pmd 31/05/2011, 02:54 PM

న్యూట్రోపెనియా అంటే తెల్లరక్తకణాల సంఖ్య తగ్గడం, రక్తహీనత, ఎముకల జబ్బులకు దారి తీస్తుంది. రాగి ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకుంటే అది శరీరంపై విష ప్రభావం చూపుతుంది. విషపదార్థాలుగా మారుతుంది. కడుపులో తిప్పడం వాంతులవ్వడం, తీవ్రమైన విష ప్రభావం వల్ల ఒక్కొక్కసారి మరణం కూడా సంభవించవచ్చు.

## మాంగనీస్

అనేక ఎంజైమ్‌ల్లో మాంగనీస్ భాగంగా ఉంటుంది. అంతేకాదు, మాంసకృత్తులలో భాగం అయిన డీఆక్సిరైబో న్యూక్లియిక్ ఆమ్లం (డిఎన్ఎ) రైబో న్యూక్లిక్ ఆమ్లం (ఆర్ఎన్ఎ) ల సంశ్లేషణలో కలిసి ఉంటుంది. కొలెస్టరాల్ వంటి అనేక సంయోగ పదార్థాల తయారీలో ప్రమేయం ఉంది. మన దేశంలో లభించే ఆహార పదార్థాలతో మాంగనీస్ 4-10 మిల్లీ గ్రాములు లభిస్తుంది. అయితే ఇది 5-20 శాతం మాత్రమే శరీరం వినియోగించుకుంటుంది.

గోదుమ పొట్టు, బియ్యపు తేట, ఓట్లు, ఎముకలు, కాలేయం , కిడ్నీలలో సమృద్ధిగా లభిస్తుంది. పైనాపిల్, చిక్కుళ్ళలో మితంగా ఈ ఖనిజ పోషక పదార్థం లభిస్తుంది.

మనకు ప్రతి రోజు 2.5 నుంచి 7 మిల్లీ గ్రాముల మాంగనీస్ అవసరమవుతుంది. ఒకవేళ మనం తీసుకునే ఆహారంలో 0.71 మిల్లీ గ్రాముల కంటే తక్కువగా వుంటే దీని లోపం శరీరంలో కనబడుతుంది. అలాగే 1 గ్రాము కంటే ఎక్కువ తీసుకుంటే దీని విష ప్రభావం శరీరంపై చూపుతుంది.

## మెగ్నీషియం

ఎముకల, దంతాల నిర్మాణానికి మెగ్నీషియమ్ అవసరం అవుతుంది. పిండి పదార్థాల జీవ ప్రక్రియలకు, శక్తి విడుదల కావడానికి ఇది తోడ్పడుతుంది. నరాల, కండరాల కార్యకలాపాలకు మెగ్నీషియమ్ అవశ్యకత ఉంది. పుదీనా, గుమ్మడి గింజలు, గుల్ల చేపలు, ప్రొద్దు తిరుగుడు పువ్వు విత్తనాలు, తోటకూర, నిండు ధాన్యాలు, పాల ఉత్పత్తులు మొదలైనవి. ఇవి లభించే వనరులు, పండ్లు, తీవ్ర పౌష్టికాహార లోపం గల వారిలో, త్రాగుడుకు బానిసై లివర్ సిరోసిస్ వచ్చిన వ్యక్తులలో మెగ్నీషియమ్ లోపం ప్రస్ఫుటంగా కనబడుతుంది. మెగ్నీషియం లోపం కారణంగా నరాల, కండరాల సంబంధిత బాధలు, బలహీనతలు, నరాల ఈడ్పు లాంటి వ్యాధులు వస్తాయి.

## సెలీనియమ్

ప్రోటీన్ నిర్మాణంలో భాగమైన సెలినోస్టిన్ అనే అమైనో ఆమ్లంలో సెలీనియం చేరి ఉంటుంది. ఇది ఒక యాంటీ ఆక్సిడెంట్‌గాను, విషరహితంగాను, రోగ నిరోధక శక్తికి ప్రేరణగాను పనిచేస్తుంది. ఆహారంలో ఇతర లోహాలతో కూడుకుని ఉన్నందువల్ల ఇది పరిమితంగా శరీరంలో శోషించుకోబడుతుంది. సెలీనియం కాలేయంలోను, కిడ్నీలోను, కండరములోను కేంద్రీకృతమై ఉంటుంది.

ప్రతిరోజు 70 మైక్రోగ్రాముల సెలీనియం అవసరమవుతుంది. గర్భిణీ దశలోను, పాలిచ్చేటప్పుడు 10-15 మైక్రోగ్రాములు అధికంగా కావలసి వస్తుంది. దీని లోపం ముఖ్యంగా మాంసకృత్తులు మరియు శక్తి జనకాల లోపానికి గురై అరుగుదల లేక పోషణ లోపంతో బాధపడుతున్న వారిలో, గుండె సంబంధ వ్యాధిగ్రస్తులలో, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులలో, ఔషదరూపంలో నరాల ద్వారా పోషణ అందుతున్న రోగగ్రస్తులలో ఈ లోపం కనబడుతుంది.

గోధుమ గింజలలో, ఎండిన పళ్ళలో, పుట్టగొడుగులు, నక్క దోసకాయ లేదా కుకుంబర్, మనం త్రాగే నీటిలో కూడా సెలీనియం ఉంటుంది.

## ఫ్లోరైడ్

ఎముకలు మరియు దంతాలు ధృడంగా, ఆరోగ్యంగా ఉండటానికి ఫ్లొరైడ్ అనే ఖనిజ పోషక పదార్థం అవసరం. ఆహారం ద్వారా గాని, నీటి ద్వారా గాని 1-2 మిల్లీ గ్రాముల ఫ్లోరైడ్ తీసుకుంటే అది దంత క్షయాన్ని నివారించడమే కాకుండా వాటిని ధృడంగా ఉంచుతుంది. అయితే ఈ పోషక పదార్థం అతి తక్కువగా లేదా ఎక్కువగా తీసుకున్న ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది.

వాతావరణంలో లేదా నీటిలో 2-3 మిల్లీ గ్రాములు కంటే ఫ్లొరైడ్ ఎక్కువ ఉన్నట్లయితే, అక్కడి వారి ఎముకలు గట్టి పడతాయి. వెన్నుపూస వంగుతుంది. పెద్ద గూని వస్తుంది. కాళ్ళు రాళ్ళ మాదిరిగా బరువెక్కుతాయి. అలాంటి పరిస్థితులలో ఎవరూ కాయ కష్టం చేయలేరు. క్రమేణ కదలడం కూడా కష్టంగా మారుతుంది. ఏమి పని చేయలేక మంచం పట్ట వలసి వస్తుంది. దీనిని ఫ్లొరోసిస్ వ్యాధి అంటారు. మన రాష్ట్రంలో నల్గొండ జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలి ఉంది.

మనం సాధారణంగా తీసుకునే ఆహారం వల్ల 0.3 - 0.8 మిల్లీ గ్రాముల ఫ్లొరైడ్ సమకూరుస్తుంది. కొన్ని ప్రాంతాలలో 2 మిల్లీ గ్రాముల వరకు కూడా ఆహారం ద్వారా ఫ్లొరైడ్ అందుతోందని తెలుస్తోంది. ఆహారంలోని ఫ్లొరైడ్ 50 నుంచి 80 శాతం శరీరం శోషణ చేసుకుంటుంది. అలాంటప్పుడు, నీటిలో ఎక్కువగా ఫ్లొరైడ్ ఉన్న ప్రాంతాలవారు దీనిని తొలగించి, ఆ నీటిని తీసుకోవాలి. ప్రభుత్వం ఫ్లొరైడ్ ప్రబలి ఉన్న ప్రాంతాలలో డీఫ్లొరిడేషన్ ప్లాంటులను నెలకొల్పింది. అలాగే అక్కడ నివసించే ప్రజలు ఇంటి దగ్గరే నీటిలో ఫ్లొరైడ్‌ను తొలగించే కొన్ని ప్రక్రియలను అవలంబించి ఆ నీటని తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండవచ్చు.

స్థూల, సూక్ష్మ ఖనిజ పోషక పదార్థాలు గల ఆహారం సరైన అవగాహనతో ఎంపిక చేసుకొని రోజూ తినుకోవడం వలన ప్రమాదకరమైన వ్యాధులను రాకుండా చూసుకోవడమే కాకుండా ఆరోగ్యంగా జీవించవచ్చు.

**- డా॥ ఎ.సాయిబాబా**
**ఐ.ఐ,హెచ్.ఎఫ్.డబ్ల్యు**

Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : K. Chandra Mouli**



StanikapalanaAditionJune2011_36to39and61to64Color_FSr.pmd 31/05/2011, 02:54 PM


సునామీల నుంచి,
తుపానుల నుంచి మనను కాపాడేది
ఈ మడ అడవులే
జూన్ 5న
ప్రపంచ
పర్యావరణ
దినోత్సవం
పర్యావరణాన్ని, పచ్చదనాన్ని రక్షించుకుందాం - భూమిని కాపాడుకుందాం

RNI No. APTEL / 2009/27888

